10-07Pg1exHMNWJQE_10-07Pg1exHMNWJQE.qxd 09/Jul/26 11:33 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 160 పేజీలు: 12 వెల: 6.50

## ఆ ఉత్పత్తులకు సుంకాల్లేవ్
మోడీ పర్యటనకు ముందు న్యూజిలాండ్ ప్రకటన 9లో

## ఖమేనీకి జన నీరాజనం
అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

# భారత్-ఆస్ట్రేలియా స్నేహానికి భారతీయ సమాజమే బలమైన స్తంభం

- 'మెల్‌బోర్న్ మీట్స్ మోడీ'లో ప్రధాని మోడీ
- ఇరు దేశాల సంబంధాలను క్రికెట్‌తో పోలిక
- వన్డే మ్యాచ్‌లా సమావేశాల అజెండా
- టి20లా ఇండియా-ఆసీస్ నిర్ణయాలు
- టెస్ట్ మ్యాచ్‌లా ఇరుదేశాల భాగస్వామ్యం
- భారతీయ మిత్రుడు అల్బనీస్ అంటూ ప్రశంసలు
- ఆస్ట్రేలియా ప్రధానితో మోడీ ద్వైపాక్షిక చర్చలు
- అణు ఇంధనం నుంచి రక్షణ వరకు కీలక ఒప్పందాలు
- భారత్‌కు యురేనియం సరఫరాకు మార్గం సుగమం
- స్వదేశానికి చేరిన మూడు ప్రాచీన పురావస్తువులు


'మెల్‌బోర్న్ మీట్స్ మోడీ'లో ప్రవాసభారతీయులకు ప్రధాని మోడీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ అభివాదం

**మెల్‌బోర్న్, జులై 9:** ఆస్ట్రేలియా పర్యటనలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మెల్‌బోర్న్‌లో అఖండ స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులు భారీ సంఖ్యలో పాల్గొన్న 'మెల్‌బోర్న్ మీట్స్ మోడీ' కార్యక్రమంలో ప్రధాని మోడీ భారత్- ఆస్ట్రేలియా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆస్ట్రేలియాలోని భారతీయ సమాజం రెండు దేశాల మధ్య స్నేహ బంధానికి ముఖ్యమైన శక్తిగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. భారత్- ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు కేవలం ప్రభుత్వాల మధ్యమాత్రమే కాకుండా ప్రజల మధ్య అనుబంధంతో మరింత బలపడుతున్నాయని మోడీ వ్యాఖ్యలు స్పష్టం చేశాయి.
మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి దాదాపు 30 వేల మంది హాజరయ్యారు. ప్రవాస భారతీయుల ఉత్సాహం, మద్దతు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రధాని మోడీ తన ప్రసంగంలో భారతీయ సమాజాన్ని భారత్-ఆస్ట్రేలియా స్నేహానికి 'బలమైన స్తంభాలలో ఒకటి'గా అభివర్ణించారు. 'మెల్‌బోర్న్‌లోని భారతీయ సమాజం మధ్య ఉండటం ఎంతో ఉత్సాహంగా ఉంది. వారి శక్తి, ఉత్సాహం సాటిలేనివి. వారు భారత్‌ఆస్ట్రేలియా స్నేహానికి కీలకమైన బలమైన స్తంభాలు' అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రసంగంలో ప్రధాని మోడీ క్రికెట్‌ను కూడా ప్రస్తావిస్తూ భారత్- ఆస్ట్రేలియా సంబంధాలను క్రీడతో పోల్చారు. మెల్‌బోర్న్‌వంటి క్రీడానగరంలో క్రికెట్ గురించి మాట్లాడకుండా ఉండటం సాధ్యంకాదని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. క్రికెట్ రెండు దేశాల మధ్య ఒక 'దౌత్య భాష'గా మారిందని చెప్పారు. భారత్- ఆస్ట్రేలియా భాగస్వామ్యాన్ని క్రికెట్ ఫార్మాట్లతో పోల్చిన ప్రధాని, 'మన సమావేశాల అజెండా వన్డే మ్యాచ్‌లా స్పష్టంగా ఉంటుంది. నిర్ణయాలు టి20లా వేగంగా ఉంటాయి. మన భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్‌లా దీర్ఘకాలికంగా, బలంగా ఉంటుంది' అని అన్నారు. ఈ వ్యాఖ్యలకు ప్రేక్షకుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. భారత్- ఆస్ట్రేలియా సంబంధాలు గత కొన్నేళ్లలో మరింత బలపడుతున్నాయని ప్రధానమంత్రి >>2

# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

- 2027 మార్చికి 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు
- వైసిపి తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్లచట్టమే
- పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై ఫొటోల పిచ్చిని రాజముద్రతో తుడిచేశాం
- పురాణాల్ని దూషించి, పాకిస్తాన్‌ను సమర్థించిన రావణ్‌కు వైసిపి ఆర్థిక సాయం
- ఓట్ల కోసం తండ్రి సమాధికి పూజలు చేస్తూ, బతికి ఉన్న తల్లికి ఆస్తి ఇవ్వక క్షోభ పెడుతున్నారు
- బనగానపల్లె సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు


గురువారం బనగానపల్లె ప్రజా వేదికలో పట్టాదారు పాసుపుస్తకం అందజేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి జనార్దన్ రెడ్డి

**నంద్యాల, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం ఉండేలా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సిఎం స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ "గడచిన రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందుతోంది. గత పాలకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయి. లక్షల కుటుంబాలు వారి అరాచకానికి బలి అయ్యాయి. నచ్చని వారిని భయపెట్టేందుకు వారి భూముల్ని గత పాలకులు 22ఏ కిందచేర్చారు. వివాదాలుసృష్టించి భూములు లాక్కునేందుకు ప్రయత్నాలు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరిట ఓ నల్ల చట్టాన్ని తెచ్చారు. ప్రజల ఆస్తుల్ని కాజేసేలా భయాందోళనలు సృష్టించారు. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తేవటమే సమస్యను మరింత జటిలం చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నల్ల చట్టాన్ని రద్దు చేశాం. భూ వివాదాల పరిష్కారానికి ధృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నాం. గత పాలకులు ప్రజల భూమిపత్రాలపైన, సర్వేరాళ్లపైనా ఫోటోలు ముద్రించుకున్నారు. ఆ ఫోటోల పిచ్చిని తుడిచేసేందుకు రాజ ముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తున్నాం. కట్టుదిట్టమైన భద్రతా ఫీచర్లను పెట్టి తప్పులు లేకుండా రైతులు, భూ యజమానులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. ఇదో ఉద్యమంగా, పవిత్రమైన కార్యక్రమంగా చేపట్టి భూయజమానులకు హక్కులు కల్పిస్తున్నాం. 2027 మార్చి నాటికి 9833 గ్రామాల్లో 72,70,605 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేస్తాం. ఎపిని ఎలాంటి భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం. విలేజ్ ఇనామ్ భూములను కూడా 22ఏలో పెట్టేశారు. వీటిని 1971 గ్రామాల్లో రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశాం. ఆటో >>2


సౌత్ కొరియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రతినిధులతో మంత్రి లోకేష్

# నాలెడ్జ్ ఎకానమీగా ఎపి

## దక్షిణ కొరియా సహకారమందించాలి

- 10జిడబ్ల్యు డేటా సెంటర్ మౌలిక సదుపాయాల్లో భాగస్వామ్యం వహించండి
- స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని చేరుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌కు చేయూత అందించండి
- యువతను ఫ్యూచర్ స్కిల్ వర్క్ ఫోర్స్‌గా మార్చేందుకు సహకరించండి

### సౌత్ కొరియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఉప మంత్రి కామ్చాన్ కాంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ

**విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేందుకు సౌత్‌కొరియా సహకారంఅందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. గురువారంఆయన దక్షిణ కొరియాలో ఐదవ రోజు పర్యటనలో భాగంగా సౌత్ కొరియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఉప మంత్రి కామ్చాన్ కాంగ్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ యువతను భవిష్యత్తుకు సిద్ధమయ్యే డీప్ టెక్ వర్క్‌ఫోర్స్‌గా తయారుచేయడానికి కొరియా విశ్వవిద్యాలయాలు సహకారం అందించాలనికోరారు. ఆంధ్రప్రదేశ్‌లో 2029నాటికి 20లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యానికి మద్దతుగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, పాదరక్షల >>2

# హస్త కళాకారులకు ఆరోగ్య పరీక్షలు



- సంప్రదాయ కళాకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
- కళను కాపాడాలంటే ముందు కళాకారుడిని కాపాడాలి
- 'ఎక్స్' వేదికగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** సంప్రదాయ కళలను పరిరక్షించడం అంటే వాటిని ప్రోత్సహించడం మాత్రమే కాదని, వాటిని జీవనాధారంగా చేసుకున్న కళాకారుల ఆరోగ్యం, సంక్షేమాన్ని కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. హస్త కళాకారులకు తానిచ్చిన వాగ్దానాన్ని అనుసరించి క్షేతస్థాయిలో కళాకారుల కోసం ఆరోగ్య శిబిరాల నిర్వహణ ప్రారంభించినట్లు వివరించారు. ఇటీవల విజయవాడలో ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో మాట్లాడిన సమయంలో వారు ఎదుర్కొంటున్న వృత్తి సంబంధిత ఆరోగ్య సమస్యలు తన దృష్టికి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. గురువారం 'ఎక్స్' వేదికగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో ఆత్మీయంగా మమేకమయ్యే అవకాశం లభించిందన్నారు. వారి అసాధారణనైపుణ్యం, అపారమైన ఓర్పు, వృత్తి పట్ల ఉన్న అంకితభావం ఎంతో ఆకట్టుకు >>2

నేడు ముంబయికి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ 2లో



# గోదావరి పరవళ్లు

- పోశమ్మ తల్లి గర్భ గుడిని తాకిన వరద నీరు
- దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల

**దేవీపట్నం జూలై 9 ప్రభాత వార్త:** గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షలకు గోదావరి నదిలోకి వరద నీరు వచ్చి చేరటంతో గొందూరు గండి పోశమ్మ ఆలయం వద్ద క్రమేపి వరద నీటి మట్టం పెరుగుతూ వస్తుంది. నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆలయ ప్రాంగణంలోనికి భారీగా వరద నీరు చేరింది. ఇదిలా ఉంటే ఇంకా గోదావరి పెరగవచ్చు అని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. గతంలో ఆలయ శిఖరాలను వరద నీరు తాకిన వైనాలు ఉన్నాయి. భక్తుల రక్షణ, భద్రత దృష్యా అమ్మవారి దర్శనాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మలుగుల శ్రీనివాస్ రెడ్డి, ఆలయ అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి నది వరద ఉధృతి తగ్గి, నీరు పూర్తిగా తగ్గుముఖం పట్టిన తర్వాతే తిరిగి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తామని ఆలయ వర్గాలు స్పష్టం చేశాయి. దర్శనాలు పునఃప్రారంభమయ్యే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఆలయ వర్గాలు తెలిపాయి. అప్పటివరకు భక్తులెవరూ పోశమ్మ తల్లి ఆలయానికి రావద్దని ఆలయ చైర్మన్ ఎమ్. శ్రీనివాస రెడ్డి, మరియు కార్యనిర్వాహణాధికారి ఉమ్మడి ప్రకటనలో భక్తులకు సూచించారు.
ప్రస్తుతం గోదావరి నది ప్రమాదకర స్థాయిల్లో, అతి వేగంగా ప్రవహిస్తోంది. కావున స్థానికులు, భక్తులు, పర్యాటకులు ఎవరూ కూడా గోదావరి నది ఒడ్డుకు గానీ, నది పరివాహక ప్రాంతాల్లోకి గానీ వెళ్లకూడదని అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా నది వద్ద నిలబడి ఫోటోలు తీసుకోవడం, సెల్ఫీలు దిగడం వంటి పనులు ప్రాణాంతకమని. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని ఆలయ కమిటీ కోరింది.

**నిధులు మంజూరు అయినా నీళ్ల పాలేనా?**
పోలవరం నిర్వాసితులు గ్రామాలు ఖాళీ చేసి దాదాపు ఐదేళ్లు కావస్తుంది. అప్పటి నుంచి ఏటా గోదావరి కి వరద వస్తే తల్లి పోశమ్మ నీట మునగ వల్సిందే. భక్తులు మొర విన్న ప్రభుత్వంలో పెద్దలు అమ్మవారి ఆలయ పునః నిర్మాణానికి రూ 207కోట్లు రూపాయలు మంజూరు చేస్తూ ప్రకటన కూడా చేశారు. టెండర్లో జాప్యమో గోదావరికి వరదలు సంభవిస్తే పనులకు ఆటంకం ఏర్పడుతుందని భావించారో ఆలయ నిర్మాణం కాస్త ప్రతిపాదన లోనే ఆగిపోయింది.
గిరిజనుల ఆడపడుచు గా ప్రసిద్ధి చెందిన పోశమ్మ ఆలయం పునః నిర్మాణం పై ఆలస్యం జరగటం పై గిరిజనులు మండి పడుతున్నారు. నిధులు మంజూరు అయి నాలుగు నెలలు కావస్తున్నా భక్తుల్లో పలు విమర్శలు వస్తున్నాయి. త్వరితగతిన ఆలయ పునః నిర్మాణం >>2




షుగర్ పేషెంట్లకు శుభవార్త

# 'అవిక్లీ' వచ్చేసింది

- వారానికో ఇంజెక్షన్ తీసుకుంటే చాలు
- భారత్ మార్కెట్‌ల్లోకి మెడిసిన్ విడుదల

**కొపెన్ హ్యాగన్,జులై 9:** మధుమేహం చికిత్సలో కీలక ముందడుగు పడింది. ప్రపంచంలోనే వారానికి ఒక్కసారి తీసుకునే బేసల్ ఇన్సులిన్‌ను భారత్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. డెన్మార్క్‌కు చెందిన ఔషధ సంస్థ నోవో నార్డిస్క్ 'అవిక్లీ' పేరుతో ఈ ఇన్సులిన్‌ను విడుదల చేసింది. టైప్1, టైప్2 మధుమేహంతో బాధపడే వారికి ఇది ఉపయోగపడనుంది. సాధారణంగా ఇన్సులిన్ తీసుకునే రోగులు రోజూ ఒకసారి లేదా అంతకంటే ఎక్కువసార్లు ఇంజెక్షన్ తీసుకోవాల్సి వస్తుంది. కొత్తగా వచ్చిన అవిక్లీతో వారానికి ఒక్కసారి ఇంజెక్షన్ తీసుకుంటే సరిపోతుంది. దీంతో ఏడాదికి 365 ఇంజెక్షన్ల స్థానంలో కేవలం >>2


గురువారం ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై నిర్వహించిన సెమినార్‌లో ప్రసంగిస్తున్న మంత్రి నాదెండ్ల

# రైతుల సమస్యలన్నీ ప్రణాళికతో పరిష్కరిస్తున్నాం

- రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు
- ఈ ఖరీఫ్ నుంచి పిపి బ్యాగుల వాడకం
- 48 గంటల్లోగా ధాన్యం రవాణా సొమ్ము జమ
- ఎపి పౌర సరఫరాల సంస్కరణలు దేశానికే ఆదర్శం
- 10 శాతం నూకల బియ్యం దేశ వ్యాప్తంగా ప్రజాపంపిణీలో అమలుకు కేంద్రం సన్నద్ధం
- మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ,జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** ఒకే యేడాదిలో ఖరీఫ్, రబీలో కలిపి రికార్డు స్థాయిలో 74 లక్షల మెటల్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 11.50లక్షల రైతుల వద్ద నుంచి ఈ ధాన్యాన్ని విజయవంతంగా కొనుగోలు చేశామని వివరించారు. ధాన్యం కొన్న డబ్బులను 24 గంటల్లోపే రైతుల ఖాతాలో జమ చేశామని మంత్రి స్పష్టం చేశారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు గోతాల సమస్య తీర్చేలా సరికొత్త సంస్కరణలు తీసుకువస్తామన్నారు. అలాగే ఎల్‌నినో ప్రభావంపై ఈ నెలాఖరుకు అంచనా వస్తుందని, దాని అనుగుణంగా తదుపరి ప్రణాళికలు సిద్ధం చేస్తామని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల >>2

# సుప్రీం చెంతకు సాయికృష్ణ కేసు

- సిఐ నాగరాజు కస్టడీలో షరతులు తొలగించాలని సిట్ పిటిషన్

**విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో నిందితుడు సస్పెండయిన సిఐ నాగరాజు కస్టడీలో షరతుల అంశంపై సిట్ సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కృష్ణలంక సిఐ నాగరాజును ఇప్పటికే సస్పెండ్ చేయడంతో పాటు అరెస్టు చేసి జైలుకు పంపిన ఎపి ప్రభుత్వం నియమించిన సిట్‌కు ఆయన కస్టడీ విషయంలో మాత్రం హైకోర్టులో అనుకున్న రీతిలో తీర్పు రాలేదు. నాగ >>2

# 'పవర్'లో రాజీలేదు

- నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి
- ఎల్ నినోతో తగ్గనున్న జలవిద్యుత్ ఉత్పత్తి
- పటిష్టంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్వహించాలి
- అధికారులకు ఇంధనశాఖ స్పెషల్ సిఎస్ విజయానంద్

**విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా తీర్చడంతో పాటు, ఆలస్యమైన నైరుతి రుతుపవనాలు, సాధారణం కంటే గణనీయంగా తక్కువగా నమోదైన వర్షపాతం నేపథ్యంలో వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విద్యుత్ సంస్థలను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల వినియోగదారులకు నాణ్యమైన, విశ్వసనీయమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడం రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యతఅని విజయానంద్ పునరుద్ఘాటించారు. సమర్థవంతమైన వనరుల నిర్వహణ, అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గరిష్ఠంగా వినియోగించడం, >>2



వెనెజులాలోని లాగ్వైరాలో అమెరికా మానవతా సహాయాన్ని అందుకుంటున్న భూకంప బాధితులు

# ప్రణాళికతో పరిష్కరిస్తున్నాం

>> ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తవడంపై పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలను అమలు చేసిందన్నారు. సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ద్వారా రైతులు, రైస్ మిల్లర్ల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ నిర్వహిస్తోందని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర చరిత్రలోనే అత్యుత్తమ ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో అధికారులు బాగా పని చేశారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో 74 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని వివరించారు. రూ.31 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి నాణ్యమైన బీటీటీ బియ్యం అందిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న 10 శాతం బ్రోకెన్ రైస్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. ప్రతి ధాన్యం బస్తాకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి,ట్రాక్,ట్రేస్ విధానం ద్వారా రైతు నుంచి ఫెయిర్ ప్రైస్ షాప్ వరకు పూర్తి వివరాలు తెలుసుకునే వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునే సౌకర్యాన్ని కల్పించామని వెల్లడించారు.గన్నీ బ్యాగులు, గోదాములు, రవాణా, తేమ శాతం వంటి అంశాల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకున్నామని నాదెండ్ల తెలిపారు. రవాణా జాప్యాన్ని నివారించేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను కూడా 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. ఆర్‌ఎఫ్‌ఐడీ స్టిక్కర్లు, సెన్సార్లతో లారీల కదలికలను పర్యవేక్షించే వ్యవస్థ అమలు చేస్తున్నామని చెప్పారు. తేమ కొలిచే మాయిశ్చర్ మీటర్లు అన్ని చోట్లా ఒకే కంపెనీ, ఒకే మోడల్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వరి ఉత్పత్తి సుమారు 15 శాతం తగ్గే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నాయన్నారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించి, అవసరమైన సూచనలు అందించి సమస్యలను అధిగమించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

**దేశం మెచ్చిన సంస్కరణలు**

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తీసుకొచ్చిన సంస్కరణలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. కేంద్ర ప్రభుత్వం సైతం రాష్ట్ర సంస్కరణలను అభినందించి దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు నిర్ణయించడం మనం సాధించిన అతి పెద్ద విజయం. ముఖ్యంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజలకు అందించే బియ్యం(పిడిఎస్)లో 10 శాతం మాత్రమే నూకలు (బ్రోకెన్ రైస్) వచ్చేలా, బియ్యం నాణ్యంగా ఉండేలా రాష్ట్రం తీసుకున్న నిర్ణయం కేంద్రాన్ని ఆకర్షించింది. దీనివల్ల ప్రజా పంపిణీలో అందిస్తున్న బియ్యం నాణ్యత పెరిగి, వాడకం అధికం అవుతుంది. గతంలో 25 శాతం నూకలు వచ్చే బియ్యం పంపిణీ జరిగేది. దీంతో విరిగిపోయిన బియ్యం ప్రజలు తినేందుకు, తీసుకునేందుకు ఇష్టపడేవారు కాదు. ఫలితంగా బియ్యం పక్కదారి పట్టేవి. అయితే రాష్ట్రంలో తీసుకొచ్చిన 10 శాతం నూకలు ఉండే బియ్యం విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ఇటీవల కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అడిగిన వెంటనే కేంద్రం అందిస్తున్న సాయం కూడా పౌర సరఫరాల శాఖ సేవలను మరింత మెరుగుపరుస్తోందన్నారు.

# 'పవర్'లో రాజీలేదు

>> థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్వహణను పటిష్ఠంగా అమలు చేయడం, అన్ని విద్యుత్ సంస్థల మధ్య సమన్వయంతో పనిచేయడం ద్వారా ప్రస్తుత పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించగలమనే పూర్తి విశ్వాసాన్ని విజయానంద్ వ్యక్తం చేశారు.

ఎపిజెన్‌కో ఇంచార్జ్ మేనేజింగ్ డైరెక్టర్, ఎపిసిపిడిసిఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి, ఎపిజెన్‌కో డైరెక్టర్లు ఎం.సుజయ్ కుమార్, పి.అశోక్ కుమార్ రెడ్డి, వి.ఉషా, ఎపిసిపిడిసిఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో హైడల్ విద్యుత్ ఉత్పత్తిపై నైరుతి రుతుపవనాల మందగమనంతో పాటు తక్కువ వర్షపాతం తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన పేర్కొన్నారు. గత యేడాది ఇదే కాలంలో రోజుకు 25 నుంచి 30 మిలియన్ యూనిట్ల వరకు హైడల్ విద్యుత్ ఉత్పత్తి జరిగిందని, ప్రస్తుతం జలాశయాలకు తగినంత నీటి ప్రవాహం లేకపోవడంతో అది రోజుకు కేవలం 5 నుంచి 6 మిలియన్ యూనిట్లకు మాత్రమే పరిమితమైందన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (సిఇఎ) అన్ని రాష్ట్రాలకు ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసిందని, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని విద్యుత్ సంస్థలు వాటిని తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన ఆదేశించారు.అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత వివేకంతో వినియోగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, విద్యుత్ డిమాండ్ అత్యధికంగా ఉండే పీక్ అవర్స్‌లో మాత్రమే హైడల్ విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దీనివల్ల నీటి నిల్వలను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు విద్యుత్ వ్యవస్థ స్థిరత్వాన్ని కూడా కాపాడవచ్చన్నారు. హైడల్ విద్యుత్ ఉత్పత్తి తగ్గనున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల పాత్ర అత్యంత కీలకమవుతుందని ఆయన స్పష్టం చేశారు. వార్షిక మరమ్మతులు (ఓవర్‌హాల్) జరుగుతున్న యూనిట్లు మినహా మిగిలిన అన్ని థర్మల్ యూనిట్లను పూర్తి సామర్థ్యంతో నిర్వహించాలని ఎపిజెన్‌కోను ఆదేశించారు. ప్లాంట్ అవైలబిలిటీ ఫ్యాక్టర్, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ముందస్తు నిర్వహణ చర్యల ద్వారా ఆకస్మిక అంతరాయాలను తగ్గించి, గరిష్ఠ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వల పరిస్థితిని కూడా సమీక్షించిన విజయానంద్, ప్రతి విద్యుత్ కేంద్రంలో కనీసం పది రోజుల అవసరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఎల్లప్పుడూ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ఫ్యూయల్ సప్లై అగ్రిమెంట్ల కింద బొగ్గు సరఫరా, రైల్వే రేకుల కేటాయింపు, రైలుసముద్ర రవాణా సమన్వయం, పోర్టుల ద్వారా సరఫరా తదితర అంశాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ ఇంధన సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా చూడాలని సూచించారు.

**ఎఇఇ నియామకాలు పూర్తిగా మెరిట్ ఆధారంగానే:**

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థల్లో ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఇఇ) పోస్టుల భర్తీకి సంబంధించి 25.06.2026న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా, మెరిట్ ఆధారంగానే నిర్వహించబడుతుందని ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (విజిలెన్స్ హెచ్‌ఆర్‌డి) సూర్యసాయి ప్రవీణ్ చంద్, స్పష్టం చేశారు. ఈ నియామకాలకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని, ఇప్పటివరకు సుమారు 23 వేల దరఖాస్తులు అందాయని తెలిపారు.

# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

>> వారసత్వ ఆస్తుల్ని సంబంధిత వ్యక్తులకు చెందేలా చేస్తున్నాం. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరులోని వట్టి చెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుందిలో చాలా ఏళ్లగా ఉన్న భూ వివాదాలను పరిష్కరించాం.
డోన్ నియోజకవర్గంలో ఉన్న 2074 ఎకరాల వక్ఫ్ భూముల్ని కూడా 22ఏలో గత పాలకులు పెట్టారు. ఆ భూముల్ని 22ఏ జాబితా నుంచి తొలగించి రైతుల సమస్యల్ని పరిష్కరించాం" అని సిఎం అన్నారు.

**వారు రాసింది రక్త చరిత్ర మాది అభివృద్ధి సంకల్పం**

"రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యల్ని పరిష్కరించటంతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి పనిచేస్తున్నాం. రాయలసీమ ముఖ చిత్రాన్ని మారుస్తున్నాం. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, అమ్కా డిఫెన్సు ఫైటర్ జెట్ ప్లాంట్ ఏర్పాటు అవుతోంది. డిఫెన్సు, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తదితర రంగాల్లో ప్రాజెక్టులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలతో రాయలసీమ రతనాల సీమగా మారుతుంది.
రాయలసీమలో తయారైన ఎన్ ఫీల్డ్ బుల్లెట్‌లు దేశమంతా తిరుగుతాయి. రూ.40 వేల కోట్ల ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా మారుతుంది.
నగరాలు, పట్టణాల కంటే కడప జిల్లా లింగాల వంటి ప్రాంతాల్లోనే తలసరి ఆదాయం ఎక్కువ ఉంది. నంద్యాలలోనూ హార్టికల్చర్ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సీజన్‌లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే జలధార కార్యక్రమాన్ని కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాం. నంద్యాల జిల్లాలో 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్ డ్యామ్‌లు నిర్మించిన జిల్లా యంత్రాంగానికి అభినందనలు. వర్షపు నీటిని భూగర్భజలాలుగా మార్చుకుంటే నీటి భద్రత సాధ్యం అవుతుంది. రాయలసీమలో వారు రక్త చరిత్ర రాస్తే మేం అభివృద్ధి సంకల్పం చేస్తున్నాం. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటమే లక్ష్యంగా కూటమి ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. ప్రజలకు అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలు, సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుని దానికి అనుగుణంగా పనితీరు మెరుగు పర్చుకుంటున్నాం. ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించటమే ప్రభుత్వ లక్ష్యం. బాగా పనిచేసిన అధికారులను అభినందిస్తున్నాను. రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్నాం. ఎవరు అఘాయిత్యానికి పాల్పడినా అదే వారికి చివరి రోజు అవుతుంది. రాష్ట్రంలో అత్యుత్తమ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసి మెరుగైన విద్య, జీవన ప్రమాణాలు అందించాలని ఆలోచన చేస్తున్నాం" అని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**హే రామ్ అంటూ రావణుడికి సమర్థనా?**

"కుట్రలు కుతంత్రాలతో కులం, మతం, ప్రాంతం, వర్గాలతో సమాజాన్ని విడగొట్టాలని గొడ్డలి పార్టీ ప్రయత్నం చేస్తోంది. గంజాయి బ్యాచ్‌ను, బ్లేడ్ బ్యాచ్‌లను, రౌడీయిజాన్ని వైసిపి ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో విధ్వంసం చేస్తోంది. అంతర్వేది రథం దగ్ధం, దుర్గమ్మ గుడిలో వెండి సింహాల చోరీ, రామతీర్థంలో రాముడి విగ్రహం ధ్వంసం చేసినా గత పాలకులు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత పాలకులు తిరుపతి వెంకన్న ప్రసాదాన్ని కల్తీ చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. ఇలాంటి ఘోరాలు చాలా చేశారు. ఇలాంటి వాటిని ప్రక్షాళన చేస్తున్నాం. రెండు రోజుల క్రితం ఆదోనిలో శివాలయంలోని దీపంలో ఓ దుర్మార్గుడు సిగరెట్ వెలిగించి అపచారం చేశాడు. వెంటనే కేసు పెట్టి నిందితుడ్ని అరెస్టు చేశాం. మత విద్వేషాలు రగిలించేలా ఎవరు దుశ్చర్యకు పాల్పడినా కూటమి ప్రభుత్వం క్షమించదు. సామాజిక మాధ్యమాల్లో కొందరు దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. రావణ్ అనే వ్యక్తి పురాణాల్ని దూషిస్తాడు, మన రాముడిని, సీతపై నీచంగా మాట్లాడతాడు. తీవ్రవాదాన్ని, పాకిస్తాన్ ను సమర్థిస్తాడు. అలాంటి వారికి గొడ్డలి పార్టీ ఆర్థిక సాయం అందిస్తుంది. ఎంతటి బరితెగింపు ఇది. ప్రజలు దీనిని గుర్తించాలి. వారి పోకడలు ఏమిటో తెలుసుకోవాలి. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తినే దూషిస్తున్న వారికి సామాన్య ప్రజలు ఏం లెక్క. తిరుమలకు వెళ్లి డిక్లరేషన్ ఇమ్మంటే వాటిని తిరస్కరించి అపచారం చేశారు. నేను చర్చికి వెళ్లినా, మసీదుకు వెళ్లినా అక్కడి మతాచారాలను గౌరవిస్తాను. హే రామ్ అంటూ రావణుడ్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులను ఏమనాలో తెలీడం లేదు. కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కూడా ఇలాంటి వింతలు విచిత్రాలు జరుగుతాయని చెప్పారు. మతవిద్వేషాలు ఎవరు రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా చూస్తూ ఊరుకోం. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి వైసిపికి చెందిన వాడే అని తెలిసి తోక ముడిచారు. ఓట్లు కోసం తండ్రికి పూజలు చేస్తున్నాడు. బ్రతికి ఉన్న తల్లికి మాత్రం ఆస్తి ఇవ్వకుండా క్షోభ పెడుతున్నాడు. ఇలాంటి వ్యక్తులు మన సమాజానికి అవసరమా. తల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తులు మనకు ఎందుకు?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అనంతరం బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం చంద్రబాబు పరిశీలించారు. వెదురుతో తయారు చేసిన ఆభరణాలను సిఎం ఆసక్తిగా పరిశీలించారు. డ్వాక్రా, మెప్మా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను స్వయం బ్రాండ్ పేరిట మార్కెటింగ్ చేయాలని సిఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఎన్.ఎం.డి. ఫరూఖ్, బిసి జనార్దన్ రెడ్డి, నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి, భూమా అఖిలప్రియ, గిత్త జయసూర్య, బుడ్డా రాజశేఖరరెడ్డి, గౌరు చరితారెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా,తదితరులు పాల్గొన్నారు.

# 'అవిక్లీ' వచ్చేసింది

>> 52 వేసుకుంటే చాలు. రోజూ సూది తీసుకోవాలనే భయంతో చాలామంది ఇన్సులిన్‌ను ఆలస్యంగా ప్రారంభిస్తుంటారని, ఈ సమస్యకు కొత్త చికిత్స ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. భారత్‌లో ప్రస్తుతం దాదాపు 10.1 కోట్లమంది మధుమేహంతో బాధపడుతున్నారు. మరో 13.6 కోట్ల మందిలో ప్రీ డయాబెటిస్ లక్షణాలు ఉన్నాయి. తొమ్మిది లక్షల మందికిపైగా టైప్1 మధుమేహ రోగులు ఉన్నారు. టైప్ 2 మధుమేహంతో బాధపడేవారిలో కూడా కొంతమందికి ఇన్సులిన్ తప్పనిసరిగా అవసరం అవుతోంది. ఈ ఇన్సులిన్‌ను ఫ్లెక్స్‌టచ్ పెన్ ద్వారా వారానికి ఒక్కసారి తీసుకోవాలి. ఇలా తక్కువసార్లు ఇంజెక్షన్ తీసుకోవాల్సి రావడంతో చికిత్సను క్రమం తప్పకుండా కొనసాగించే అవకాశం పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించే సామర్థ్యంలో ఇది రోజూ తీసుకునే ఇన్సులిన్‌తో పోలిస్తే మెరుగైన ఫలితాలు ఇచ్చినట్లు క్లినికల్ పరీక్షల్లో తేలిందని కంపెనీ వెల్లడించింది. భద్రత విషయంలో కూడా ఇదే స్థాయి ఫలితాలు నమోదయ్యాయని తెలిపింది.

# సాయికృష్ణ కేసు

>> రాజును కృష్ణలంక స్టేషన్‌లో విచారించడానికి అనుమతిస్తూనే రిమాండ్‌నుంచి అతన్ని కస్టడీకి తరలించే సందర్భంలో వీడియో తీయాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో సిఐ నాగరాజు కస్టడీపై వారు ఇప్పుడు సుప్రీంకోర్టులో అప్పీల్‌కు సిట్ సిద్ధపడింది. దీంతో సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు ఈ కేసులో కీలకంగా కానున్నది. పాత నేరస్తుడు గాదె సాయి కృష్ణను లాకప్‌డెత్ చేసి, శవాన్ని సైతం కాల్చేశారని ఆరోపణలు వచ్చాయి. కృష్ణలంక సిఐ నాగరాజు ఈ కేసులో ప్రధాననిందితుడిగా ఉన్నారు. అయితే ఆయన్ను తొలుత అరెస్టు చేయని ప్రభుత్వం.. ఆ తర్వాత తీవ్ర విమర్శలు రావడంతో అరెస్టు చేయక తప్పలేదు. ఆ తర్వాత సిట్ అధికారులు నాగ రాజును కస్టడీకి ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు సీఐ నాగరాజును కస్టడీలో విచారించే విషయంలో పలు షరతులు పెట్టింది. విచారణ మొత్తాన్ని ఆడియో, వీడియో రికార్డు చేయాలని సిట్‌ను ఆదేశించింది. అలాగే విచారణ సమయంలో నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. నాగరాజును ఒక రోజు కృష్ణ లంక పీఎస్‌లో, మిగిలిన రోజులు రాజమండ్రి సెంట్రల్ జైల్లోనే విచారించాలని ఆదేశించింది.

## వారం - వర్జ్యం

10-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
దశమి ఉ.8.16, ఏకాదశి తె.5.22
భరణి మ.1.11
వర్జ్యం : రా.12.06-రా.1.33
దు.ఉ.8.17-ఉ.9.09,
(2) మ.12.38-మ.1.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** మీ మాట దురుసుతనం వల్ల మిత్రులు సైతం శత్రువులుగా మారే ప్రమాదం ఉంది. జాగ్రత్త వహించండి.

**వృషభం:** పాతబాకీలు వసూలై ఆర్థిక అవసరాలు తీరుతాయి. అన్యభాషలను అభ్యసించారు. తద్వారా లాభపడతారు.

**మిథునం:** మొండి వ్యవహారాలను కాలానికి వదిలి వేస్తారు. చికాకు కలిగించే పరిస్థితులకు దూరంగా పారిపోకుండా వుంటారు.

**కర్కాటకం:** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. భూవివాదాలు తీరి లబ్ధి పొందుతారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**సింహం:** అంతర్గతంగా వేదాంత ధరణి అలవరచుకుంటారు. ప్రతికూల వాతావరణాన్ని కూడా కృషితో అనుకూలంగా మలచుకుంటారు.

**కన్య :** వలుకుబడి ఉన్నవారితో పరిచయాలు ఏర్పడుతాయి. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు.

**తుల :** చేపట్టిన పనులలో అనేకమైన వాటిని విజయవంతంగా పూర్తి చేస్తారు. ఋణాలు తీరి ఊరట చెందుతారు.

**వృశ్చికం:** జీవిత భాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. దేవాలయాల సందర్శనం.

**ధనుస్సు:**గతము కన్నా వృద్ధి బాగుంటుంది. అనేకాంశాలు అనుకూలంగా వుంటాయి. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు.

**మకరం:** ఎదుటివారి సంభాషణలలోని నిజా నిజాలను గుర్తెరిగి తదనుకూలంగా నడుచుకుంటారు. వాహన సౌఖ్యం.

**కుంభం:** భాగస్వామ్య పెట్టుబడులలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగినది. వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యం తగదు.

**మీనం:** మీ పరోక్షంలో జరుగుతున్న అన్ని పనులను కూడా గమనిస్తూ కఠినంగా వ్యవహరిస్తారు. వస్త్రలాభం కలదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బనగానపల్లె ప్రజావేదిక సభవద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి జనార్దన్

# నాలెడ్జ్ ఎకానమీగా ఎపి

>> తయారీ, నౌకా నిర్మాణ రంగాల్లో కొరియా నైపుణ్య సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

**ఉమ్మడి పరిశోధనలకు సహకారం అందించాలి:**

స్టూడెంట్/ ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లు, కరిక్యులమ్ డెవలప్ మెంట్ కోసం ఆంధ్రప్రదేశ్ - కొరియా విశ్వవిద్యాలయాలను అనుసంధానించాలి. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, నౌకా నిర్మాణం, ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థలు, ఎఐ, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లీన్‌టెక్, హెల్త్‌టెక్ రంగాలలో సాంకేతిక పరిజ్ఞాన బదిలీపై పరస్పరం సహకరించుకోవాలి. 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్ ప్రెన్యూర్' అనే ఎపి దార్శనికతను ముందుకు తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ఆర్‌టిఐహెచ్, యూనివర్సిటీలు - సౌత్ కొరియా పరిశోధనా సంస్థలు, ఆవిష్కరణల కేంద్రాల (మాగోక్ సైన్స్ పార్క్, నానో ఫ్యాబ్ సెంటర్ వంటివి) నడుమ ఉమ్మడి పరిశోధన, అభివృద్ధికి సహకారం అందించండి.

**ఎపిలో కొరియా పారిశ్రామిక పార్క్ ఏర్పాటుచేయండి:**

ఆంధ్రప్రదేశ్‌లోని కొరియా కంపెనీల కోసం ప్రత్యేకంగా ఒక కొరియా పారిశ్రామిక పార్క్‌ను ఏర్పాటు చేయండి. ఇందుకు అవసరమైన భూమిని ఎపిఐఐసి ల్యాండ్ బ్యాంకు ద్వారా అందిస్తాం. ప్లగ్ అండ్ ప్లే మౌలిక సదుపాయాలు, ప్రత్యేక సింగిల్‌విండో క్లియరెన్స్ యంత్రాంగం, ఆర్థిక ప్రోత్సాహకాలు, విద్యుత్, నీరు, లాజిస్టిక్స్ కనెక్టివిటీ వంటి పటిష్టమైన, ప్రత్యేక విధాన ప్యాకేజీతో పాటు, పూర్తిస్థాయి సౌకర్యాల కోసం ఒక కొరియాడెస్క్‌ను ఎపి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే 10జిడబ్ల్యు సామర్థ్యం గల డేటాసెంటర్ ప్రాజెక్టులను అమలు చేయడానికి అవసరమైన ఇంధన మౌలిక సదుపాయాల ప్రణాళికలు, నియంత్రణ విధానాలను రూపకల్పనలో సహకరించేలా రిపబ్లిక్ ఆఫ్ కొరియా ప్రభుత్వంతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కోరుతున్నామన్నారు.

**గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం:**

ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే సుమారు 14 జిడబ్ల్యు పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2030 నాటికి 160 జిడబ్ల్యు సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భారతదేశ 500 జిడబ్ల్యు జాతీయ లక్ష్యంలో సుమారు 32కి సమానం. సోలార్, పవన శక్తి, గ్రీన్ హైడ్రోజన్, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ విద్యుత్ ఉత్పత్తి తయారీ రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు ఎస్‌కె ఎనర్జీ, ఎల్‌జి ఎనర్జీ, హన్వాహ వంటి కొరియా సంస్థలకు ఆహ్వానం పలుకుతున్నాం. సౌత్ కొరియాప్రాంతం /ఆగ్నేయాసియాలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రధాన లాజిస్టిక్స్, జలరవాణా, నౌకా నిర్మాణ కేంద్రంగా తీర్చిదిద్దడమే మాధ్యేయం, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు మౌలిక సదుపాయాలు, సుస్థిరాభివృద్ధిలో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన కొరియా వ్యూహాత్మక ప్రణాళిక సహకారాన్ని కోరుకుంటున్నామన్నారు.

# హస్త కళాకారులకు ఆరోగ్య పరీక్షలు

>> న్నాయన్నారు. యేళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న కళాకారులు వెన్ను, మెడ, కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, శ్వాస సంబంధిత ఇబ్బందులు వంటి అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తమ చేతుల మీద మోస్తున్న కళాకారుల ఆరోగ్యాన్ని కాపాడటం కూటమి ప్రభుత్వ బాధ్యత అని బలీయంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. కళాకారుల సమస్యలను తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి రాష్ట్రంలోని వివిధ హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సిఎం వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సీతారాంపురం క్రోషే లేస్ కళాకారుల కోసం నిన్న(జులై 8న) వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించినట్లు పవన్ చెప్పారు. గురువారం ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లి బొమ్మల కళాకారులు, కాకినాడ జిల్లాలోని ఉప్పాడ చేనేత కార్మికులు, కడప జిల్లాలోని మాధవరం చేనేత కార్మికులు, అనంతపురం జిల్లాలోని యాడికి చేనేత కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈనెల 10న విజయనగరం జిల్లాలోని బొబ్బిలి వీణ కళాకారులు, అనకాపల్లి జిల్లాలోని ఎటికొప్పాక కళాకారులు, ఏలూరు జిల్లాలోని హ్యాండ్ నాటెడ్ వూలెన్ పైల్ కార్పెట్ కళాకారులు, మదనపల్లె చేనేత కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే, జులై 11న సత్యసాయి జిల్లాలోని ధర్మవరం చేనేతకార్మికులు, శ్రీకాకుళం జిల్లాలోని బుడితి ఇత్తడి కళాకారులు, కృష్ణా జిల్లాలోని పెడన బ్లాక్ కలంకారీ కళాకారులు, తిరుపతి జిల్లాలోని చెక్క శిల్ప కళాకారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎపిలోని మరిన్ని హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ఇదే తరహాలో వైద్య శిబిరాలను దశలవారీగా కొనసాగిస్తామని పవన్ చెప్పారు. ఈ శిబిరాల ద్వారా సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన చోట నిపుణుల వైద్య సేవలు, నిర్ధారణ పరీక్షలు, తదుపరి చికిత్సకు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు. ప్రతి హస్తకళాకారుడు, ప్రతి చేనేత కార్మికుడు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళను గౌరవించడం అంటే కళాకారుడి శ్రమను గౌరవించడం. కళాకారుడి శ్రమను గౌరవించడం అంటే ఆయన ఆరోగ్యాన్ని కాపాడటం. కళాకారులు ఆరోగ్యంగా ఉంటేనే మన సంప్రదాయాలు, వారసత్వం భావితరాలకు సజీవంగా నిలుస్తాయి. కళను కాపాడాలంటే ముందు కళాకారుడిని కాపాడాలి అని 'ఎక్స్'లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# నేడు ముంబయికి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** రెండు భుజాల దగ్గర ఉన్న సమస్య రీత్యా శస్త్ర చికిత్స నిమిత్తం పవన్ కల్యాణ్ శుక్రవారం ముంబైకి వెళ్లనున్నారు. శస్త్రచికిత్స అనంతరం సుమారు 30 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.ఇటీవల పవన్ తన సతీమణి అన్నా కొణిదెలతో కలిసి ముంబాయి వెళ్లారు.అక్కడి ప్రముఖ కోకిలాబెన్ ఆస్పత్రిలో ఆయన తన భూజాలకు సంబంధించిన సమస్యలకు పరీక్షల చేయించుకున్నారు. అక్కడి వైద్యులు ఆయనకు అత్యవసర శస్త్రచికిత్సను సూచించారు.వాస్తవానికి వైద్యులు అదే రోజు శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేసారు.దాంతో ఆయన ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలు పూర్తి చేసుకున్న తరువాత శస్త్రచికిత్స చేయించుకుంటానని అక్కడి వైద్యులకు తెలిపారు.వారి సూచనలతో ఆయన రాష్ట్రానికి చేరుకుని వివిధ కార్యక్రమాలను పూర్తి చేసారు.పంచాయతీరాజ్ పరిధిలో చేపట్టిన సంస్కరణలు ,అటవీశాఖలో హనుమాన్ ప్రాజెక్ అమలు, గంజాయి సాగు నిర్మూలన, కలప స్మగ్లింగ్ నియంత్రణ తదితరంశాలపై అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు.ఈ నేపథ్యంలో పార్టీ కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు వీలుగా పలు సమావేశాలు నిర్వహించారు.క్షేత్రస్థాయి నుంచి వివిధ స్థాయిల నాయకులకు దిశానిర్దేశం చేసారు. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గాల వారీగా కార్యకలాపాల వేగవంతం వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుని కార్యచరణ బాధ్యతలను మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు, శాసనమండలి చీఫ్ విప్ పిడుగు హరిప్రసాద్ తదితరులకు అప్పగించారు.శస్త్ర చికిత్స అనంతరం ఆయన వైద్యుల సూచనలకు అనుగుణంగా వ్యవహరించనున్నారు.

# గోదావరి పరవళ్లు

>> చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

**ఆదరణ తగ్గి ఆదాయం కోల్పోయి**

గొందూరు గిరిజనుల ఆడపడచుగా బహు ప్రాచుర్యం పొందిన పోశమ్మ తల్లికి రాష్ట్రం నలు మూలల భక్తులు కూడా ఎక్కువే. గమనించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ 1991లో తన ఆదీనంలోకి తీసుకుంది. అప్పటి నుంచి ఆలయ చైర్మన్, ఆలయ మేనేజర్‌ను నియమిస్తూ ఆలయమును అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆదాయం పెంచుకుంటూ తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పర్చుకుంది. పోలవరం ప్రాజెక్టుతో గోదావరి బ్యాక్ వాటర్ కారణంగా భక్తుల్లో ఆదరణ తగ్గి వివిధ రూపాల్లో ఆదాయాన్ని గణనీయంగా పెంచుకున్న అమ్మవారు ప్రాజెక్టుతో ఆదాయాన్నికోల్పోయింది. మరలా అమ్మవారికి పూర్వవైభవంరావాలని భక్తులు కోరుకుంటున్నారు.

# బిజెపిలో చేరిన టిఎంసి మాజీ రాజ్యసభ ఎంపీలు

**కోల్‌కత్తా,జులై 9:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి మరో షాక్ తగిలింది. తృణమూల్ కాంగ్రెస్ మాజీ రాజ్యసభ సభ్యులు సుష్మితా దేవ్, సుఖేందు శేఖర్ రాయ్, ప్రకాశ్ చిక్ బరైక్ గురువారం కోల్‌కతాలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య సమక్షంలో వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ పరాజయం అనంతరం ఈ ముగ్గురు రాజ్యసభ సభ్యులు పార్టీకి రాజీనామా చేశారు. వారి అనుభవం రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేస్తుందని సమిక్ భట్టాచార్య పేర్కొన్నారు. ఈ పరిణామంపై టీఎంసీ సీనియర్ నేత సౌగత రాయ్ స్పందిస్తూ వారు ముందే బీజేపీ వైపు ఉన్నారు. రాజ్యసభ అవకాశం కోసం పార్టీ మారారు. దీంతో టీఎంసీకి ఎలాంటి నష్టం లేదు. బీజేపీకి కూడా పెద్దగా లాభం ఉండదని భావిస్తున్నామని వ్యాఖ్యానించారు.

# భారతీయ సమాజమే బలమైన స్తంభం

>> నరేంద్ర మోడీ అన్నారు. 2014లో 28యేళ్ల తర్వాత ఆస్ట్రేలియాలో పర్యటించిన తొలి భారత ప్రధానమంత్రి తానేనని గుర్తుచేసుకున్న మోడీ, తన తాజా పర్యటనను 12 యేళ్లలో 'హ్యాట్రిక్' పర్యటనగా అభివర్ణించారు. భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయో ఈ తరచు పర్యటనలు సూచిస్తున్నాయని అన్నారు. భారత్, ఆస్ట్రేలియాలను దగ్గర చేయడంలో తన పాత్ర కంటే ప్రవాస భారతీయుల పాత్ర మరింత గొప్పదని ప్రధాని మోడీ ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ సమాజం తమ కృషి, సేవల ద్వారా భారతదేశ ప్రతిష్టను పెంచుతోందని అన్నారు.

ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌కు మోడీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అల్బనీస్‌ను 'భారతదేశానికి మంచి మిత్రుడు'గా అభివర్ణించారు. ఆయనతో కలిసి ఈకార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని ఇచ్చిందని అన్నారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం నుంచి మెల్‌బోర్న్‌లోని ప్రసిద్ధ క్రికెట్ వేదిక వరకు ఇద్దరు నాయకులు కలిసి ఎన్నో గుర్తుండిపోయే క్షణాలను పంచుకున్నారని ప్రధాని పేర్కొన్నారు. భారతీయ సమాజాన్ని ఉద్దేశించి అల్బనీస్ చేసిన ప్రసంగాన్ని కూడా ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్'ను ప్రస్తావిస్తూ, ఉగ్రవాద శిబిరాలపై భారతదేశం జరిపిన దాడుల ప్రభావం దాని సరిహద్దులకు ఆవల కూడా చాలా దూరం వరకు వ్యాపించిందని అన్నారు. ఉగ్రవాద శిబిరాలలో జరిగిన పేలుళ్ల 'ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనించాయని', ఉగ్రవాదంపై దృఢంగా వ్యవహరించడానికి, తన జాతీయ భద్రతను కాపాడటానికి భారతదేశానికి ఉన్న సంకల్పాన్ని ఇది స్పష్టం చేస్తుందని ఆయన అన్నారు.

దేశం ఒక అభివృద్ధి చెందిన దేశంగా మారే దిశగా స్థిరంగా పయనిస్తోందని ప్రధాని మోడీ అన్నారు. ప్రతి విజయం మరింత పెద్ద ఆశయాలకు దారితీస్తుందని, ఆధునిక భారతదేశం 'మరింత ఎదగండి, మరింత సాధించండి' అనే నినాదాన్ని విశ్వసిస్తుందని ఆయన అన్నారు.

భారతదేశాన్ని 140 కోట్ల ఆకాంక్షల దేశంగా అభివర్ణిస్తూ, దేశ ప్రజల కలలు, సంకల్పమే దేశ పురోగతికి చోదకశక్తిగా ఉందని మోడీ అన్నారు.

అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. జాతీయ భద్రత, ఆర్థికాభివృద్ధి పరస్పర అనుసంధానమైన అంశాలని పేర్కొన్న ఆయన, గత విజయాలతో సంతృప్తి చెందకుండా మరింత ఉన్నత లక్ష్యాలతో భారత్ ముందుకు సాగుతోందని చెప్పారు. 'మరింత అభివృద్ధి చెందండి.. మరింత సాధించండి' అనే దృక్పథంతో దేశం కొత్త పారిశ్రామిక పునాదిని నిర్మిస్తోందని ప్రధాని తెలిపారు. చిప్స్ నుంచి ఓడల వరకు విస్తరించిన ఆధునిక తయారీ పర్యావరణ వ్యవస్థను భారత్ రూపొందిస్తోందని, ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగడానికి వేగంగా అడుగులు వేస్తోందని అన్నారు.

10-7Pg3exHMNWJQEG_10-7Pg3exHMNWJQEG.qxd 09/Jul/26 11:45 PM Page 1



# ఎపిలో ఇంటిగ్రేటెడ్ ఇవి, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని విస్తరించండి

## సౌత్ కొరియా విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్‌హే సిసిలియా చుంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ



విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్‌హే సిసిలియా చుంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ. సిసిలియా చుంగ్‌కు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

**విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** పెట్టుబడుల సాధన కోసం దక్షిణ కొరియాకు వెళ్లిన మంత్రి నారా లోకేశ్ పలు కంపెనీల ప్రతినిధులతో వరుసగా భేటీ అవుతూ బిజీబిజీగా గడుపుతున్నారు. ఐదవ రోజు పర్యటనలో భాగంగా సియోల్‌లో కియా మోటార్స్ ఉన్నత స్థాయి బృందంతో మంత్రి సమావేశమయ్యారు. కియా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే హన్‌లీ, ఇతర ఉన్నతస్థాయి బృందంతో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సియోల్‌లో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, కియా మోటార్స్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన పిబివి వాహనాలతో సహా ఇంటిగ్రేటెడ్ ఇవి, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేసి, ఎపిలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు. ప్రపంచ మార్కెట్లకు సేవలందించడానికి విశాఖపట్నం పోర్టు సమీపంలో ఒక సికెడి అసెంబ్లింగ్, ఎక్స్‌పోర్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేయండి. ఇ-జిఎం పి ప్లాట్‌ఫామ్ కాంపోనెంట్లు, బ్యాటరీ సిస్టమ్‌లు, ఇవి ఛార్జింగ్ ఎలక్ట్రానిక్స్ కోసం ఒక ఇవి కాంపోనెంట్ల తయారీ కేంద్రాన్ని స్థాపించండి. పవర్‌ట్రెయిన్ ఇంటిగ్రేషన్, టెస్టింగ్, వెహికల్ హోమోలోగేషన్ కోసం ఒక ఇజీ పవర్‌ట్రెయిన్ టెస్టింగ్ కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. కియా మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే హన్ లీ మాట్లాడుతూ కియా మోటార్స్ ప్రయాణీకుల, వాణిజ్య, వినోద వాహనాల తయారీతోపాటు 'ప్లాన్ ఎస్', ప్లాట్‌ఫామ్ బియాండ్ వెహికల్ ఇనీషియేటివ్, ఇవి, అటానమస్ మొబిలిటీని అభివృద్ధి చేస్తోందని తెలిపారు. మాతృసంస్థ హ్యుందయ్ మోటార్స్ తర్వాత దక్షిణ కొరియాలో రెండో అతిపెద్ద ఆటోమొబైల్ సంస్థగా కియా మోటార్స్ అవతరించిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజిక్ ప్లానింగ్) యూయ్ చుల్ జియొంగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) సాంగ్ ఉన్ చో, వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజిక్ ఆపరేషన్స్) హీ సామ్ కిమ్, వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ ఆపరేషన్స్) టే కున్ యాంగ్, కియా ఇండియా సీనియర్ లీగల్ అడ్వయిజర్ జుంగో యాన్ , ప్రిన్సిపల్ అడ్వయిజర్ సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**కొరియన్ పెట్టుబడిదారులకు నమ్మకమైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్:** సౌత్ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉపమంత్రి యుయ్‌హే సిసిలియా చుంగ్‌తో మంత్రి నారా లోకేష్ సియోల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేస్తున్న 3ఎస్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుంది. భారత్‌లో ఆంధ్రప్రదేశ్ ను అత్యంత స్థిరమైన, నమ్మకమైన కేంద్రంగా చేసుకునేలా పరిశ్రమదారులను ప్రోత్సహించాలని కోరారు. ఎపిలో అందించే పన్నురాయితీలు, తక్కువధరకే భూమి, సబ్సిడీలు పరిశ్రమదారులకు మద్దతుగా నిలుస్తాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో తూర్పుతీరంలో సురక్షితమైన, నమ్మకమైన, స్నేహపూర్వక ప్రత్యామ్నాయంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుంది. దీనివల్ల ప్రపంచ సప్లయ్ చైన్ నష్టాలను కూడా తగ్గించడానికి ఆస్కారం ఏర్పడుతుంది. కేవలం భారీ పరిశ్రమలేకాకుండా గ్రీన్ ఎనర్జీ, వినియోగ వస్తువులు, మోడరన్ రిటైల్, టూరిజం, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో కొరియన్ పెట్టుబడులకు ఎపి స్వాగతం పలుకుతోంది. ఫ్యాక్టరీల ప్రారంభానికి ముందే కొరియన్ వర్క్ స్టాండర్డ్స్, లాంగ్వేజ్, కల్చర్ పై స్థానిక యువతను సిద్ధం చేసేందుకు దక్షిణ కొరియాతో కలిసి సంయుక్త శిక్షణా అకాడమీలను ఏర్పాటుచేసేందుకు ఆంధ్రప్రదేశ్ విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖలు సంసిద్ధంగా ఉన్నాయి. ఎపిలో కొరియన్ కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయాలి అని లోకేష్ కోరారు.

భారత్- కొరియా వ్యూహాత్మక భాగస్వామ్యానికి అనుబంధంగా ప్రత్యేకమైన ఆంధ్రప్రదేశ్- కొరియా ఇన్వెస్ట్ మెంట్ డెస్క్, ఇరు ప్రాంతాల నడుమ వార్షిక ఆర్థిక భాగస్వామ్య చర్చలకు చొరవ చూపండి. శాశ్వత వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి, విశాఖపట్నం - బుసాన్/ ఇంచియాన్ మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్సిటీల్లో కొరియన్ లాంగ్వేజ్ సెంటర్లు, డైరెక్ట్ ఎయిర్ కనెక్టివిటీకి చొరవ చూపాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. సౌత్ కొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగశాఖ ఉప మంత్రి యుయ్‌హే సిసిలియా చుంగ్‌ను సమావేశానంతరం మంత్రి నారా లోకేష్ రాష్ట్ర ప్రభుత్వం తరుపున సత్కరించి, జ్ఞాపికను అందజేసారు.

**ఎపిలో డిస్ ప్లే పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి:** సెమీకండక్టర్స్, ఒఎల్ఇడి, పెరోవ్‌స్కైట్ డిపాజిషన్ పరికరాల తయారీలో పేరెన్నికగన్న సునిక్ సిస్టమ్ కో లిమిటెడ్ (సౌత్ కొరియా) సిఇఒ ఎస్.డబ్ల్యు. చుంగ్, సంస్థ ఉన్నతస్థాయి బృందంతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో సునిక్ సిస్టమ్స్ డిస్ ప్లే పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎపిలో యూనిట్ ఏర్పాటుకు ముందుకు వస్తే జాయింట్ వెంచర్ కోసం సహకారం అందిస్తాం. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0తోపాటు ఎపి సెమీ కండక్టర్, డిస్ ప్లే ఫ్యాబ్ పాలసీ కింద ప్రోత్సాహకాలు అందిస్తాం. 'సెమీకాన్ టెక్' పై నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడానికి, ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేయాలని కోరారు.

సునిక్ సిస్టమ్స్ సిఇఒ ఎస్.డబ్ల్యు. చుంగ్ మాట్లాడుతూ మూడు విభాగాలలో వాక్యూమ్ థిన్‌ఫిల్మ్ డిపోజిషన్ పరికరాలను తాము తయారు చేస్తున్నట్లు చెప్పారు. తమ ఉత్పత్తుల్లో ఒఎల్ఇడి డిస్‌ప్లే ఎవాపరేషన్ (ఎఎంఒఎల్ఇడి, ఎల్ఇడిఒఎస్, 8.6జెన్), స్పుటర్ / సివిడి / ఎచర్ / థిన్‌ఫిల్మ్ ఎన్‌క్యాప్సులేషన్ ప్రాసెస్ మాడ్యూల్స్, పెరోవ్‌స్కైట్ సోలార్, డిస్‌ప్లే డిపోజిషన్ పరికరాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఎపిలో తమ సంస్థ ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సునిక్ సిస్టమ్స్ సేల్స్ వైస్ ప్రెసిడెంట్ జెహెచ్ లీ, సేల్స్ జనరల్ మేనేజర్ హెచ్.వై. చో, సిఎస్‌సిఒ కెసి మ్యూన్, మీడియా ఇన్ఫోకామ్ సిఇఒ సెవోన్ చో, క్రిస్టల్ మ్యాట్రిక్స్ లిమిటెడ్ ప్రెసిడెంట్ సిటిఒ డాక్టర్ రమణారావు మాగంటి పాల్గొన్నారు.



# అలిపిరి వద్ద భక్తులకు విసుగుపుట్టిస్తున్న రాజకీయ ఫ్లెక్సీలు

**తిరుమల,జులై 9ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి ఎంతో భక్తిభావంతో పవిత్రంగా తిరుమలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా స్వాగతం ఉండాల్సింది పోయి వికారం పుట్టించేలా పలు రకాల ఫ్లెక్సీలు, బ్యానర్లు మయంగా మారింది. ఈ ప్రాంతం పూర్తిగా టిటిడి ఆధ్వర్యంలో ఉన్నా పట్టించుకుని పవిత్రతను కాపాడాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. దీంతో ప్రతిరోజూ ఏదో ఒక రకంగా అలిపిరి గరుడ విగ్రహం పరిసరాల్లో చుట్టూ రాజకీయ నేతల ఫ్లెక్సీలు, ఉద్యోగుల ఫ్లెక్సీలు, బ్యానర్లు వెలుస్తున్నాయి. వీటిని 24గంటల్లో తొలగించాల్సిన నగరపాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగం, టిటిడి పారిశుధ్యవిభాగం పట్టించుకోవడంలేదు. ఈ కారణంగా తిరుమలకు భక్తిభావంతో, ఆధ్యాత్మికతతో వస్తున్న భక్తులకు ఈ ఫ్లెక్సీలు వికారం కలిగిస్తున్నాయి. తిరుమల అంటేనే ఒక పవిత్రతకు, ఆధ్యాత్మికతకు నిదర్శనం, అందునా తిరుమలకు ప్రధాన ప్రవేశద్వారం అలిపిరి వద్ద ఆధ్యాత్మిక భావన ఉట్టిపడేలా చూడాలి. అయితే ఇందుకు భిన్నంగా రాజకీయ నేతల ఫ్లెక్సీలు, స్వాగతాలు, పుట్టినరోజు శుభాకాంక్షలు, పదవుల అభినందనలు, ఇతరత్రా మంచిచెడు కార్యక్రమాలకు సంబంధించిన బ్యానర్లు, ఫ్లెక్సీలు అలిపిరి గరుడవిగ్రహం కూడలి ఇరువైపులా దర్శనమిస్తున్నాయి. రోజూ తిరుమలకు వచ్చే యాత్రికులు, ఉద్యోగులు, తిరుపతికి దిగే యాత్రికులు వీటిని చూసి ఇదేమి చోద్యమంటూ అసహనం వెలిబుస్తున్నారు. ఎంతో పవిత్రంగా దేవుని దర్శనానికి వస్తే ఇలాంటివి కనిపిస్తుండటంపై భక్తులు నోరుమెదుపుతున్నారు. అలిపిరి ప్రాంతం ఆధ్యాత్మికతకు కేంద్రం,. అలాంటి చోట్ల పలు రకాలుగా అపవిత్రం చేసినా టిటిడి అధికారులు కనీసం స్పందించకపోవడం దేనికి నిదర్శనమనేది అర్థంకావడంలేదు. పైగా కొన్ని ముఖ్యకూడళ్లలో ఫ్లెక్సీలు.,బ్యానర్లు నిషేధం.అలాంటిది అలిపిరిలో భారీగా ఏర్పాటుచేసినా చర్యలు మాత్రం తీసుకోలేకపోతుండటం విచారకరం.యాత్రికులకు మనోభావాలు దెబ్బతినకుండా చూడటంలో టిటిడి ఇకనైనా మేల్కొనాలని భక్తులు కోరుతున్నారు.




# జిల్లా పరిషత్ సమావేశానికి కూటమి నేతలు హాజరుకాకపోవడం విచారకరం

## సమస్యలపై గళమెత్తిన చిన్న శ్రీను

**విజయనగరం, జులై 9 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గౌరవ జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమ న్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం ప్రారంభానికి ముందు ఇటీవల సముద్రంలో గల్లంతైన మత్స్యకారులకు జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సభలో సభ్యులతో కలిసి రెండు నిమిషాల మోనం పాటించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలిచి తగిన సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జిల్లా ప్రజా సమస్యలపై జరిగిన చర్చలో చిన్న శ్రీను మాట్లాడుతూ, జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న అత్యంత ముఖ్యమైన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి కూటమి ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడం బాధాకరమని అన్నారు. ప్రజల సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ఉన్న ప్రజాప్రతినిధులు సమావేశాలకు దూరంగా ఉండటం సరైన విధానం కాదని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఎరువులు, విత్తనాల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగునీటి సమస్యల కారణంగా పలు ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందక ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులు పడుతున్న ఇబ్బందులను సమావేశంలో ప్రస్తావించారు.అదేవిధంగా రెండేళ్లుగా హౌసింగ్, సామాజిక భద్రతా పెన్షన్ల కోసం వేలాది మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని, ఉపాధి హామీ పథకం అమలులో చోటు చేసుకుంటున్న పలు అవకతవకలపై కూడా సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారని తెలిపారు. జిల్లా రైతాంగం, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణచర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంవీడి ప్రజలకు మెరుగైనసేవలు అందించాలని చిన్న శ్రీను సూచించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) ఈ.నాగలక్ష్మి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జిల్లా పరిషత్ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించి, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలపై సమీక్ష నిర్వహించారు.

# ఆ ముగ్గురి ఘటనల వెనుక వైసిపి

## రావణ్, శ్రవణ్, సుగాలి ప్రీతిలపై అంత ప్రేమెందుకో?: జనసేన నేత కిరణ్‌రాయల్



**తిరుపతి,జులై 9ప్రభాతవార్తప్రతినిధి:** రావణ్, శ్రవణ్, సుగాలి ప్రీతి ఘటనల వెనుక వైసిపి నాటకాలు ఆడుతోందని, సుగాలి ప్రీతి ఘటనను వెలుగులోకి తీసుకువచ్చిందే పవన్ కళ్యాణ్ అని జనసేన పార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ పేర్కొన్నారు. ఇప్పటికే వైసిపి ప్రజలను పక్కదారిపట్టించేలా వ్యవహరిస్తోందని, లేనిపోనివి తెరపైకి తీసుకువచ్చి తప్పిదాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.గురువారం మీడియాతో మాట్లాడారు. వైసిపి నేతల ట్రాప్ లో పార్వతమ్మ పడిపోయిందని, వైసిపి నాయకుల నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు. జగన్ 2 అంటే కులాల మధ్య చిచ్చు పెట్టడం, హిందూమతంపై దాడి చేయడమే టార్గెట్‌చేసుకున్నాడని సంచలన వ్యాఖ్యలు చేశారు.జగన్ 2పేరుతో రావణ్, శ్రావణ్‌లను ప్రభుత్వ పెద్దలపై రెచ్చగొట్టడమే పనిగా ఉన్నారన్నారు.వైసిపి నేతలకు మరో పనిలేకుండా కావాలనే సుగాలి ప్రీతి అంశాన్ని తెరపైకి తీసుకువస్తున్నారని ఆయన మండిపడ్డారు. సుగాలి ప్రీతి తల్లి పార్వతమ్మ పవన్ కళ్యాణ్ పై ఫిర్యాదు చేయడమేంటని,రావణ్ వైసిపికి సంబంధం లేదని ఎలా చెబుతారు సిగ్గుండాలని అన్నారు. ఈ వ్యక్తి ఎవరు అన్ని ఫోటోలు ఇతనే ఉన్నాడు ఇప్పుడు చెప్పండని కిరణ్ డిమాండ్ చేశారు. ఎవరికి ఏం సంబంధమని, సుగాలి ప్రీతి కోసం కర్నూలుకి ఆ రోజు లక్షలాదిమంది వచ్చినప్పుడు మేము కూడా చాలామంది కాళ్లు చేతులు విరుచుకొని హాస్పిటల్ లో ఉన్నామన్నారు. ఆరోజు కూడా మేము బాధపడలేదని ,ఈరోజు వైసిపి చేస్తున్న నాటకాలతో బాధపడతున్నామన్నారు.

# జంట హత్యల కేసులో తెగని ఉత్కంఠత

## కుటుంబతగాదాలే కారణంగా దర్యాప్తు

**తిరుపతి,జులై 9ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతి-తిరుచానూరు మార్గంలోని పద్మావతికల్యాణమండపాల సముదాయంలో జరిగిన జంట హత్యల కేసులో తెగని ఉత్కంఠత సాగుతోంది. ఈ భహత్యకు కుటుంబతగాదాలే కారణంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తల వివాదంతో మొదలైన గొడవ చివరకు మధ్యవర్తులను లక్ష్యంగా చేసుకుని పెళ్ళికి హాజరైన వ్యక్తులను పతకం ప్రకారం దారుణంగా దాడిచేసి హతమార్చడం సంచలనంగా మారింది. ప్రశాంత తిరుపతిలో ఒక్కసారిగా రాత్రివేళ ఎవరూ ఊహించని రీతిలో టిటిడికి చెందిన పద్మావతి కల్యాణమడపాల ప్రాంగణంలో ఈ హత్య జరగడం ఘటన సంచలనం సృష్టించింది. పెళ్ళికి హాజరైనట్లు వచ్చి పక్కా పథకం ప్రకారమే ఒక మహిళతోపాటు నలుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేయడం అక్కడికక్కడే ఘటనాస్థలిలో తిరుపతి జీవకోనకి చెందిన మునిరత్నం యాదవ్(50) ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఇదే ఘటనలో తీవ్రరక్తపుమడుగులో పడి ఆస్పత్రికి తరలించే సమయంలో తిరుపతి సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన మణికంఠ (41) కూడా మృతిచెందడం ఆందోళనకరంగా మారింది. ఈ ఘటనపై రాత్రికిరాత్రే తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ హత్యకు పాల్పడిన నిందితులు శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలం జంగాపల్లికి చెందిన సునీల్‌గా గుర్తించారు. గురువారం పోలీసుల ప్రాథమిక విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పెళ్లి వ్యవహారంలో తలెత్తిన వివాదమే ఈ దారుణ హత్యలకు కారణమైందని భావిస్తున్నారు. తిరుమలలో కార్మికురాలుగా పనిచేసే సంపూర్ణమ్మ కుమార్తెను సునీల్ వివాహం చేసుకున్నాడు. భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో సునీల్ భార్యను విడిచి దూరంగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో పద్మావతి కళ్యాణ మండపంలో జరిగిన ఓ వివాహానికి సునీల్ వస్తున్నాడని తెలుసుకున్న సంపూర్ణమ్మ అక్కడికి చేరుకుంది. వివాహానికి మధ్యవర్తులుగా వ్యవహరించిన మునిరత్నం, మణికంఠలను పిలిపించి ఈ విషయమై నిలదీసింది. ఒక్కసారిగా అక్కడ తీవ్రస్థాయిలోవాగ్వాదం చోటుచేసుకుంది. తనను నిలదీశారని సునీల్ తండ్రికి సమాచారమివ్వడంతో సునీల్ తండ్రి, తమ్ముడు, అక్కతో పాటు మరో యువకుడు కళ్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. పెళ్లి మండపం నుంచి బయటకు వచ్చిన మునిరత్నం, మణికంఠలపై ముందస్తు ప్రణాళిక ప్రకారం కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి నిందితులు పరారయ్యారు. పోలీసులు సునీల్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. హత్యకు దారితీసిన పూర్తి కారణాలపై తిరుపతి పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# సనాతన ధర్మంపై దాడులను సహించబోం

## మాజీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి

**విశాఖపట్నం, జులై 9, ప్రభాతవార్త:** హిందూ మతం, సనాతన ధర్మం, భారతీయ సంస్కృతిపై అవమానకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై మాజీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఖిఎక్స్‌ఖి వేదికగా ఆయన స్పందిస్తూ పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.రావణ్, ప్రకాశ్ రాజ్ వంటి వారు ఎక్కడి నుంచి వస్తున్నారని, వారికి మద్దతు ఇస్తున్నది ఎవరు, వారు ఏ సంస్కృతికి వారసులని ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఒక్కరూ ఈ విషయాలపై ఆలోచించాలని పిలుపునిచ్చారు.భారతీయ సంస్కృతి, హిందూ మతం, దేవతలు, దేశంపై ఎలాంటి అవమానకర వ్యాఖ్యలు చేసినా వాటిని తీవ్రంగా పరిగణించాలని, అలాంటి వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే చట్టాలను సవరించి కఠిన శిక్షలు అమలు చేయాలని సూచించారు. బలవంతపు, ప్రలోభపూరిత మత మార్పిడులను ప్రోత్సహించడం, భారతీయ సంస్కృతిపై దాడి చేయడం కొందరికి అలవాటుగా మారిందని ఆరోపించిన విజయసాయిరెడ్డి, ఇలాంటి చర్యలను మతపరమైన ఉగ్రవాదంగా పరిగణించాలని అన్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రావణ్, ప్రకాశ్ రాజ్‌లను సమర్థించడం హిందుత్వం, సనాతన ధర్మం, దేశంపై జరుగుతున్న దాడిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా ఈ అంశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన తన పోస్టులో కోరారు.

# నిర్మాణాల ఆలస్యంపై కమిషనర్ ఆగ్రహం



అన్నదాన, ప్రసాద పోటు నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్ కె.రామచంద్రమోహన్

**ఇంద్రకీలాద్రి, జులై 9, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదానం, ప్రసాదం పోటుల నిర్మాణ ఆలస్యంపై దేవదాయ శాఖ కమీషనర్ కె రామచంద్రమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను స్వయంగా పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇచ్చిన ఆదేశాలకనుగుణంగా వేగంగా పనులు జరపడం లేదని వెంటనే షిఫ్టుల వారిగా సిబ్బందితో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రావణమాసం లోగా పనులు పూర్తవ్వాలన్నారు. అలాగే ఈనెల 15 లోగా మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించిన నివేదికను కూడా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎలివేటెడ్ క్యూకాంప్లెక్స్ క్రిందిభాగంలో వున్న షాపులను చూసిన కమీషనర్ వెంటనే వాటిని తొలగించాలని ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**వేదపాఠశాలలో నూతన విద్యార్థుల ప్రవేశాల సందడి:** దుర్గమ్మవారి ఆలయం నిర్వహిస్తున్న పోరంకి వేదపాఠశాలలో నూతన విద్యార్థుల ప్రవేశాల సందడి నెలకొంది. గురువారం ఆయా ప్రవేశాలకు సంబంధించిన పరీక్షలను నూతన విద్యార్థులకు వేదపండితులు నిర్వహించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలనుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారి ఉచ్చారణ శైలిని, ప్రతిభాపాటవాలను, నిశితంగా పరిశీలించి ప్రవేశాల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ వేదవిద్యార్థులకు దేవస్థానం అండగా వుంటుందన్నారు. భావితరాలకు వేదవిజ్ఞానం అందించేలా విద్యార్థులకు వేదవిద్యను ఈ పాఠశాలలో నేర్పిస్తామన్నారు. వేదవిద్యార్థులకు మరిన్ని ప్రోత్సాహకాలు, వసతులు అందిస్తామన్నారు.

**దుర్గమ్మవారి భక్తుల విరాళాలు :** దుర్గమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు ఇబ్రహీంపట్నంకు చెందిన పి బాబూరావు గురువారం రు.1,01,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# తిరుమల సమాచారం



## ఆణివార ఆస్థానానికి ఆలయం ముస్తాబు

**తిరుమల,జులై 9ప్రభాతవార్తప్రతినిధి:** ఆణివార ఆస్థానం పురస్కరించుకుని తిరుమలలో ఆలయం పరిసరాలు, ఆలయ మహద్వారం గేట్ తదితర వాటిని ప్రకృతి సిద్ధమైన రసాయనాలతో శుద్ధిచేస్తున్నారు. ప్రతి ఏటా ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలకు ముందు తిరుమలలో ఆలయం పూర్తిగా ఇలా గేట్లను, ఇనుపచువ్వలను శుభ్రం చేస్తారు. నాలుగు మాఢవీధులను అందంగా తీర్చిదిద్దుతారు.రంగవల్లులు వేసి భక్తులను ఆకట్టుకునేలా చేస్తారు. గురువారం ఆలయం మహద్వారం గేట్లను కార్మికులు రసాయనాలతో శుద్ధిచేయడం జరిగింది. దీనివల్ల తుప్పుపట్టి నల్లగా మారిన అవన్నీ తళతళ మెరుస్తాయి.

## రూ.13.90 కోట్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల విడుదల

### టిటిడి పాలకమండలికి ఉద్యోగుల ధన్యవాదాలు

**తిరుమల,జులై 9ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు 13.90 కోట్ల రూపాయలు మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌ల విడుదల కానుంది. ఇందుకు టిటిడి బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని టిటిడి స్టాఫ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (సిఐటీయూ) హర్షం వ్యక్తం చేసింది.ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లు విడుదలకు సానుకూలంగా పరిశీలించి, ఉద్యోగులు విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న టిటిడి ఛైర్మన్ బి.ఆర్. నాయుడుకి, ఇఒ ముద్దాడ రవిచంద్రకి యునైటెడ్ ఫ్రంట్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గతంలో అమలులో ఉన్న 3 లక్షల రూపాయలు రీయింబర్స్‌మెంట్ పరిమితి కారణంగా నిలిచిపోయిన సుమారు 13.90 కోట్ల రూపాయలు క్లెయిమ్‌లను విడుదల చేయాలని తీసుకున్న నిర్ణయంతో ఐదువేలమందికి పైగా శాశ్వత ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు నేరుగా లబ్ధి పొందనున్నారు. త్వరలోనే ఈ మొత్తాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానుండటం ఎంతో సంతోషకరమన్నారు. అదేగాక మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు అయ్యే అదనపు వైద్య ఖర్చులను కార్యనిర్వహణాధికారి (ఇఒ) ఆమోదంతో, ఐదులక్షలకు మించిన వైద్య ఖర్చులను టిటిడి ట్రస్టు బోర్డు ఆమోదంతో రీయింబర్స్ చేయాలని తీసుకున్న నిర్ణయం ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు మరింత బలాన్నిస్తుందన్నారు. ఈ నిర్ణయం ఉద్యోగుల సంక్షేమ దిశగా తీసుకున్న అత్యంత కీలకమైన చర్యగా భావిస్తున్నారు. ఛైర్మన్ బి.ఆర్. నాయుడు నాయకత్వంలో దాదాపు 8 వేల మంది ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులకు సంబంధించిన ఇళ్ల స్థలాల సమస్యతో పాటు ఇతర సంక్షేమ సమస్యలు కూడా త్వరితగతిన పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమం, భద్రత, గౌరవప్రదమైన జీవనానికి సంబంధించిన సమస్యల పరిష్కారంలో టిటిడి యాజమాన్యం ఇదే సానుకూల వైఖరిని కొనసాగించాలని స్టాఫ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (సిఐటీయూ) ఆకాంక్షించింది.



## నిర్దేశిత గడువులోగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు పూర్తి కావాలి

### తిరుమలేశునికి రెండు బ్రహ్మోత్సవాలు

### టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల,జులై 9ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నందున అధికార యంత్రాంగం ఇప్పటినుండే సంసిద్ధత కావాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశించారు. ఏడుకొండలస్వామి ఉత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు ప్రతి రోజూ ఉదయం 8గంటల నుండి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుండి 9 గంటల వరకు వాహన సేవలు నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవ రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, దాతల దర్శనాలు కూడా రద్దవుతాయన్నారు. విజిలెన్స్, పోలీసు విభాగాల సమన్వయంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, రోడ్ మ్యాప్‌లు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శ్రీవారికి సెప్టెంబర్, అక్టోబర్‌లో జరిగే బ్రహ్మోత్సవాలపై తిరుమలలో పద్మావతి అతిథిగృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో గురువారం అదనపు ఇఒ వెంకయ్యచౌదరి తిరుపతి జెఇఒ డాక్టర్ ఎ.శరత్,సివిఎస్ఒ మురళీకృష్ణ,ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒలోకనాథం, తిరుమల అడిషనల్ ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలిసి అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టబోయే ఏర్పాట్లపై విభాగాల వారీగా సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించనుంది. సాధారణంగా సెప్టెంబర్ మాసంలో జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలు రెండువారాల తేడాతో జరిపించేలా ముహూర్తం ఖరారు చేస్తారు. తొమ్మిదిరోజులు రోజుకు రెండు వాహనాలపై ఎంతో ముగ్ధమనో హరంగా, సర్వాలంకారభూషితుడై శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్పస్వామి ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. శ్రీవారి భక్తులకు ఈ ఏడాది అధికమాసం కావడంతో రెండుదఫాలు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 15వతేదీ నుండి 23వరకు ,తిరిగి అక్టోబర్ 11నుండి 20వతేదీ వరకు బ్రహ్మాండనాయకుడి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు తేదీలు ఖరారు చేశారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 14వతేదీ సాయంత్రం అంకురార్పణం, 15న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవ ఘట్టానికి శ్రీకారం పడుతుంది. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ముఖ్యమైన ప్రాంతాల్లో విరివిగా అన్న ప్రసాదాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు ఇఒ ఆదేశించారు. సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తుల దర్శనాలకే అధిక ప్రాధాన్యతనివ్వనున్నట్లు తెలిపారు. భక్తులను ఆకట్టుకునే విధంగా విద్యుత్ అలంకరణలు, ఫల, పుష్ప ప్రదర్శన ఏర్పాటు చేయాలని,ఈ ఏడాది శ్రీవారి సేవకులుగా యువతీయువకులకు ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. సెప్టెంబర్‌లో జరిగే గరుడసేవకు విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సెప్టెంబర్ 18వరాత్రి 9 గంటల నుండి 20వతేదీ ఉదయం 6 గంటల వరకు తిరుమల ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాలకు అనుమతి ఉండదన్నారు. ఈ సమావేశంలో టిటిడి సిఇ సత్యనారాయణ, డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్, రాజేంద్ర, సోమన్నారాయణ, ఉద్యానవన డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు,సిఎంఒ డాక్టర్ కుసుమ కుమారి, డిఇచంద్ర శేఖర్,విఎస్ఒ సురేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Rayapudi, Amaravati-522237, Andhra Pradesh.
NIT No. Lr. No. MAU61-USI0HB(OTH)/513/2025-HB, Dated:09/07/2026
E-PROCUREMENT TENDER NOTICE
NAME OF THE WORK: APCRDA-"Improvements to existing Parade ground and parking area for Independence-Day Celebrations-2026 in Amaravati Capital City, Amaravati" Est. Cost: Rs.4.25 Crores. The bid can be downloaded on AP e-procurement portal from 10.07.2026 to 17.07.2026 up to 14.00 Hrs, Due date for submission of Bid is 17.07.2026 up to 15.00 Hrs, Technical bid opening 17.07.2026 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- COMMISSIONER, APCRDA, AMARAVATI

వార్త

మీరు సాహసంతో పనిని చేపట్టలేకపోతే, మీరు ఓటమికి గురికానేకారు. కాని మీరు జీవితంలో ఏదీ సాధించలేకపోతారు.

-వినోబాభావే

# శాంతి ముణ్ణాళ్ల ముచ్చటేనా?

అమెరికా ఇరాన్‌ల మధ్య మళ్లీ భీకర యుద్ధానికి దారి తీసిన పరిస్థితులు ఉభయదేశాల మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందానికి చెల్లుచీటీ పడినట్లే. ఇరాన్‌పైఅమెరికా తాజాగా చేపట్టిన సైనిక చర్యతో ఇరాన్ సైనిక, అణు సామర్థ్యాలను నిర్వీర్యం చేసినట్లుగా అమెరికాఅధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంబరపడిపోతున్నట్లే ఉంది. ఆయన ఏమి మాట్లాడినా అది సంచలనమే. అయితే అందులో గాసిప్ ఎంత ఉందో వైరిపక్షం వారు తేల్చేవరకు అంతే. టర్కీ రాజధాని అంకారాలో 'నాటో' సదస్సు అనంతరం మాట్లాడుతున్నప్పుడు ఇరాన్‌కు ఎలాంటి సైన్యం కానీ, వైమానిక దళం కానీ మిగలలేదని, 159నౌకలు సముద్ర గర్భంలో కలిసి పోయాయని వివరించారు. ఇరాన్ ప్రభుత్వం ఇక ఎన్నటికీ అణ్వాయుధాన్ని తయారుచేయలేదని అన్న ఆయన మాటలే నిజమైతే ఇరాన్, అమెరికాల మధ్య ద్వేష, శత్రు సంబంధాలే ఉండవని తేటతెల్లమైనట్లే కదా! ఇక వైరం కథ కంచికేనని అనుకోవాలి. కానీ పరిస్థితులు అలా కనిపించడం లేదు. హర్మూజ్ జల సంధిలో ఈ దుర్ఘటనలు అంతర్జాతీయ నౌకలకు ఎంతో ముప్పుగా పరిణమించాయి. తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగిసింది. భవిష్యత్‌లో చర్చలుండవు, సంప్రదింపులు మాత్రమే అనికూడా ట్రంప్ ప్రవచించారు. ఎప్పుడో ఓసారి ఇలాంటి విషయాలను వింటే ఇదే ఫైనల్ అను కోవడం సహజం. కానీ ట్రంప్ ఉదయం ఓ మాట, సాయంత్రం ఓ పలుకు వల్లె వేయడం వలన సీరియస్‌గా యుద్ధం జరుగుతున్నవేళ వాటికి విలువ లేకుండాపోయింది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలు ఈ పశ్చిమాసియా యుద్ధ నేపథ్యంలో ఒడిదుడుకులు ఎదు ర్కొంటున్న పరిస్థితుల్లో కూడా ట్రంప్ తన హోదాను మరచి వాచాలత ప్రదర్శించడాన్ని ఏ దేశమూ హర్షించడం లేదు. అదేఇప్పుడు ప్రపంచ దేశాలను సంక్షోభంలో ముంచుతోంది. ఆయన మాటలకు నాటో అరబ్‌దేశాలు ఖాతరు చేయడంలేదు. తాజాగా అమెరికా, ఇరాన్ యుద్ధ ఘర్షణలో ఇటలీలోని తమ సైనిక స్థావరాలను భాగస్వామ్యం చేయబోమని 'నాటో' వేదికగా ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోని స్పష్టంచేశారు. ఇరువర్గాల మధ్య ఘర్షణలు తగ్గించే ప్రయత్నానికి బదులు వత్తాసు పలకడం విష యంలో ఔచిత్యం లేదు. తమతో కలిసిరాని స్పెయిన్ వంటి దేశాలతో అమెరికా ఏకపక్షంగా ట్రేడ్‌డీల్‌ను ఉపసంహరించుకుంది. ఇరాన్‌పై భీకర దాడులకు సహకరించాలని ఆయా దేశాల మెడపై ట్రంప్ కత్తివేలాడుతోంది. యుద్ధశాంతులలో తనదే పైచేయి అనిచెప్పుకున్న ఆయన ఇరాన్‌ను సర్వనాశనం చేయాలని సంకల్పం చెప్పుకున్నట్లుగానే ఉంది. ఇరాన్ ప్రపంచ చిత్రపటంలో కనిపించదు. ఇరాన్‌ను అణ్వాయుధరహిత దేశం స్థాయికి పడకొట్టేశామని చెప్పుకున్న ట్రంప్ ఇంకా దాడులు ఎందుకు కొనసాగిస్తున్నారో ఎవరూ జవాబు చెప్పలేని ప్రశ్న. పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. మరోసారి ప్రపంచ దేశాలను గందరగోళంలోకి నెట్టే అసందర్భ ప్రేలాపనలకు, యుద్ధ నిర్ణయాలకు పర్యవసానాలకు శ్వేత సౌధాధినేత జవాబు చెప్పాలి. 'నాసైన్యం- నా ఇష్టం' అంటే కుద రదు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్, అమెరికా దాడులు ప్రతిదాడులు తర్వాత చమురు సరఫరాలకు అంతరాయం ఏర్పడిన రీత్యా బ్రెంట్‌క్రూడ్ ధరలు పెరిగాయి. శాంతి ఒప్పందం కూడా ప్రశాంతంగా జరుగలేదు. ఇరాన్‌ను బెదిరించి లొంగదీసుకోవాలన్న అమెరికా ఆశలు అడియాసలే అయ్యాయి. తీరా ఆరునెలల తాత్కాలిక ఒప్పందం ముణ్ణాళ్ల ముచ్చటే అయింది. అమెరికా గొంతెమ్మ షరతులు కారణంగానే ఇరాన్ లొంగినట్లు సయోధ్యకొచ్చినా ట్రంప్ వాచాలత వారిని పూర్తిస్థాయి శాశ్వత ఒప్పందం దిశగా పయనించనీయలేదు. తుర్కియేలో నాటో సదస్సు పూర్తయ్యాక ట్రంప్ మాట్లాడిన మాటలేవీ వినసొంపుగా లేదు. ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నట్లు చెప్పడం అదొక టెంపరితనమే. ఇప్పటికీ చాలా దేశాలు ట్రంప్ అనౌచిత వైఖరి వలలో ఆర్థికంగా బలహీనపడ్డాయి. ఇప్పటికిప్పుడు శాశ్వత మైత్రీ సంబంధాలు ఏర్పడినా గత యుద్ధపు నాటి పర్యవసానాలు ఫలితాలను తట్టుకుని వెంటనే నిలదొక్కుకునే పరిస్థితి ఏ దేశానికీ లేదు. మళ్లీ ఇప్పటి ఉద్రిక్తతలు ప్రపంచాన్ని ఏపరిస్థితికి తీసుకెళ్తుందోనని అన్నిదేశాలు ఆందోళన పడుతున్నాయి. ఇప్పటికే స్టాక్ మార్కెట్‌ల కుదేలయ్యాయి. తాత్కాలిక ఒప్పందం వీగిపోయింది. కాల్పుల విరమణకు తెరపడిం దన్న ట్రంప్ వాక్యాలు అంతర్జాతీయ చమురు మార్కెట్ పై ప్రభావం చూపాయి. ఆరుశాతం చమురు ఉత్పత్తుల ధరలు పెరిగాయి. ఇరాన్ చమురు అమ్మకాలపై అమెరికా మళ్లీ ఆంక్షలు విధించింది. ఇరాన్‌లో తమ దాడులకు వీలున్న లక్ష్యాలన్నిటినీ ఏకరువు పెట్టి మరీ ట్రంప్ ఆదేశాన్ని హెచ్చరిస్తున్నారు. ఖమెనీ అంత్యక్రియలు ప్రారంభమైన వేళ తానే కనుకదయ చూపకపోతే ఆ అంత్యక్రియల సందర్భంగా బాంబులేసి ఇరాన్ పెద్ద తలకాయలను ఒక్కసారిగా లేపేసే వాడిననే ట్రంప్ చెప్పుకోవడం కూడా ఆ దేశం ఆగ్రహానికి కారణమైంది. ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేశామని చెప్తూనే 'ఖర్గ్ ద్వీపం' దాడుల విషయం ప్రస్తావిం చడం కూడా ఇరాన్ కోపానికి కారణమే. అమెరికా సైన్యం ఇరాన్ భూ భాగంపై బుధవారం రాత్రి చేసిన భీకరమైన వైమానిక దాడులు బాగా కల్లోల పరుస్తున్నాయి. ఈ దాడుల్లో భారతదేశ భాగస్వామ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన చబహార్ నౌకాశ్రయం అమెరికా క్షిపణులు ఒక్కసారిగా విరుచుకు పడడంతో భారీగా దెబ్బతిందన్న సమాచారం ఆందోళనకరమే. దెబ్బతిన్న దేశాల సైతం ఉభయ యుద్ధ భాగస్వామ్య మున్న దేశాలను శాంతి దిశగా సన్నద్ధం చేయడమొక్కటే శరణ్యం.

అందం తొందరగా కంటికి పాతబడి పోతుంది. శౌశీల్యానికి మాత్రమే ఎప్పుడూ నశించని ఆకర్షణ ఉంటుంది.



గురజాడ అప్పారావు

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.



కె.స్టానిస్లావిస్కి

## ప్రజావాక్కు



### భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యం

లక్నోలో వివాహ ఏర్పాట్ల మధ్య జరిగిన అగ్నిప్రమాదంలో నిశ్చితార్థం చేసుకున్న యువజంట మృతిచెందడం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించింది. ఈ విషాదం అగ్ని ప్రమాదాలు కేవలంప్రమాదవశాత్తూ జరిగేవికాదని, భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యం వల్ల సంభవిస్తున్న మానవ నిర్మిత విపత్తులని మరోసారి గుర్తుచేసింది. నివాస ప్రాంతంలో నడుస్తున్న వాణిజ్య భవనంలో అత్యవసర నిష్క్రమణ మార్గాలు లేకపోవడం లేదా పనిచేయకపోవడం వంటిలోపాలు భవనతనిఖీల్లోనే గుర్తించాల్సిన అంశాలు. అయినప్పటికీ అనేక చోట్ల అగ్నిమాపక అనుమతుల గడువు ముగిసినా, భద్రతా పరికరాలు పనిచేయకపోయినా, తనిఖీలు నామమాత్రంగానే కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాతే బాధ్యులపై చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారింది. ప్రతి నగరంలో నివాస ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వాణిజ్య భవనాలపై ముందస్తు సమాచారం లేకుండా అగ్ని భద్రతా తనిఖీలు నిర్వహించడం తప్పనిసరి చేయాలి.

- సి. సాయిరుత్విక్, శ్రీకాకుళం

### ఉద్యమకారులను గుర్తించాలి

తెలంగాణ తొలి దశ 1969, మలిదశ ఉద్యమం 2001 నుండి 2014 వరకు జరిగిన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగుల గుర్తింపుకు ప్రాముఖ్యతఇవ్వాలి. మరీ ముఖ్యంగా మలిదశ ఉద్యమంలో వివిధయూనివర్సిటీ విద్యార్థులు, ఉన్నత విద్యలను అభ్యసించిన నిరుద్యోగులు ఇటీవలకాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం జరిగింది. తెలంగాణ ఉద్యమకారులను ప్రత్యేకంగా గుర్తించాలి. గత ప్రభుత్వంలో ఉద్యోగ నియామకాలు తక్కువ సంఖ్యలో ఉండి నిధులు నియామకాల ఏకైక లక్ష్యం కోసం తెలంగాణ రాష్ట్ర సాధనే ఊపిరిగా ఉద్యమించి ఇటీవల కాలంలో ఉద్యోగాలు సాధించిన ఉద్యమకారులకు తక్కువ సర్వీస్ సమస్యల పరిష్కారం కోసం వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ ఆలోచనచేసి ఆచరణ చేపట్టాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### సాంకేతికత పట్ల అవగాహన అవసరం

నేడు సమాజంలో ప్రతి పనికి సాంకేతికత వినియోగం ఎక్కువగా అయింది. కావున ప్రతివిషయంలో సాంకేతికత పట్ల అవగాహన పెంచుకుని మన పనులకు ఇతరులపై ఎక్కువగా ఆధారపడకుండా మనమే పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుంది.

### పరిశుభ్రత ప్రతి పౌరుడి కర్తవ్యం

నేడు కొందరు ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం, ప్లాస్టిక్ సీసాలు, కవర్లు, ఆహార అవశేషాలు రోడ్లపై పడేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్తను నిర్లక్ష్యంగా పారేయడం వల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి అనేక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మన వీధులు, పార్కులు, బహిరంగ ప్రదేశాలుకూడా అంతేశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది. పరిశుభ్రత ప్రభుత్వ బాధ్యతే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం కూడా. పరిశుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం. ఇతరులకు ఆదర్శంగా నిలుద్దాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### హోటల్ లైసెన్సు రద్దు చేయాలి

సినిమా హాల్‌కి వెళితే అక్కడ ఉచిత టాయిలెట్స్ ఖచ్చితంగా ఉంటాయి. అలాగే హోటల్‌కువెళితే అక్కడ కూడా టాయిలెట్లు ఉంటాయి. అవి కనీస అవసరాలు. మరి నిత్యం విజయవాడ లోని బస్టాండుకు వేలాదిమంది వస్తుంటారు. బస్టాండులోని అరైవల్ దగ్గరున్న షిర్డీ హోటల్‌కు వేలాదిమంది భోజనం , టిఫిన్లు చేస్తుంటారు. అక్కడ హోటల్‌లో టాయిలెట్లు ఉండాలి. మొన్న ఆ హోటల్‌లో భోంచేసి యూరినల్స్ ఎక్కడ అని అడిగితే పక్కన ఉన్న ఐదురూపాయల టాయిలెట్లు చూపించారు. మీ హోటల్‌లో టాయిలెట్ లేదా అని అడిగితే లేదన్నారు. మరి టాయిలెట్ లేకుండా ఆ హోటల్‌కు లైసెన్స్ ఎలా ఇచ్చారు? ఆ అవసరం తీర్చాల్సిన బాధ్యత హోటల్ వారిదే. కనుక సంబంధిత అధికారులు తక్షణమే విజయవాడ ఆర్టీసీ బస్టాండులోని షిర్డీ హోటల్ లైసెన్స్ రద్దు చేయాలి. ఆర్టీసీ యాజమాన్యం వారు కూడా తక్షణమే చర్యలు తీసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### అన్నదాత పట్ల చొరవ చూపాలి

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కుదేలవుతున్న రైతన్నకష్టాలు వర్ణనాతీతం. అనాది నుంచి కర్షకుడికి అతివృష్టి, అనావృష్టి అవినాభావ సంబంధం అంటే అతిశయోక్తికాదు. అగ్నికిఆజ్యం పోయకుండా కల్తీ విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సంబంధిత వనరులతో మూలిగే నక్కమీద తాటికాయపడినట్లు ఈ యేడాది రుతు పవనాలు ఆలస్యానికి కారణమయిన ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావంవల్ల పంటలకు కోలుకోలేని దెబ్బ. కేంద్ర రాష్ట్ర ప్రభు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి: ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# విధానాలు, వివాదాలలో ఇథనాల్

**ఇథనాల్ శక్తి సాంద్రత పెట్రోల్ కంటే తక్కువ కావడంతో, మైలేజీపై కొంత ప్రభావం ఉండటం సహజం. లీటర్ ఇథనాల్‌లో సుమారు 21మెగాజౌల్స్ శక్తి ఉండగా, పెట్రోల్‌లో అది 32 మెగాజౌల్స్ వరకు ఉంటుంది. అయితే ఇ-20లో కేవలం 20శాతం మాత్రమే ఇథనాల్ ఉండటంతో, మైలేజీ పై వాస్తవ ప్రభావం 2నుండి 4శాతంలోపే ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు, ఇథనాల్‌కు అనుకూలంగా వినిపించే ఒక సాంకేతిక వాదన కూడా ఉంది. శక్తిసాంద్రత తక్కువగా ఉన్నప్పటికీ, ఇథనాల్ ఆక్టేన్ సంఖ్య పెట్రోల్ కంటే గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. అధిక ఆక్టేన్ ఇంధనం ఇంజిన్‌లో అనియంత్రిత దహనం (నాకింగ్) సమస్యను తగ్గించి, తగిన విధంగా రూపకల్పన చేసిన ఇంజిన్లలో పనితీరును మెరుగు పరచగలదని సాంకేతిక నిపుణుల అంచనా. అయితే ఈ ప్రయోజనాలు ఎంత మేరకు సాధారణ వినియోగదారుడికి అందుతున్నాయన్నది ఇంకా చర్చనీయాంశంగానే ఉంది.**



కృష్ణబాలాజి పల్లపోతు

దేశంలో రెండు దశాబ్దాలకు పైగా అమలవుతున్న ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం ఇ-20 స్థాయికి అంటే 20 శాతానికి చేరుకోవడంతో దాని ప్రయోజనాలు, పరిమితులు, దీర్ఘకాలిక ప్రభావాలపై చర్చలు ఊపందుకున్నాయి. చమురు దిగుమతులనుకొంత మేర తగ్గించి విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడం, శిలాజ ఇంధనాలవల్ల ఏర్పడే కర్బన ఉద్గారాలను నియంత్రించడం, చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు వినియోగావకాశాలు కల్పించి రైతుల ఆదాయం పెంచడం ఈ విధానం ప్రధాన లక్ష్యాలు. అయితే, ఆహార అవసరాలకు ఉపయోగపడే పంటలను ఇంధన ఉత్పత్తికి మళ్లించడం సమంజసమేనా? ప్రకృతి విపత్తులు, వాతావరణ మార్పుల వల్ల పంటల దిగుబడి తగ్గితే ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి? అన్న ప్రశ్నలు ప్రధానంగా వినిపిస్తూనే ఉన్నాయి. వాస్తవానికి, కేంద్ర ప్రభుత్వం 2003లో బ్రెజిల్, అమెరికా వంటి దేశాల తరహాలో ఇథనాల్ సమ్మిళితపెట్రోల్ వాడకాన్ని ప్రోత్సహించడం ప్రారంభించింది. ఇథనాల్ అనే ఆల్కహాల్ రకానికి చెందిన సేంద్రీయ పదార్థం చెరకు, మొక్క జొన్న వంటి పంటలను పులియబెట్టడం ద్వారా ఉత్పన్నమవుతుంది. 2013-14లో దేశ సగటు ఇథనాల్ మిశ్రమం 2శాతానికి లోపే ఉండేది. అది క్రమంగా పెరుగుతూ, 2025 చివరి నాటికి 20శాతం లక్ష్యాన్ని గడువుకంటే ముందుగానే సాధించింది. దాంతో 2026 ఏప్రిల్ నాటికి దేశవ్యాప్తంగా ఇ-20 ప్రామాణిక పెట్రోల్‌గా ప్రకటించబడింది. ఈ లక్ష్య సాధన కోసం ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచారు. 2017-18లో సుమారు 500 కోట్ల లీటర్లు మాత్రమే ఉన్న ఇథనాల్ ఉత్పాదనా సామర్థ్యం 2023- 24 నాటికి 1,600 కోట్ల లీటర్లు దాటింది. మహా రాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో డిస్టిలరీల సంఖ్య భారీగా పెరగడంతో, ఆయా ప్రాంతాల్లో వ్యవసాయవాణిజ్య కార్యకలాపాలు ఊపందుకోవడం ఆశాజనకమైన పరిణామం. ఈ కార్యక్రమం ద్వారా గత పదేళ్లలో సుమారు లక్షా 63 వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆదా అయిందని, సంబంధిత రైతులకు పంట కొనుగోళ్లకు గాను లక్షా పదివేల కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని అధి కారిక అంచనాలు చెబుతున్నాయి. ఈ సంఖ్యలు, పరిణా మాలు స్థూలంగా ఆశాజనకంగానే కనిపిస్తున్నప్పటికీ, విధాన నిర్ణయం అమలులో ఉన్న లోటుపాట్లపై ఎక్కువ చర్చ జరుగుతోంది. ఎందుకంటే అత్యుత్తమమైన విధానాలను కూడా అమలులో లోపాల వల్ల చతికిలపడవచ్చున్నది అనేక సందర్భాల్లో రుజువైంది. ఇ-20పై సాధారణ ప్రజల నుండి ఎక్కువగా వినిపించే అభ్యంతరాలు మైలేజీ తగ్గుదల, వాహనాల దీర్ఘకాలిక పనితీరుపై దాని ప్రభావానికి సంబంధించినవి. ఇథనాల్ శక్తి సాంద్రత పెట్రోల్ కంటే తక్కువ కావడంతో, మైలేజీపై కొంత ప్రభావం ఉండటం సహజం. లీటర్ ఇథనాల్‌లో సుమారు 21మెగాజౌల్స్ శక్తి ఉండగా, పెట్రోల్‌లో అది 32 మెగాజౌల్స్ వరకు ఉంటుంది. అయితే ఇ-20లో కేవలం 20శాతం మాత్రమే ఇథనాల్ ఉండటంతో, మైలేజీ పై వాస్తవ ప్రభావం 2నుండి 4శాతం లోపే ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు, ఇథనాల్‌కు అనుకూలంగా వినిపించే ఒక సాంకేతిక వాదన కూడా ఉంది. శక్తిసాంద్రత తక్కువగా ఉన్నప్పటికీ, ఇథనాల్ ఆక్టేన్ సంఖ్య పెట్రోల్ కంటే గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. అధిక ఆక్టేన్




ఇంధనం ఇంజిన్‌లో అనియంత్రిత దహనం (నాకింగ్) సమస్యను తగ్గించి, తగిన విధంగా రూపకల్పన చేసిన ఇంజిన్లలో పనితీరును మెరుగుపరచగలదని సాంకేతిక నిపుణుల అంచనా. అయితే ఈ ప్రయోజనాలు ఎంత మేరకు సాధారణ వినియోగదారుడికి అందుతున్నాయన్నది ఇంకా చర్చనీయాంశంగానే ఉంది. లోకల్‌సర్కిల్స్ అనే ప్రముఖ పౌర వేదిక నిర్వహించిన సర్వే ప్రకారం 2023కు ముందు తయారైన వాహనాలను ఉపయోగిస్తున్న వారిలో 56శాతం మంది 10 శాతానికి పైగా మైలేజీ తగ్గిందని పేర్కొన్నారు. ప్రజల అనుభవానికీ, అధికారిక అంచనాలకు మధ్య ఉన్న ఈ గణనీయమైన వ్యత్యాసానికి గల కారణాలపై ప్రభుత్వం నుండి స్పష్టమైన, సంతృప్తికరమైన, గణాంకాలతో కూడిన వివరణ కోసం వినియోగదారులు ఎదురు చూస్తున్నారు. అలాగే, కొత్త వాహనాలను ఇ-20కు అనుగుణంగా తయారు చేస్తున్నప్పటికీ, ఇప్పటికే రోడ్లపై ఉన్న కోట్లాది వాహనాలపై దీర్ఘకాల ప్రభావం గురించి ఆందోళనలు కొనసాగుతున్నాయి. సర్వేల్లో దాదాపు 28శాతం మంది వాహనదారులు వివిధ సమస్యలను నివేదించారు. దీనిపై కూడా ప్రభుత్వం నుండి రాజకీయ ప్రకటనలే తప్ప గట్టి భరోసాలభించలేదు. ప్రజల్లో అసంతృప్తికి మరోకారణం పెట్రోల్‌లో కొంత భాగాన్ని స్థానికంగా, సాపేక్షంగా తక్కువ ధరలో లభ్యమయ్యే ఇథనాల్‌తో భర్తీ చేస్తున్నప్పటికీ, ధరలో ప్రయోజనం కనిపించడం లేదు. ఒకవైపు మైలేజీపై సందేహాలు, మరోవైపు వాహనాల పనితీరుపై ఆందోళనలు, దానికి తోడు ధరల్లో ఆశించిన తగ్గుదల లేకపోవడం వెరసిఇ-20పై అసంతృప్తికి కారణమవుతున్నాయి. ఇబ్బందులను స్వచ్ఛందంగా భరించడానికి సిద్ధపడుతున్నప్పుడు, కనీసం ధరల పరంగానైనా కొంత ఉపశమనం ఉండాలని వినియోగదారులు ఆశించడం సహజమే. ఇటీవలి కాలంలో మరో వాదన కూడా ప్రముఖంగా వినిపిస్తోంది 'నా వాహనం ఫలానా ఇంధనంతోనే నడవాలని కట్టడి చేయడం ఎంతవరకూ సబబు? మైలేజి, వాహనం తయారీ, ఇంజన్ పనితీరు, ఇంధనం ధర వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని సరైనఇంధనాన్ని ఎంచుకునే అవకాశం నాకే ఉండటం సమంజసం కదా!'. బ్రెజిల్ వంటి దేశాల అనుభవంతో పోల్చుకుంటే, ఈ ఆవేదన అర్థవంతంగానే కనిపిస్తోంది. పర్యావరణ ప్రయోజనాల విషయంలో కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. ఇథనాల్ మిశ్రమం వల్ల కొన్నిఉద్గారాలు తగ్గుతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నప్పటికీ, దేశవ్యాప్తంగా గాలి,నాణ్యతపై దాని సమగ్ర ప్రభావాన్ని నిర్ధారించే దీర్ఘకాలిక స్వతంత్ర అధ్యయనాలు ఇప్పటికీ పరిమితంగానే ఉన్నాయి. మరోపక్క, దేశంలోని ప్రధాన నగరాల్లో వాయుకాలుష్యం ఇప్పటికీ ఆందోళనకర స్థాయిలోనే కొనసాగుతోంది. ఏవిధానమైనా దాని ఫలితాలను కొలవగలిగితేనే దానిపట్ల ప్రజల్లో విశ్వాసం బలపడుతుంది. ఇక్కడ మరో అంశం ఇథనాల్ ఉత్పత్తికి ప్రధానంగా ఉపయోగించే చెరకు పంట అత్యధిక నీటి వినియోగం కలిగిన పంటల్లో ఒకటి. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఇథనాల్ ఉత్పత్తి కోసం చెరకుపండిస్తే, అది భూగర్భ జలాలపై అదనపు ఒత్తిడికి దారితీస్తుందని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంధన విషయంలో స్వయం సమృద్ధి సాధించడం అభిలషణీయమే. కానీ దానికోసం ఆహారోత్పత్తికి కావాల్సిన భూగర్భ జలాలను పణంగాపెట్టడం సమర్థనీయమైనది కాదు. భవిష్యత్తులో భారత్ ఇ30, ఇ50 లేదా ఇ85 వంటి అధిక ఇథనాల్ మిశ్రమాలవైపు అడుగులు వేయాలనుకుంటే, అలాంటి సమగ్రవ్యవస్థను కూడా దశలవారీగా నిర్మించాల్సి ఉంటుంది. రెండు దశాబ్దాల ప్రయాణం తర్వాత కూడా ఆ దిశగా మన పురోగతి పూర్తి సంతృప్తికరంగా ఉందని చెప్పలేం. ప్రస్తుతం ఇ20పై చర్చ జరుగుతున్నప్పటికీ, సమాంతరంగా బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ 2026లో ఇ22, ఇ25, ఇ27, ఇ30 మిశ్రమాలకు సంబంధించిన ప్రమాణాలను ప్రకటించింది. ఇ85 మిశ్రమం కూడా పుణె, నాగ్‌పూర్ వంటి కొన్ని నగరాల్లో ప్రయోగాత్మకంగా అందు బాటులోకి వచ్చింది. ఇది సాధారణ పెట్రోల్ కంటే సుమారు రూ.20 తక్కువ ధరకు లభిస్తున్నప్పటికీ, మైలేజీ, ధరలోని రాయితీ మైలేజీ తగ్గుదలకు తగినంతగా ఉందా అన్నఅంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. 15 ఐసోబ్యుటినాల్ కలపడం ద్వారా ఈ తరహా డీజిల్ ఉత్పత్తి చేసే అవకాశాలు ప్రస్తుతం పరిశీలన దశలో ఉన్నాయి. చివరగా, ఇథ నాల్ విధానం విజయవంతమైందా లేదా అన్నది నిర్ణయిం చేది పారదర్శక గణాంకాలు, ఫలితాలను కొలవడానికి స్పష్ట మైన ప్రమాణాలు, అధ్యయనాలు, ప్రజల అనుభవాలే కానీ ఆర్భాటమైన ప్రకటనలు, నినాదాలు,

# చేపల రైతు చేతుల్లో దేశ ఆహార భద్రత



రామ కిష్టయ్య సంగనభట్ల

ప్రతి సంవత్సరం జూలై 10న భారత దేశం జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. దేశ ఆహార భద్రతకు, పోషకాహార అవసరాలకు తోడ్పడుతున్న మత్స్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న లక్షలాది చేపల రైతులు, మత్స్యకారులు, ఆక్వా ప్రెన్యూర్ల అంకిత భావానికి, కృషికి గుర్తింపుగా ఈ దినోత్సవం నిర్వహించ బడుతుంది. ఇది కేవలం ఒక రోజువేడుక మాత్రమే కాకుండా, దేశమత్స్య పారిశ్రామిక అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ప్రేరణాత్మక దినంగా నిలుస్తోంది. ఈ దినోత్సవాన్ని జూలై 10న జరుపుకోవడానికి ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. 1957లో ఇదే తేదీన, ప్రముఖ భారతీయ మత్స్య శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి, డాక్టర్ కె.హెచ్. అలీకున్నీ ఒడిశాలోని అంగుల్‌లో మేజర్ కార్ప్ చేపలపై హైపోఫిసేషన్ అనే శాస్త్రీయ సాంకేతికతను విజయవంతంగా ప్రయోగించారు. ఈ సాంకేతికత ద్వారా చేపల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. దీని ఫలితంగా దేశంలో వాణిజ్య ఆక్వాకల్చర్‌కు బలమైన భూమిక ఏర్పడింది. మత్స్య పాలనలో శాస్త్రీయత, ఉత్పాదకత పెరిగి నీలి విప్లవానికి నాంది పలికింది. నీలి విప్లవం ఫలితంగా భారత దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తి దారుగా నిలిచింది. దేశం మొత్తంలో చేపల ఉత్పత్తిలో సుమారు 65 శాతం వాణిజ్య ఆక్వాకల్చర్ ద్వారానే లభిస్తోంది. 2023-24 సంవత్సరానికి గాను భారత్‌లో చేపల ఉత్పత్తి సుమారు 174లక్షల మెట్రిక్ టన్నులు కాగా, వీటిలో 131లక్షల మెట్రిక్ టన్నులు ఆక్వాకల్చర్ నుంచి లభించాయి. అంతేకాకుండా, దేశీయ మత్స్య ఉత్పత్తిలో భారత్ వాటా ప్రపంచ స్థాయిలో 8శాతంగా ఉంది. ఈరంగం దాదాపు2.8కోట్ల మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవనాధారంగా మారింది. ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ముందంజ




లో ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోని చేపల ఉత్పత్తిలో దాదాపు 35శాతం వాటాను కలిగిఉంది. సరైన విధానాలు, సాగు కోసం అనుకూల వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఈ రాష్ట్రాలు మత్స్య రంగంలో అత్యుత్తమ స్థానాలను ఆక్రమించాయి. కేంద్ర ప్రభుత్వం నీలి విప్లవాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన వంటి పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా చేపల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, పోస్ట్‌హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, శీతల భద్రపరిచే భవనాలు, రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ మద్దతు వంటి రంగాల్లో అభివృద్ధికి పునాదులు వేశాయి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల పాత్రను పెంచడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. 2023-24లో పిఎమ్ఎమ్ఎస్ కింద దాదాపు ..2,500 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. నూతన ఆవిష్కరణలతో బయోఫ్లాక్, ఆర్ఏఎస్, ఇంటెన్సివ్ కల్చర్ పద్ధతులు రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తిని అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. నీటి వనరుల సమర్థ వినియోగం, ఆరోగ్య సంరక్షణ, చేపల నిర్వహణ వంటి అంశాల్లో శాస్త్రీయ మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు సాగుతున్నాయి. అయితే, ఈరంగం ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తక్కువ కావు. నీటి కాలుష్యం, సకాలంలోమార్కెట్ మద్దతు లేకపోవడం, సరైన ధరకే విక్రయానికి అవకాశాలు లేకపోవడం, రవాణా లోపాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయి. జలవనరుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కూడా తక్షణ పరిష్కారం కోరుకుంటున్నాయి. జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా కేంద్రం, రాష్ట్రాలస్థాయిలో అవార్డులు, సన్మానాలు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శనలు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం ద్వారా మత్స్యరంగ అభివృద్ధికి కొత్త దిక్సూచి చూపే ప్రయత్నం జరుగుతోంది. ఈ వేదికల్లో రైతులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు పరస్పరంగా జ్ఞానాన్నిపంచుకుంటూ వ్యవస్థను మెరుగు పరిచే మార్గాలుఅన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ చేపల రైతుల దినోత్సవం కేవలం స్మరణ దినంగా మాత్రమే కాక, మత్స్య రంగానికి విశిష్ట దిశానిర్దేశం చేసే ఒక ఉద్యమంగామారాలి. ప్రతి నీటి రైతు భారత ఆహార భద్రతకు కాపలా దారుడిగా నిలుస్తున్నాడు. వారి శ్రమకు, అంకిత భావానికి గౌరవం తెలుపడమే ఈ దినోత్సవ అసలైన ఉద్దేశం. ●

# నైపుణ్య విద్యే ఉద్యోగ భద్రతకు పునాది

సి.హెచ్.ప్రతాప్

దశాబ్దాలుగా భారతదేశంలో ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సులనే ఉపాధికి భరోసానిచ్చే విద్యగా భావించే అభిప్రాయం బలంగా నెలకొంది. మంచి ర్యాంకు వస్తే ఇంజినీరింగ్, అత్యుత్తమ ర్యాంకు వస్తే మెడిసిన్ అనే భావన ఇప్పటికీ చాలామంది తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. అయితే మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, సాంకేతిక విప్లవం, సేవారంగ విస్తరణ, నూతన పరిశ్రమల ఆవిర్భావం ఈ అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయి. నేటి ఉద్యోగ విపణిలో డిగ్రీ కంటే నైపుణ్యానికే ఎక్కువ విలువ లభిస్తోంది. కేంద్ర గణాంకాల ప్రకారం 2022-23లో భారతదేశంలో సుమారు 1.09 కోట్ల మంది ఉన్నత విద్యను పూర్తిచేశారు. అయితే ఇండియా స్కిల్స్ రిపోర్ట్ ప్రకారం పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఉన్న పట్టభద్రుల శాతం కేవలం 55శాతం మాత్రమే. అంటే విద్య పూర్తిచేసిన ప్రతి ఇద్దరిలో ఒకరు మాత్రమే ఉద్యోగానికి తగిన నైపుణ్యాలతో బయటకు వస్తున్నారన్న మాట. ఇదే భారత విద్యా వ్యవస్థ, పరిశ్రమల అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. ప్రతి సంవత్సరం దేశంలో సుమారు 11 నుంచి 12 లక్షల మంది ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతుండగా, ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందే అవకాశం మాత్రం సుమారు 70నుంచి 80 వేల మంది విద్యార్థులకు మాత్రమే లభిస్తోంది. మిగిలిన లక్షలాది మంది యువతకు ఇతర రంగాల్లో అవకాశాలు కల్పించడం కాలానుగుణ అవసరం. అందుకే ఉపాధి అవకాశాలను కేవలం రెండు కోర్సులకు పరిమితం చేయడం సరైన దృక్పథం కాదు. నేటి ప్రపంచంలో డేటా సైన్స్, కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, సైబర్ భద్రత, క్లౌడ్ కంప్యూటింగ్, డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్, సెమీకండక్టర్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధన రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. పరిశ్రమల అంచనాల ప్రకారం డేటా సైన్స్, కృత్రిమ మేధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు సంవత్సరానికి 15 నుంచి 20 శాతం చొప్పున పెరుగుతున్నాయి. అదే విధంగా ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో కూడా నిపుణుల అవసరం గణనీయంగా పెరుగుతోంది. సేవారంగం భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన చోదకశక్తిగా మారింది. దేశ జీడీపీలో ఈరంగం వాటా 55నుంచి 60శాతం వరకు ఉంది. హాస్పిటాలిటీ, టూరిజం, ఫుడ్ టెక్నాలజీ, హెల్త్‌కేర్,



ఫార్మసీ, బయోటెక్నాలజీ, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, లాజిస్టిక్స్, ఫ్యాషన్ డిజైన్, యానిమేషన్, గేమ్ డిజైన్, డిజిటల్ మార్కెటింగ్, ఫిల్మ్ టెక్నాలజీ, అగ్రిటెక్, ఫిన్‌టెక్ వంటి రంగాల్లో వేగంగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. కొన్ని రంగాల్లో వార్షిక నియామకాల వృద్ధి 8 నుంచి 12 శాతం వరకు నమోదవుతోంది. ప్రతి సంవత్సరం దేశంలో 25 నుంచి 30లక్షల మంది యువత ఐటీఐలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, వృత్తి శిక్షణా సంస్థల్లో చేరుతున్నారు. సరైన శిక్షణ పొందిన అభ్యర్థులకు దేశీయంగానే కాక విదేశాల్లో కూడా మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ముఖ్యంగా సమాచార సాంకేతికం, ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ, పారిశ్రామిక నిర్వహణ, వెల్డింగ్ ఆటోమేషన్ వంటి రంగాల్లో విదేశీ నియామకాలు పెరుగుతున్నాయి. ఇంటర్న్‌షిప్‌లకు కూడా నేటి ఉద్యోగ విపణిలో విశేష ప్రాధాన్యం ఏర్పడింది. పరిశ్రమల అధ్యయనాల ప్రకారం ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థుల్లో 30నుంచి 60 శాతం మంది అదే సంస్థల్లో ఉద్యోగాలు పొందుతున్నారు. మరోవైపు, పరిశ్రమల్లో నైపుణ్యాల కొరత కారణంగా సుమారు40నుంచి 50 శాతం ఉద్యోగాలకు అదనపు శిక్షణఇవ్వాల్సి వస్తోందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య బలమైన అనుసంధానం అవసరాన్ని స్పష్టంచేస్తోంది. ప్రభుత్వం కూడా విద్యావిధానంలో సమతుల్య దృక్పథాన్ని అవలంబించాలి. ఇంజినీరింగ్,మెడిసిన్ విద్యకు ఎంత ప్రాధాన్యం ఇస్తుందో, నైపుణ్యాధారిత, బహుళశాఖల, వృత్తి విద్యా కోర్సులకు కూడా అంతే ప్రాధాన్యం కల్పించాలి. ప్రతి జిల్లాలో ఆధునిక స్కిల్ యూనివర్సిటీలు, ఫినిషింగ్ స్కూల్స్, పరిశ్రమల భాగస్వామ్యంతో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పాఠశాలస్థాయి నుంచే కెరీర్ కౌన్సెలింగ్‌ను తప్పనిసరి చేసి, విద్యార్థుల అభిరుచి, సామర్థ్యానికి అనుగుణంగా కోర్సుల ఎంపికకు మార్గనిర్దేశం చేయాలి. స్టార్టప్‌లు, స్వయం ఉపాధి, డిజిటల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలి. దేశ అభివృద్ధికి వైద్యులు, ఇంజినీర్లు ఎంత అవసరమో, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, ఫార్మసీ పరిశోధకులు, బయోటెక్నాలజిస్టులు, డేటా విశ్లేషకులు, డిజైనర్లు, ఆరోగ్య సేవల నిపుణులు, సృజనాత్మక రంగాల ప్రతిభావంతులు కూడా అంతే అవసరం. ఉపాధిని నిర్ణయించేది కోర్సు కాదు. కాలానుగుణ నైపుణ్యం, నిరంతర అభ్యాసం, సృజనాత్మకత, నవకల్పన పట్లఆసక్తి. ఈఅవగాహన విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, విధాన నిర్ణేతల్లో పెరిగినప్పుడే భారత యువశక్తి ప్రపంచ ఉద్యోగ విపణిలో మరింత సమర్థంగా నిలబడగలదు. ●


ong-5_ong-5.qxd 7/9/2026 11:36 PM Page 1



## పొగాకు రైతుల సమస్యపై ప్రత్యేకదృష్టి : కలెక్టర్

**- పొందూరు పల్లెనిద్రలో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు**

**ఒంగోలు, ప్రభాతవార్త**



పొగాకు రైతుల సమస్యను పరిష్కరిం చేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాము. ప్రభుత్వ యంత్రాంగం ఈ సమస్యను నిశతంగా పరిశీలిస్తూ ఉన్నది. ధర విషయంలో పొగాకు రైతులందరికీ కచ్చితంగా న్యాయం జరిగేలా చూస్తాము అని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు భరోసా ఇచ్చారు. గురువారం ఆయన జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలిసి టంగుటూరు మండలం పొందూరు గ్రామంలో " పల్లెనిద్ర" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే "పల్లెనిద్ర" కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మెరుగైన జీవనోపాధి కోసం ఉపయోగించుకోవాలని సూచిం చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మనమిత్ర వాట్సప్ సేవలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే కౌశలం, విపత్తుల సమాచారాన్ని క్షణాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచే అవేర్ 2.0 ఆన్లైన్ పోర్టల్ గురించి స్వయంగా కలెక్టరే ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని గర్భిణులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. తల్లీబిడ్డ ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ, ఏ.ఎన్.ఎం.ల ద్వారా లభిస్తున్న సేవలను వినియోగించుకోవాలని, పోషకాహారం తీసుకుంటూ సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాగా, వైద్యుల ద్వారా పొందుతున్న సేవలపై గర్భిణులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్.హెచ్.జి. రుణాలను మెరుగైన జీవనోపాధి కోసం వినియోగించుకుంటున్నామని స్వయం సహాయక సంఘాల మహిళలు చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చిన "మన డబ్బులు మన లెక్కలు" వంటి యాప్‌ల ద్వారా ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత పెరిగిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఇవే ప్రధాన సమస్యలు: పొగాకు ధరలు తగ్గిపోకుండా చూడాలి. గ్రామంలోని, పరిసర చెరువుల అనుసంధానం కోసం చర్యలు తీసుకోవాలి. ఫలితంగా సాగు, త్రాగునీటికి ఇబ్బంది ఉండదు. స్థానికంగా బ్రిడ్జిలు కావాలి. గ్రామకంఠానికి సంబంధించిన భూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. గ్రామంలోని జాయింట్ ఎల్.పి.ఎం. సమస్యలను పరిష్కరించాలి. ఎస్సీ కాలనీలో మురుగనీటి సమస్య ఉన్నది. డ్రైనేజీ లేకపోవడం వలన మురుగునీరు పాఠశాల వద్ద నిల్వ ఉంటున్నది. ఈ స్కూలుకు ప్రహరీ గోడ కూడా లేదు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. శిథిలమైన అంగనవాడి స్థానంలో కొత్త భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. క్రిస్టియన్ పాలెంలో కట్టిన ఓవర్ హెడ్ ట్యాంకు నిరుపయోగంగా ఉన్నది. దీనిని అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలి. దాతలు ఇచ్చిన వాటర్ ప్లాంట్‌ను మాజీ సర్పంచ్ అమ్ముకున్నారు. విచారించి చర్యలు తీసుకోవాలి. గ్రామస్తులు ప్రస్తావించిన సమస్యలను కలెక్టర్ ఓపికతో విన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్థికేతర సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. స్థానికంగా అధిక విస్తీర్ణంలో పొగాకు సాగు చేయటం, అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా మన పొగాకు రైతులకు సమస్య ఎదురయిందన్నారు. కేంద్ర ప్రభుత్వము, పొగాకుబోర్డు నిర్దేశించిన విస్తీర్ణం మేరకే సాగు చేయాలని కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతం పండించిన పంటను కంపెనీలు పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## గ్రామాల్లో భూగర్భ జలాలను పెంచాలి

**- గోడ పత్రిక ఆవిష్కరించిన జిల్లా పంచాయతీ అధికారి**

**ఒంగోలు, ప్రభాతవార్త**




ప్రకృతి పర్యావరణ పరిరక్షణలో భాగంగా భూగర్భ జల సంపదను పెంచుకోవాలని తద్వారా నీటి సమస్యను పరిష్కరించుకోవచ్చని జిల్లా పంచాయతీ అధికారి అనుపమ తెలిపారు. గురువారం వాలంటీర్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎండినబోరు బావులను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా కూడా భూగర్భ జల మట్టం పెరుగుతుందని ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ జి.వీరభద్రాచారి తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు చర్యలలో భాగంగా రానున్న వర్షాకాలంలో విరివిగా మొక్కలు నాటి సంరక్షించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని ఈ విషయంలో ప్రజలను చైతన్యపరిచే విధంగా భూగర్భ జల మట్టాలను పెంచుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి అనుపమ పంచాయతీ అభివృద్ధి అధికారులకు సూచించారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇలాంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను చేపడుతున్న వీరభద్రాచారిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సంస్థ ప్రతినిధి గుంటూరు మస్తాన్ రావు పాల్గొన్నారు.

## ప్రకాశంలో తొలి రోబోటిక్ మోకాలి శస్త్రచికిత్స

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




ప్రకాశం జిల్లాలో తొలిసారిగా రోబోటిక్ సాంకేతికతతో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను అమర్ హాస్పిటల్స్ విజయవంతంగా నిర్వహించింది. వలేటివారిపాలెం మండలం బడేవారిపాలెం గ్రామానికి చెందిన 65 ఏళ్ల మాలకొండయ్యకు ప్రముఖ ఎముకల వ్యాధుల నిపుణుడు డా. అమర్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యాధునిక మిస్సో రోబోటిక్ వ్యవస్థ సహాయంతో శస్త్రచికిత్స చేపట్టారు. శస్త్రచికిత్స అనంతరం డా. శ్రీకాంత్ గణేష్ పర్యవేక్షణలో వ్యాయామ చికిత్స అందించగా రోగి ఆరోగ్యంగా కోలుకున్నట్లు వైద్యులు తెలిపారు. రోబోటిక్ వ్యవస్థ ద్వారా శస్త్రచికిత్సకు ముందే మోకాలి నిర్మాణాన్ని ఖచ్చితంగా విశ్లేషించి, రోగి శరీర నిర్మాణానికి అనుగుణంగా చికిత్స ప్రణాళిక రూపొందించినట్లు డా. అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. దీంతో కృత్రిమ మోకాలి భాగాన్ని సరైన స్థానంలో అమర్చడం, మోకాలి సమతుల్యతను మెరుగు సాధించడం సాధ్యమై తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావం, వేగంగా కోలుకోవడం, త్వరగా నడిచే సామర్థ్యం పెరగడం వంటి ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. రోబోటిక్ సాంకేతికత వల్ల శస్త్రచికిత్సల్లో మానవ తప్పిదాల అవకాశాలు తగ్గి ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు. మత్తు వైద్య నిపుణురాలు డా. హరిత మాట్లాడుతూ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తై రోగి పరిస్థితి స్థిరంగా ఉందన్నారు. అమర్ హాస్పిటల్స్ ప్రధాన నిర్వాహకుడు వినీల్ కుమార్ మాట్లాడుతూ రోబోటిక్ మోకాలి మార్పిడి కోసం ఇకపై మహానగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒంగోలులోనే ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. త్వరలో నాడీ శస్త్రచికిత్స, గుండె వైద్య విభాగాలను కూడా ప్రారంభించి జిల్లా ప్రజలకు మరింత సమగ్ర వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు.

## స్కూల్ బస్సుల భద్రతపై పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ఒంగోలు వన్‌టౌన్ పోలీసులు పాఠశాల బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్, సరస్వతి కళాశాల పరిసరాల్లో నిలిపి ఉంచిన పాఠశాల బస్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. బస్సుల ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు, అత్యవసర ద్వారాల పనితీరు, ప్రథమ చికిత్స పెట్టె, అగ్నిమాపక పరికరాలు, అత్యవసర నిష్క్రమణ మార్గాలు సక్రమంగా ఉన్నాయా లేదాఅని అధికారులు తనిఖీ చేశారు. బస్సులకు అవసరమైన అన్ని అనుమతులు, బీమా, కాలుష్య నియం త్రణ ధ్రువీకరణ పత్రాలు, ఇతర పత్రాలు అందుబాటులో ఉన్నాయా అనే విషయాన్ని కూడా పరిశీలించారు. డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, అనుభవం, రోడ్డు భద్రతా నిబంధన లపై అవగాహన ఉందా అనే అంశాలను పరిశీలించి సూచనలు చేశారు. బస్సుల్లో వేగ నియంత్రణ పరికరాలు, సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, విద్యార్థుల భద్రతకు అవసరమైన ఇతర సదుపా యాలు ఉన్నాయా అనే అంశాలను కూడా పరిశీలించారు. రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ విద్యార్థులకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించాలని డ్రైవర్లు, పాఠశాల యాజమాన్యాలకు సూచించారు.

ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




### బాలినేని మళ్లీ యాక్టివ్..జనసేనలో కొత్త వ్యూహాలు..

# ప్రణీత్‌రెడ్డి ప్రభావం పెరగనున్నదా..!




**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారారు. 2024 ఎన్నికల అనంతరం వైసీపీని వీడి జనసేనలో చేరిన ఆయన గత రెండేళ్లుగా రాజకీయంగా నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు జనసేనలో తనదైన శైలిలో వ్యూహాలు అమలు చేస్తున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన కమిటీల రద్దు, కొత్త కమిటీల ఏర్పాటు నేపథ్యంలో బాలినేని పాత్రపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రస్తుతం నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడిగా ఉన్న బాలినేని, ఒంగోలు పార్లమెంట్ పరిధిలో జిల్లా అధ్యక్ష పదవి, నియోజకవర్గ ఇన్‌చార్జి పదవుల ఎంపికలో కీలకంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన కుమారుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి కూడా పార్టీ పదవికి దరఖాస్తు చేయడం జిల్లా రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ప్రణీత్‌రెడ్డికి గట్టి పోటీ లేకుండా ఉండేందుకు బాలినేని తెరవెనుక రాజకీయ చతురత ప్రదర్శించారనే ప్రచారం కూడా వినిపిస్తోంది. దీంతో ఇప్పటివరకు నిశ్శబ్దంగా ఉన్న బాలినేని వర్గం మళ్లీ చురుకుగా మారిందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు పొందిన బాలినేని, జనసేనలో కూడా అదే స్థాయిలో ప్రభావం చూపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో తన వర్గానికి తగిన ప్రాధాన్యం కల్పించే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా స్థాయిలో జనసేనను మరింత బలోపేతం చేయడంతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే రాజకీయ సమీకరణాలను మార్చే ప్రయత్నం జరుగుతోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కొత్త కమిటీల నియామకాల అనంతరం జిల్లాలో పార్టీ బలాబలాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయని నేతలు భావిస్తున్నారు. పార్టీ విస్తరణతో పాటు యువ నాయకత్వానికి ప్రాధాన్యం కల్పించే దిశగా కూడా కసరత్తు జరుగుతోందనే చర్చ వినిపిస్తోంది. బాలినేని రాజకీయ చురుకుదనం జనసేన జిల్లా వ్యవహారాలపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో ఇతర పార్టీల నాయకులు కూడా జనసేనలో చోటుచేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నట్లు సమాచారం. రానున్న స్థానిక ఎన్నికలకు ముందే బలమైన సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయడంపై పార్టీ అధిష్ఠానం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మరోవైపు బాలినేని మళ్లీ క్రియాశీలకంగా మారడంతో ప్రత్యర్థి పార్టీల నేతలు కూడా జిల్లాలో మారుతున్న రాజకీయ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు సమాచారం. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు బాలినేని సన్నిహితుడిగా మారడంతో రాష్ట్ర స్థాయిలో ఆయన, జిల్లా స్థాయిలో ప్రణీత్‌రెడ్డి ప్రభావం పెరిగే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇవన్నీ రాజకీయ వర్గాల్లో జరుగుతున్న ప్రచారమే కాగా, పార్టీ నియామకాలపై అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది.

## ఓటర్ల నమోదు పక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజాబాబు

**- అధికారుల పనితీరుపై అసహనం**

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు పట్టణంలోని గాంధీ నగర్ వద్ద ఉన్న వార్డు సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. అందుబాటులో భాగంగా సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు చేస్తున్న ఓటర్ల నమోదు పక్రియను నిశితంగా పరిశీలించారు. ఈఆర్వోలు ఎంత మంది ఉన్నారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటరు నమోదు పక్రియలో అలసత్వం వహిస్తున్న బీఎల్ఓ అడిషనల్ బీఎల్ఓ పని తీరుపై అసహనం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని వేరే వారిని నియమించి ఓటర్ల జాబితా సవరణ పక్రియను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మొబైల్ యాప్ ద్వారా ఓటరు నమోదు పక్రియ విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. సవరణ పక్రియను త్వరితగతిన, ఖచ్చితత్వంతో సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఏ ఒక్కరు కూడా సమగ్ర ఓటర్ల జాబితా సవరణ పక్రియలో మిగిలిపోకూడదని ఆయన అన్నారు. అందరికి అవకాశం కల్పించేలా అందరి పేర్లు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, ఒంగోలు నగర పాలక సంస్థ కమీషనర్ కృష్ణయ్య, రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

## నగర పాలక సంస్థ కార్యాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఒంగోలు, ప్రభాతవార్త**



నగర పాలక సంస్థ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్, నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి పి.రాజాబాబు గురు వారం పరిశీలించారు. ఈ సందర్భం గా పలువురు నుండి అర్జీలను స్వీక రించి వాటిని సత్వర పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేశారు. అన్నదమ్ముల మధ్య భూ వివాదాలు, ఇంటికి పోయే దారిలో రోడ్ల మీద నిర్మించిన షెడ్డును తీసివేయాలని అంతే కాకుండా గత వారం వచ్చిన అర్జీల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన సంబంధిత సిబ్బందికి సూచించారు. మామిడిపాలెం వద్ద రోడ్డు మీద నిర్మించిన షెడ్‌ను సత్వరమే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని డబుల్ రిజిస్ట్రేషన్ విషయంలో ఆయన సూచించారు. డబుల్ రిజిస్ట్రేషన్ విషయమై సంబంధిత అర్జీదారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న అభ్యర్థులకు పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమీషనర్ కృష్ణయ్య, మెడికల్ హెల్త్ ఆఫీసర్ నవి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీసీఓజీ మహాసదస్సుకు ఒంగోలు సిద్ధం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



మహిళల ఆరోగ్యమే దేశ గౌరవం అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ ప్రసూతి, స్త్రీ రోగ నిపుణుల సంఘం (ఏపీసీఓజీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11వ వార్షిక రాష్ట్ర మహాసదస్సు ఈ నెల 10, 11, 12 తేదీల్లో ఒంగోలులోని ఏబీఎం ఫంక్షన్ హాల్‌లో జరగనుంది. ఇన్నోవేట్-ఇంటిగ్రేట్-ఇంప్లిమెంట్ అనే ప్రధాన థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,500 మంది గైనకాలజిస్టులు, ప్రసూతి వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు పాల్గొననున్నారు. ఆధునిక వైద్య సాంకేతికత, మాతా-శిశు ఆరోగ్యం, ఇన్ఫర్టిలిటీ, క్యాన్సర్ అవగాహన, క్లిష్ట కేసుల నిర్వహణ, శాస్త్రీయ పరిశోధనలు, లైవ్ వర్క్‌షాపులు, ప్యానెల్ చర్చలు, పోస్టర్, పేపర్ ప్రెజెంటేషన్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సదస్సులో రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి ప్రముఖ వైద్య నిపుణులు హాజరై తమ అనుభవాలను పంచుకోనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

## కరెంట్ షాక్ తగిలి యువకుడు మృతి

**కొత్తపట్నం, జూలై 9 ప్రభాతవార్త**



కొత్తపట్నం మండల కేంద్రంలో సహాస్ర వైన్ షాప్ పక్కన పొలంలో విద్యుత్తు కండక్టర్ తెగి పడటంతో వాటికి తగిలి యువకుడు మృతి చెందడం జరిగింది. వివరాల్లోకెళ్తే పులి బద్రి నారాయణ 22 సంవత్సరాలు పశువుల మేత కు నీళ్లు పెట్టడానికి మోటార్ వేయటానికి వెళ్లే క్రమంలో కరెంటు కండక్టర్ తెగి పడిన వాటిని గమనించుకోకుండా వెళ్లడంతో యువకుడు తెగిపడ్డ వైర్లకు తగిలి అక్కడే మృతి చెందడం జరిగింది. మృతుడి యొక్క తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు కావడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరై ఏడుస్తున్నారు. సంఘటనను తెలుసుకున్న ఎస్సై వి సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని చుట్టుపక్కన ఉన్న పరిస్థితిని పరిశీలించడం జరిగింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్ హాస్పిటల్కు తరలించి మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై వి.సుదాకర్ తెలియజేశారు.

## మాగుంట చొరువతో 5 రోడ్లు, 4బ్రిడ్జిలు మంజూరు చేసిన కేంద్రం

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతుల సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఒంగోలు పార్లమెంటు పరిదిలో రూ.30.506 కోట్లు వ్యయంతో 5 రోడ్లు, 4 బ్రిడ్జిలు నిర్మించుటకు ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన- ఐవీ - 2026-27 క్రింద ఆమోదించారు.

రోడ్ల వివరాలుః ముండ్లమూరు మండలంలో దర్శి- అద్దంకి రోడ్డు నుండి పులిపాడు తాండా వరకు (204లక్షలు), పామూరు మండలంలో కేపీ రోడ్డు నుండి కుంభాలదిన్నె వరకు వయా రేణిమడుగు(619లక్షలు), పామూరు మండలంలోని రేణిమడుగు నుండి అక్కంపేట వరకు(166 లక్షలు), పామూరు మండలంలో రఘునాథపురం నుండి బోదవాడ వరకు వయా రాజాసాహేబ్ (425 లక్షలు), యర్రగొండపాలెంలో వై.పాలెం- కొలుకుల రోడ్డు నుండి వీరాయపాలెం వరకు (రూ.75లక్షలు).

బ్రిడ్జిలు వివరాలుః పామూరు మండలంలో నేరెళ్ళవాగుపై హైలెవల్ బ్రిడ్జి -కి.మీ 11/2 టు 11/4 వద్ద(రూ.520లక్షలు), పామూరు మండలంలో నేరెళ్ళ వాగుపై హైలెవల్ బ్రిడ్జి కి.మీ 0/8 టు 1/0 వద్ద (575 లక్షలు), పామూరు మండలంలో లోకల్ వాగుపై హైలెవల్ బ్రిడ్జి - కి.మీ 1/4 టు 1/6 వద్ద(189.10లక్షలు), పామూరు మండలంలో లోకల్ వాగుపై హైవెల్ బ్రిడ్జి -కి.మీ 2/8 టు 3/0 వద్ద(276.50లక్షలు), ఈ రోడ్లు , బ్రిడ్జీలు గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతో పాటు సామాజిక- ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని తెలియజేస్తూ ఈ పనులు ఎక్కువ కాలం ఉండేదానికి నాణ్యతతో నిర్మించే విధంగా చూడాల్సిందిగా కేంద్ర మంత్రి మాగుంట శ్రీనివాసులురెడ్డిని లేఖద్వారా ఎతలియజేశారు. పనులు ఆమోదించినందుకు శివరాజ్‌సింగ్ చౌహాన్‌కి మాగుంట శ్రీనివాసులురెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## గర్భిణీలు కిల్కారి సేవలు వినియోగించుకోవాలి

**- ఆశా నోడల్ అధికారి రాజేశ్వరి**

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




గర్భిణీలు,బాలింతల ఆరోగ్య సంరక్షణ కు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న కిల్కారి సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కిల్కారి రీజినల్ ప్రోగ్రామ్ అధికారి రాజు సూచిం చారు. ఒంగోలు లోని పాపా కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రధాన్ మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమాన్ని ఆయన జిల్లా ఆశా నోడల్ అధికారి రాజేశ్వరితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు అందుతున్న వైద్య సేవలు, పరీక్షలు, ఆరోగ్య సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం కిల్కారి సేవలపై అవగాహన కల్పిస్తూ గర్భధారణ నాలుగో నెల నుంచి శిశువుకు ఒక సంవత్సరం వయస్సు వచ్చే వరకు 911600403660 నంబర్ నుంచి ప్రతి నెల కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయని తెలిపారు. ఈ కాల్స్ ద్వారా గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన వైద్య పరీక్షలు, పౌష్టికాహారం, గర్భిణీలకు చేయాల్సిన ఏఎన్‌సీ పరీక్షలు, ప్రసవ ప్రణాళిక, తల్లిపాల ప్రాముఖ్యత, నవజాత శిశు సంరక్షణ, డయేరియా, న్యుమోనియా నివారణ, కుటుంబ నియంత్రణ పద్ధతులు, శిశువుకు అవసరమైన టీకాలు, తల్లి-శిశు ఆరోగ్యానికి సంబంధించిన పలు కీలక సూచనలు అందిస్తారని వివరించారు. గర్భిణీలు ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, ప్రసవానంతరం తల్లి, శిశువు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న మాతా-శిశు సంక్షేమ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యామని, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## మహిళ అనుమానాస్పద మృతి

**వేటపాలెం, జూలై 9, ప్రభాతవార్త**



మండలంలోని దేశాయిపేట పంచాయతిలో కప్పల దొడ్డి కాలనీ లో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. మృతురాలు షేక్ ఆశ అలియాస్ వీరమ్మగా గుర్తించారు. కుటుంబ సభ్యుల వివరములు ప్రకారం కప్పలదొడ్డి సమీపంలో నివాసము ఉంటున్న మృతురాలు అన్నపురెడ్డి వీరమ్మ అలియాస్ షేక్ ఆశా కు గతం లో వివాహం అయి, ఇద్దరు కుమార్తెలు ఉండగా సుమారు 14 సం. క్రిత్రం భర్త చనిపోవటం తో ఆమె వేటపాలెం రామనగర్ కు చెందిన షేక్ రఫీ తో రెండవ వివాహం జరిగింది. వారికీ ఒక అబ్బాయి పుట్టినాడు. ఐతే షేక్ రఫీ ఆటో నడుపుతూ, తరుచు తాగి వస్తు, హతురాలికి అక్రమ సంబం ధాలు అంటగడుతూ ఆమెను శారీరకంగా మానసికంగా వేదిస్తూ, ముగ్గురు పిల్లలని కొడుతూ, తిడుతూ ఉండేవాడని, అలాగే వీరమ్మ కుమార్తెలు అయినా అన్నపురెడ్డి ఉమా, వెంకట లక్ష్మి ను పనికి పొమ్మని వేదిస్తూ ఉంటె, హతురాలు ఒప్పుకోక పోవటంతో బుధవారం మద్యాహ్నం తాగిఇంట్లో వాళ్ళతో గొడవ పెట్టుకొని, కొడుతూ, తిడుతూ చంపేస్తా ను అనే బెదిరిస్తూ ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారు ఝా మున ముద్దాయి రఫీ మరల తన భార్య, పిల్లలతో గొడవ పెట్టుకొని, కొడుతూ ఉంటె, హతురాలు ఎందుకు అలా కొడతావు ఒకేసారి చంపేయ్ అని గట్టిగా అనగా ముద్దాయి కోపంతో ఇంట్లో ఉన్న నల్లటి చార్జింగ్ వైరును తెచ్చి, హతురాలి గొంతుకు వేసి గట్టిగా లాగగా, ఆమె చనిపోయినట్టు, దాంతో ఇంట్లో వాళ్ళ కేకలు విని చుట్టుపక్కల వారు రాగ, ముద్దాయి పారిపోయినట్టు హతురాలి కూతురు అన్నపురెడ్డి ఉమా, వెంకట లక్ష్మి ఇచ్చిన రిపోర్ట్ మేరకు వేటపాలెం పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేశారు. చీరాల రూరల్ సిఐ సుధాకర రావు, క్లూస్ టీం వచ్చి నేరస్థలంను పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

## టీ స్టాల్‌లో గొడవ.. యువకుడి గొంతు కోసిన మరో వ్యక్తి

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**

ఒంగోలులోని కర్నూల్ రోడ్ ఫ్లైఓవర్ సమీపంలోని ఓ టీ స్టాల్‌లో గురువారం జరిగిన గొడవ కత్తి పోటుకు దారితీసింది. మద్దిపాడు మండలం నేలటూరుకు చెందిన సుబ్బారావు ఒంగోలులో బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే సమయంలో చీమకుర్తి మండలం నిప్పట్లపాడుకు చెందిన పొన్నూరు ప్రసాద్ టీ తాగేందుకు టీ స్టాల్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య చిన్న విషయంపై మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ఆగ్రహానికి లోనైన ప్రసాద్ తన వద్ద ఉన్న కత్తితో సుబ్బారావు గొంతు వద్ద దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి
### - తహసీల్దార్ షేక్ నాగుల్ మీరా




**హనుమంతునిపాడు, జులై 9, ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని మండల తహసీల్దార్ షేక్ నాగుల్ మీరా గురువారం ఒక ప్రకటనల తెలిపారు. ఈ కార్యక్రమానికి కనిగిరి ఎమ్మెల్యే, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవో అజయ్ కుమార్ వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు నియోజకవర్గ మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. కావున ప్రజలందరూ తమ భూ సంబంధిత సమస్యలకు సంబంధించిన పూర్తి ఆధార పత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



**టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి**
స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కనిగిరి ఎమ్మెల్యే ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని టీడీపీ మండలపార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవో అజయ్ కుమార్ వివిద శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. కావున ప్రజలందరూ తమ భూ సంబంధిత సమస్యలకు సంబంధించిన పూర్తి ఆధార పత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## గొట్లగట్టు పట్టాభిరామ స్వామి ఆలయంలో చోరీ




**కొనకనమిట్ల, జులై 9, ప్రభాతవార్త**
మండలంలోని గొట్లగట్టు శ్రీ పట్టాభి రామ స్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గురువారం సమీప నివాస ప్రాంతాల వారు ఉదయాన్నే ఆలయ తలుపులు తీయగా వెనుక వైపు కళ్యాణ మండపం తాళం పగలగొట్టి ఉండటం గమనించారు. ఆలయ ప్రాంగణంలోని పంచలోహ ఆంజనేయస్వామి విగ్రహాన్ని, గరుడమంతున్ని విగ్రహ చెయ్యి భాగాన్ని గుర్తు తెలిని దొంగలు అపహరించుకుపోయారని గ్రామస్తులు తెలిపారు. సుమారు అపహరణకు గురైన విగ్రహాల విలువ లక్ష రూపాయలు వరకు ఉండవచ్చని వారు తెలిపారు.

## టీడీపీ కన్వీనర్ బాబురావు తల్లి కళమ్మ దశదిన కర్మకు హాజరైన ఎమ్మెల్యే కందుల



**కొనకనమిట్ల, జులై 9, ప్రభాతవార్త**
మండలంలోని తువ్వపాడు గ్రామంలో గురువారం జరిగిన మండల టీడీపీ కన్వీనర్ మూరబోయిన బాబురావు మాతృమూర్తి కళమ్మ దశదినకర్మకు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి హాజరై నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో కొనకనమిట్ల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అంకాల రోశయ్య, మాజీ సర్పంచ్ పెరికే సుఖదేవ్, నీటి సంఘ అధ్యక్షులు మూడమంచు లక్ష్మయ్య, పొదిలి ఏఎంసీ వైస్ చైర్మన్ పందిటి తిమోతి, నాయకులు కందుల రామిరెడ్డి, కోడె గురవయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బాయ్స్ హైస్కూలు హెచ్ఎంగా రమణయ్య



**కందుకూరు జూలై 8, ప్రభాతవార్త**
కందుకూరు బాలుర ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు గా మండూరి రమణయ్యను నియమించారు. ఇక్కడ హెచ్ఎంగా పనిచేస్తున్న హెచ్ఎం ఎం.నరసింహా రావు ఇటీవల పదవీ విరమణ చేశారు. దీంతో పాఠశాలలో ఫస్ట్ అసిస్టెంట్గా పనిచేస్తున్న ఈయనకు విద్యాశాఖ గుంటూరు రీజినల్ జాయింట్ డైరక్టర్ పూర్తి అదనపు బాధ్యతలుతో తాత్కాలిక ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ మేరకు గురువారం రమణయ్య విధులో చేరారు. దీంతో సహచర ఉపాధ్యాయులు సిబ్బంది ఆయనను ఘనంగా దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు, ఈ సందర్బంగా రమణయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి సిహెచ్ వెంకటేశ్వర్లు, సీనియర్ ఉపాధ్యాయులు పెరుగు ప్రసాద్తోపాటు పలువురు పాల్గొన్నారు.

## కందుకూరులో సీపీఐ శిక్షణా తరగతులు




**కందుకూరు జూలై 9, ప్రభాతవార్త**
ఈనెల జూలై 11,12తేదీలలో కందుకూఊరులో సిపిఐ జిల్లా స్దాయి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు తెలిపారు. ఇందుకు సంబందించి గురువారం స్థానిక కోటారెడ్డి భవన్లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక సాంస్కృతిక రంగాలలో జరుగుతున్న మార్పులపై సిపిఐ కౌన్సిల్ సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాసులు, డాక్టర్ సీఎన్ క్షేత్రపాల్ రెడ్డి, డి.సాగర్, డి.జమీందార్, ఎం.వెంకయ్యలు తదితరులు పాల్గొని సభ్యులకు అవగాహన కలిగించనున్నట్లు ఆయన తెలిపారు. స్దానిక స్వర్ణప్యాలెస్లో జరిగే ఈ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పి.బాలకోటయ్య, వై.ఆనందమోహన్, లక్ష్మినారాయణ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బండ్ల వారి నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న కదిరి పార్ధసారధి



**పామూరు, జులై 9, ప్రభాతవార్త**
పామూరు పట్టణానికి చెందిన బండ్ల నారాయణ కుమార్తె నిఖిత, సాయి నవీన్ కుమార్ల నిశ్చితార్థ వేడుక గురువారం పామూరులోని అనిల్ గార్డెన్లో జరిగింది. ఈ వేడుకలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారధి పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## చిన్నమ్మి వివాహ వేడుకలో పాల్గొన్న యారవ



**పామూరు, జులై 9, ప్రభాతవార్త**
పామూరు మండలం పడమరకట్టకిందపల్లి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నమ్మి వివాహ మహోత్సవంలో కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులు నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలతో సుఖంగా జీవించాలని ఆకాంక్షించారు.

## నాగంవారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల



**కొనకనమిట్ల, జులై 9, ప్రభాతవార్త**
మండలంలోని గొట్లగట్టు గ్రామంలో వైకాపా నాయకులు నాగం లక్ష్మయ్య, చిన్న లక్ష్మమ్మల కుమారుడు వివాహ మహోత్సవానికి హాజరై నూతన వరుడు వీరనారాయణని మార్కాపురం నియోజకవర్గ వైకాపా ఇన్చార్జి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యేలు అన్నా వెంకట రాంబాబు, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డిలు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, నాయకులు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉన్నం శ్రీనివాసులు, ఉడుముల కాశిరెడ్డి, మందలపు శ్రీనివాసరెడ్డి, నాగం బాల గురవయ్య, నాగం ప్రసాద్, గాడి కోనేటిరెడ్డి, వై.వెంకటరావు, సీనియర్ పాత్రికేయులు నాగం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# యువ శాస్త్రవేత్తలు కండి






**చీరాల, జులై 9, ప్రభాతవార్త**
మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం స్ఫూర్తిగా తీసుకొని అంతరిక్ష శాస్త్రవేత్తలు గా తయారు కావాలని విశ్రాంత డీఆర్డీఓ శాస్త్రవేత్త డాక్టర్ అందె మురళి వర ప్రసాద్ పిలుపు నిచ్చారు. గురువారం మండలంలోని దేశాయిపేట లో గల వివేక హైస్కూల్లో అంతరిక్షంపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు . ఎనిమిదవ తరగతిలో ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిన విద్యార్థులు ఇస్రో యంగ్ సైంటిస్టు అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇస్రో వారు పెట్టే పరీక్షలకు హాజరై అర్హత సాధిస్తే సైంటిస్టులుగా మారేందుకు అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. మన దేశానికి ఖ్యాతి తెచ్చిన శాస్త్రవేత్త సునీత విలియమ్స్ మాదిరిగా మీరు కూడా ఎదగవచ్చని, అందుకు కఠోర శ్రమ చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. 8వ తరగతిలో ఏ ప్లస్ గ్రేడ్ వచ్చిన ఆరుమంది విద్యార్థులను గుర్తించి వారికి శిక్షణ ఇస్తామని చెప్పారు. వేటపాలెం రోటరీ క్లబ్, కలాం మురళి స్పేస్ ఎడ్యుకేషనల్ ట్రస్టు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షులు బట్ట మోహన్రావు, స్కూల్ కరస్పాండెంట్ వలేటి సుబ్బారావు, హెడ్ మాస్టర్ పాటిబండ్ల కృష్ణారావు, సైన్స్ టీచర్ దేవరపల్లి వాసు కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్ పక్రియలో దివ్యాంగులకు ఇబ్బందులు



**చీరాల, జులై 9, ప్రభాతవార్త**
రాష్ట్రంలో జరుగుతున్న సర్ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పక్రియలో భాగంగా దివ్యాంగులు, వారి కుటుంబాల దగ్గరకు రాకుండా దివ్యాంగులను బీఎల్వోలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించి ఏపీ విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్దుల సహాయ సంస్థ చైర్మన్ జి.నారాయణస్వామిని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఇబ్బందులకు గురి చేస్తున్న బీఎల్ఓలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వకుండా దివ్యాంగులను సచివాలయాలకు పిలిపించుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పక్రియ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.సతీష్, జిలాని, కృపారావు, వహీదా తదితరులు ఉన్నారు.

## తిమ్మరాజుపాలెం వీఆర్ఏ మృతి



**పర్చూరు, జులై 9, ప్రభాతవార్త**
పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం వీఆర్ఏ ముల విశాల భ్రమరాంబ అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. గురువారం ఆమె మృతదేహానికి మండల తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, వీఆర్వో యార్లగడ్డ శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భ్రమరాంబ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## కారంచేడు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



**పర్చూరు, జులై 9, ప్రభాతవార్త**
కారంచేడులోని ఎన్హెచ్ 167ఏ వద్ద ఎస్సై ఖాదర్ భాషా గురువారం శిరోరక్ష ప్రాణ రక్ష కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ దరించకుండా ద్విచక్రవాహనా లను నడిపితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి అండగా ముఖ్యమంత్రి సహాయనిధి



**పర్చూరు, జులై 9, ప్రభాతవార్త**
ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫార్సుతో పర్చూరు మండలం కొల్లావారిపాలెం గ్రామానికి చెందిన కొల్లా సీతమ్మకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎల్ఓసీ కింద మంజూరైన రూ.1,01,916 విలువైన చెక్కును నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని వారు సూచించారు.

## శ్రీ దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్



**లింగసముద్రం, జులై 9, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సతీమణి గురువారం మొగిలిచర్ల గ్రామంలో గల శ్రీ దత్తాత్రేయ స్వామి వారి మందిరంను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. వారికి మందిరం తరుపున స్వామివారి జ్ఞాపికను ఆలయ ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్ అందజేశారు.

## అంకమ్మ తల్లి బంగారం లెక్కింపు



**నాగులుప్పలపాడు, జులై 9, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అంకమ్మ తల్లి దేవాలయాలు బంగారం నిల్వలను స్థానిక పోలీసులు రెవెన్యూ అధికారులు కుల పెద్దలు కమిటీ వారి అనుమతితో బంగారు నిల్వలను లెక్కింపు పక్రియ కొనసాగించారు. గత ఏడాది కొలుపులు సమయంలో జరిగిన వివాదాలు కోర్టుకు చేరాయి. కోర్టు ఆదేశాలతో బంగారునిల్వలు నివేదికఇవ్వాలని పోలీసులుకోరినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. వారి ఆదేశాల మేరకు బంగారు నిల్వలు లెక్కింపు పక్రియను పూర్తి చేసి నివేదిక తయారు చేసి సమర్పించనున్నట్లు పోలీసులు తెలిపారు.

## పాఠశాలల బస్సుల తనిఖీ




**తాళ్లూరు, జులై 9,ప్రభాతవార్త**
మండలంలోని ప్రైవేటు పాఠశాలల బస్సులను ఎస్సై ఎస్.మల్లికార్జునరావు గురువారం తనిఖీ చేశారు. తాళ్లూరు లోని ప్రవేట్ స్కూల్ బస్సులను చెక్ చేసి వారికి సరైన డాక్యుమెంట్స్, ఫిట్నెస్ సర్టిఫి కెట్స్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్లు తనిఖీ చేశారు. స్కూల్ యాజమాన్యాలు బస్సులకు అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించాలని, వారికి ఎప్పటికప్పుడు సరైన సూచనలు చేస్తూ అతివేగంగా వెళ్లకుండా, మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్సై వెంట సిబ్బంది ఉన్నారు.

## నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి



**తాళ్లూరు, జూలై9,ప్రభాతవార్త**
విత్తనాలదుకాణదారులు నాణ్యమైన, ధ్రువీరించిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని తూర్పు గంగవరం విత్తనాల దుకాణాన్ని గురువారం ఏవో ఆకస్మిక తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణంలోని వరి, సజ్జవిత్తనాల శాంపిల్స్ను నాణ్యత నిర్ధారణ నిమిత్తం తాడేపల్లి గూడెం లోని రీజనల్ కోడింగ్ సెంటర్ కు పంపుతున్నట్లు ఏవో తెలిపారు. ఏవో వెంట వీఏఏ అజ్మీర్ ఉన్నారు.

## సమ్వయంతో పారదర్శకంగా సర్ పక్రియను నిర్వహించాలి
### - బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్



**చీరాల, జులై 9, ప్రభాతవార్త**
ప్రత్యేక సంక్లిప్త ఓటరు సవరణ జాబితా పక్రియను రాజకీయ పార్టీ నాయకులు బూత్ స్థాయి అధికారులతో సమన్వయంతో అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేక సంకీర్త ఓటరు సవరణ జాబితా జూన్ 15వ తేదీ నుండి జులై 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ పక్రియలో 2002 ఓటరు జాబితాలో 2025 ఓటరు జాబితా ను మ్యాపింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఓటరు జాబితాలోని ప్రతి ఓటరును ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసినట్లు ఆయన చెప్పారు. ఎన్యుమరేషన్ ఫారాలను వివరాలతో నింపి బీఎల్ఓకు అందజేయాలని ఆయన తెలిపారు. అట్లు అందజేయని వారి వివరాలు ఈనెల 21వ తేదీన విడుదల చేసే డ్రాఫ్ట్ ఎలక్ట్రోరల్ వారికి ఓటు హక్కు ఉండదని ఆయన చెప్పారు. ఓటు హక్కు లేని వారు మరలా ఫాం-6 ద్వారా సంబంధిత ధృవీకరణ పత్రాలతో కొత్తగా ఓటు నమోదు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 71.56 శాతం డిజిటలైజేషన్ పూర్తి అయినట్లు ఆయన చెప్పారు. జిల్లాలో అన్ కలెక్టెడ్ ఫారాలు ఎక్కువగా ఉన్నాయని వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన చెప్పారు. బీఎల్ఓలను అత్యంత పారదర్శకంగాఈ పక్రియ పూర్తి చేయాలని ఆదేశించినట్లు కలెక్టర్ రాజకీయ పార్టీ నాయకులకు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉన్న యెడల వారి దృష్టికి తీసుకురావాలని ఆయన నాయకులను కోరారు. రాజకీయ నాయకులు క్షేత్ర స్థాయిలో బీఎల్ఓలతో పాటు ఉంటూ ఎన్యుమరేషన్ ఫారాలు అందజేతలో దగ్గరుండి చూసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ప్రత్యేక సంక్లిప్త సవరణ ఓటరు జాబితా పక్రియ గడువు ఈనెల 14వ తేదీ నా ముగుస్తున్నందున ఇప్పటికి జిల్లాలో 71.56 శాతం మ్యాపింగ్ పక్రియ పూర్తయిందని, మిగిలిన 5 రోజుల్లోపు ఈ పక్రియ పూర్తి కాదని, ఈ పక్రియను మరొక నెల రోజులు పాటు పొడిగింపు చేయాలని రాజకీయ పార్టీ నాయకులు కలెక్టర్ను కోరారు. క్షేత్ర స్థాయిలో బీఎల్ఓలు , బీఎల్ఏలకు సమావేశాలు ఏర్పాటు చేసి ఎక్కడా ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి ఇవ్వలేదు. మరణాలు, ఇల్లు మారటం మొదలగు వంటి వాటిని దగ్గరుండి చూసుకుంటూ ఏ ఒక్క ఓటు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ నాయకులకు తెలిపారు. క్షేత్ర స్థాయిలో అధికారులందరూ పని చేస్తున్నారని, పార్టీ నాయకులు నిరంతరం అధికారులతో సమన్వయం చేసుకుంటూ వారి వంతు కృషి చేయాలని ఆయన చెప్పారు. మరణాలకు సంబంధించి ఓటు తొలగింపు విషయంలో బీఎల్ఓలు బీఎల్ఏలతో సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ షఫీ, టీడీపీ, జనసేన, వైఎస్సార్సీపీ, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, బీఎస్పీ, ఆమ్ ఆద్మీ, పార్టీ నాయకులు ఫరీద్, మాధవి, మాల్యాద్రి, రవి, బాల నారాయణ, గంగయ్య, రాజారాం, బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7:7.qxd 7/9/2026 10:47 PM Page 1



## మాధవ్ నాయకత్వంలో బీజేపీకి నూతన ఊపు

### - డాక్టర్ ఏలూరి



**మార్కాపురం, జులై 9,ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మాధవ్ నాయకత్వంలో పార్టీ సంస్థాగతంగా బలోపేతమై రాష్ట్రవ్యాప్తంగా కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొందని అన్నారు. "సారథ్యం", "అటల్ మోదీ సుపరిపాలన బస్సు యాత్ర", "మనవూరు-మన జెండా" వంటి కార్యక్రమాల ద్వారా పార్టీని గ్రామస్థాయికి విస్తరించడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. రానున్న రోజుల్లో కూడా పార్టీని మరింత బలోపేతం చేస్తూ విజయవంతంగా ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు.

## హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి - సీఐటీయూ



**మార్కాపురం, జులై 9,ప్రభాతవార్త**
మార్కాపురం ఏపీబీసీఎల్ బేవరేజ్ డిపోలో పనిచేస్తున్న 40మంది హమాలీ కార్మికులు సీఐటీయూలో చేరారు.ఈ సందర్భంగా డిపో ఆవరణలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించి, యూనియన్ బోర్డును ప్రారంభించారు.సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ, హమాలీల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా, పెన్షన్, గృహం, పిల్లల విద్య వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, బేవరేజ్ డిపో హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుమ్మ బాలనాగయ్య, కే. సుబ్బరాయుడు, పి. రూబెన్, జె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి మహోత్సవాల సందర్భంగా సాయి భిక్ష...ఆధ్యాత్మిక ప్రవచనాలు



**మార్కాపురం, జూలై 9, ప్రభాతవార్త**
గురు పౌర్ణమి మహోత్సవాలను పురస్కరించుకుని మార్కాపురం నెహ్రూ బజార్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మందిరం ప్రధాన కార్యదర్శి గోపాలుని హరిహరరావు తెలిపారు.ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మార్కాపురం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సాయి భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.అలాగే గురు పౌర్ణమి వేడుకలలో భాగంగా వారం రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటల నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గురు పౌర్ణమి మహోత్సవాలను విజయవంతం చేయాలని మందిర కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## ప్రజాదర్బార్‌కు అర్జీల స్వీకరణ




**మార్కాపురం, జూలై 9, ప్రభాతవార్త**
మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ (పీజీఆర్ ఎస్ ) కార్యక్రమం శుక్రవారం (జూలై 10) ఉదయం 9 గంటలకు మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్‌లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పీఏ హరి తెలిపారు.ఈకార్యక్రమంలో మార్కాపురం నియోజకవర్గానికి చెందిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతారు.మార్కాపురం పట్టణం, మార్కాపురం మండలం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి పట్టణం, పొదిలి మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలతో హాజరై పరిష్కారం పొందాలని ఎమ్మెల్యే కార్యాలయం కోరింది.

## అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్ట్ స్టవ్‌ల పంపిణీ

### - దోర్నాల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మీబాయ్ చేతుల మీదుగా పంపిణీ



**పెద్దదోర్నాల, జులై 9, ప్రభాతవార్త**
అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు,గర్భిణీలు, బాలింతలకు పోషకాహారాన్ని సకాలంలో సురక్షితంగా సిద్ధం చేసేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఇండక్ట్ స్టవ్‌లను దోర్నాల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఏ.లక్ష్మీబాయి చేతుల మీదుగా దోర్నాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో 148 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో వంట ప్రక్రియను మరింత సులభతరం చేయడంతో పాటు గ్యాస్‌పై ఆధారపడడాన్ని తగ్గించేందుకు ఈ కార్యక్రమం అమలు చేస్తుంది.ఈ సందర్భంగా సీడీపీవో ఏ.లక్ష్మీబాయి మాట్లాడుతూ ఇండక్ట్ స్టవ్‌లను జాగ్రత్తగా వినియోగించి చిన్నారులు,గర్భిణీలు,బాలింతలకు నాణ్యమైన పోషకాహారాన్ని సమయానికి అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు.విద్యుత్ భద్రత నిబంధనలు పాటిస్తూ పరికరాలను సక్రమంగా నిర్వహించాలని ,ప్రభుత్వ ఆస్తులను సంరక్షించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో సీడీపీవో ఏ.లక్ష్మీబాయితో పాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎన్.అంజమ్మ, ధనలక్ష్మీ, లక్ష్మీదేవి, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అఫ్రోజ్ వివాహానికి ఎమ్మెల్యే ఉగ్ర హాజరు.. టీడీపీ నాయకులు శుభాకాంక్షలు





**కనిగిరి, జులై 9, ప్రభాతవార్త**
పీసీపల్లి మండలం చౌటగోగులపల్లి గ్రామానికి చెందిన షేక్‌నౌషాద్ బీ,మస్తాన్ దంపతుల కుమారుడు అఫ్రోజ్ వివాహ వేడుకకు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాల తో,ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఏనుగంటి శ్రీను, వీరాంజనేయులు, గురుబ్రహ్మం, ఢిల్లీరెడ్డి, నరేంద్ర, శ్రీనివాసులరెడ్డి,పులి ప్రతాప్‌రెడ్డి, ముప్పవరపు మాచర్ల,పువ్వాడి నాగరాజు, పాలూరి మహేంద్ర తదితరులు ఎమ్మెల్యేతో కలిసి వివాహ వేడుకలో పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వేమూరి రామయ్య, ఏనుగంటి శ్రీను,వీరాంజనేయులు,పులి ప్రతాప్‌రెడ్డి,మాచర్ల,మూలకా నాగేశ్వరరావు,వీరయ్య, కోటపాటి మాల్యాద్రి, రామారావు,పువ్వాడి నాగరాజు, సత్తిరెడ్డి,వెంగయ్య,నాగేంద్రబాబు,శర్మ, నాని,ప్రభు,మహేంద్ర, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అఫ్రోజ్ దాంపత్య జీవితం ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## స్కూల్ బస్సులకు సరైన పత్రాలు లేనిచో వాహనం సీజ్ చేస్తాం

### - మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఏ.మాధవరావు





**కనిగిరి, జులై 9, ప్రభాతవార్త**
స్కూల్ బస్సులకు సరైన పత్రాలు లేనిచో అటువంటి వాహనాలను వెంటనే సీజ్ చేస్తామని మార్కాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఏ.మాధవరావు అన్నారు. గురువారం పట్టణంలో ఉన్నటువంటి స్కూల్ బస్సులను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డ్రైవర్లకు తెలిపారు. ప్రతి వాహనానికి వీఎల్‌టీడీ డివైస్ అమర్చుకోవాలని సూచించారు. ఇప్పటికే ప్రతి స్కూల్‌కు మెమోలు పంపించామని తప్పకుండా నియమాలు పాటించాలని ఆయన తెలిపారు. స్కూల్ బస్సులో ఎమర్జెన్సీ డోర్ అందుబాటులో ఉండాలని ఎప్పటికప్పుడు వాహనమును ప్రతి రోజు చెక్ చేసుకుని టైర్లు అన్ని రకముల పరికరాలను సరి చూసుకున్నాకే వాహనంను నడిపించుకోవాలని సూచించారు. వాహనంలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. టైం అయిపోయిన తర్వాత ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో మెడిసిన్స్ మార్చుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కనిగిరి ఎస్సై జి.సందీప్ మాట్లాడుతూ స్కూల్ బస్సుల డ్రైవర్ల అందరికి పలు నియమాలు తెలిపారు. నిర్లక్ష్యంగా బస్సులను నడిపినచో, మద్యం తాగినగాని, మత్తు పదార్థాలు వేసుకుని వాహనం నడిపినచో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన గాని కేసులు విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కవాహన డ్రైవరు విధిగా యూనిఫామ్ ధరించాలని తెలియజేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపిన యెడల లైసెన్సును రద్దు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. వాహన యజమానులకు ముఖ్యంగా ఎఫ్‌సీ, ఇన్సూరెన్స్, ఆర్‌సీ, పీయుసీ, ఎల్లవేళలా బస్సు నందు సరైన కాగితాలు ఉంచుకుని అధికారులు అడిగిన వెంటనే చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే.రాజేష్, ఏఎస్సై సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కాపురం వార్త

# సదరం స్లాట్ బుకింగ్ గగనం

- రెండు రోజుల నమోదుకు అవకాశం
- మొదటి రోజే ముగిసిన స్లాట్
- రెండో రోజు స్లాట్ పనిచేయడం లేదని సిబ్బంది
- ఒక వేళ పని చేసిన మన జోన్లో లేదు పాడేరులో ఖాళీ ఉన్నాయి అక్కడికే వెళ్తాము నమోదు చేయమని దివ్యాంగులు
- అది కూడా పని చేయడం లేదు అని సిబ్బంది కొసమెరుపు
- దోర్నాల సచివాలయం-4లో కేవలం 14 మంది నమోదు
- రెండో రోజు నమోదు చేయకపోవడంతో ఉసూరుమంటూ నిరాశతో వెనుతిరిగిన దివ్యాంగులు

**పెద్దదోర్నాల, జులై 9, ప్రభాతవార్త**
దివ్యాంగులకు అత్యంత కీలకమైన సదరం సర్టిఫికేట్ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ దోర్నాల మండలంలో తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. రెండు రోజుల పాటు స్లాట్ బుకింగ్‌కు ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ, మొదటి రోజే స్లాట్ పూర్తి అవడంతో చేసేది లేక ఉసూరుమంటూ దివ్యాంగులు నిరాశతో వెనుతిరిగారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తుంది. కొత్త పింఛన్లు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులైన వారు ఆనందంతో సచివాలయాల దగ్గరకు వెళ్లారు. తీరా నమోదు కాక దివ్యాంగులు నిరాశ నిస్పృహలతో ఇదెక్కడి న్యాయం అంటూ వెనుతిరిగారు. సిబ్బంది నిర్లక్ష్యంతో నమోదు చేయడం లేదా ..? లేక స్లాట్ బుకింగ్ పని చేయడం లేదా..? ఒక రోజులోనే ఇలా నూరేళ్లు నిండుతాయా..? దివ్యాంగులు జుట్టు పీక్కుంటున్నారు. రెండేళ్ల తర్వాత ఉన్న ఫలంగా సదరం స్లాట్ నమోదుకు ఆన్‌లైన్లో అవకాశం కల్పించారు. ఎటువంటి ప్రచారం లేకుండా ఉన్న ఫలంగా వదిలారు. ఈ విషయం కొంత మందికి అసలు తెలియదు. తెలిసిన వారు ఆధార్ లింకు సమస్యలు పరిష్కరించుకునే సమయానికి సదరం స్లాట్ గడువు రెండు రోజులకే ముగిసింది. దీంతో సచివాలయాలు, మీ సేవ కేంద్రాల వద్దకు వచ్చిన దివ్యాంగులు, పింఛన్ కోసం వచ్చిన అభ్యర్థులు నిరాశతో వెనుతిరిగారు. స్లాట్‌లో ఒక్కో విభాగానికి 200 బుకింగ్‌కు మాత్రమే అనుమతించడం వల్ల ఎవరికి దక్కని పరిస్థితి అయింది. ఒక మండలంలో 200 స్లాట్ బుకింగ్ ఏ విధంగా సరిపోవు. దోర్నాల సచివాలయం-4లో మొత్తం 14 మంది దివ్యాంగులకు మాత్రమే నమోదు చేయగలిగారు. అనంతరం పోర్టర్‌లో స్లాట్ అందుబాటులో లేకపోవడంతో మిగిలిన వారి నమోదు సాధ్యం కాలేదని డిజిటల్ అసిస్టెంట్ కనకం నరసింహ తెలిపారు. సచివాలయ సిబ్బంది నమోదు చేయడంలో నిర్లక్ష్యమా..? లేక నిజంగా రెండో రోజు స్లాట్ పని చేయడం లేదా..? అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. స్లాట్ కోసం వచ్చిన దివ్యాంగులు సిబ్బంది సమాధానంతో నిరాశతో వెనుతిరిగారు. మళ్లీ స్లాట్ ఎప్పుడు వస్తుందో తెలియదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు సచివాలయ సిబ్బంది కూడా పోస్టర్లో స్లాట్ ఓపెన్ కావడం లేదు. మా చేతుల్లో ఏమి లేదు. మమ్మల్ని ఏం చేయమంటారు అంటూ తమ అసహాయత్తను వ్యక్తం చేశారు. ఒక మెదడు, చెవుడు వ్యాధికి సంబంధించిన దివ్యాంగులు దోర్నాల సచివాలయం-4లో స్లాట్ బుకింగ్ కోసంవెళ్లి మెదడుకు సంబంధించి ఆప్షన్ లేదు నామోదు కు వీలుపడదని డిజిటల్ అసిస్టెంట్ నరసింహ తెలిపారు. చెవుడుకు సంబంధించి స్లాట్ ఓపెన్ అయిన మన జోన్లో ఖాళీ లేదు. పాడేరులో ఉంది. నమోదు చేయమంటారా అని అడిగితే, ఆ నమోదు చేయండి అని దివ్యాంగులు చెప్పగా అక్కడ కూడా ఖాళీ లేదు. నమోదుకు వీలుపడదని డిజిటల్ అసిస్టెంట్ చెప్పడంతో దివ్యాంగులు నిరాశ నిస్పృహతో వెనుతిరిగారు.

**వివరణ :**
ఈ విషయమై డిజిటల్ అసిస్టెంట్ కే.నరసింహను వివరణ కోరగా మొదటి రోజు 14 అర్జీలు వరకు స్లాట్ పని చేసిందని, రెండో రోజు ఓపెన్ కాలేదని కొద్దిసేపు ఉన్నాక స్మార్ట్ ఓపెన్ అయిన మెదడుకు సంబంధించిన ఆప్షన్ లేదు. చెవిటికి సంబంధించిన ఆప్షన్ ఉంది. అయితే మన జోన్‌లో లేదు. పాడేరులో ఉంది వెళ్తావా అని అడిగితే పాడేరుకైన బుకింగ్ చేయమని అడిగితే స్లాట్ పనిచేయలేదని డిజిటల్ అసిస్టెంట్ కే.నరసింహ వివరించారు.

## రేషన్ షాపుపై 6 ఏ కేసు నమోదు



**చీరాల, జులై 9, ప్రభాతవార్త**
చీరాల మండలం పాత చీరాల గ్రామం నందు ఉన్న బొక్క చందన రేషన్ దుకాణాన్ని సివిల్ సప్లై అధికారులు గురువారం తనిఖీ చేశారు. చీరాల సీఎస్‌డీటీ బి.ఓంకార్ నేతృత్వంలో ఈ తనిఖీలు జరిగాయి.దుకాణంలో ఉన్న రేషన్ నిల్వలను పరిశీలించారు. దుకాణంలో 15 క్వింటాల 55 కేజీల రేషన్ బియ్యం వ్యత్యాసం ఉందని సీఎస్‌డీటీ బి.ఓంకార్ తెలిపారు.సదరు డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.ఈ తనిఖీలో కారంచేడు సీఎస్ఆర్ఐ కే.కిశోర్ ఉన్నారు.

## బండారు వెంకట రామయ్య అకాల మరణం బాధాకరం

### - కదిరి పార్థసారథి



**సీఎస్‌పురం, జులై 9, ప్రభాతవార్త**
సీఎస్‌పురం మాజీ ఎంపీటీసీ సభ్యులు బండారు వెంకట రామయ్య అకాల మరణం బాధాకరమని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి అన్నారు. గురువారం వెంకట రామయ్య గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్థసారధి వెంకట రామయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మన్నేపల్లి పెద్దన్న,గోను చంద్రశేఖర్‌రెడ్డి, మూరం కాశిరెడ్డి, తికెనం బాబురావు తదితరులు ఉన్నారు.

## ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోండి

### - ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్ డిమాండ్



**పామూరు, జులై 9, ప్రభాతవార్త**
స్కూల్, కళాశాల బస్సులను కనీస ఫిట్నెస్ లేకుండా నడుపుతున్నారని, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.ప్రభాకర్ ఆరోపించారు.స్థానిక గుజ్జుల యల్లమందరెడ్డి, భవన్, సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా స్కూల్ బస్సులను డ్రైవింగ్ లైసెన్స్ లేని డ్రైవర్లతో నడుపుతున్నారని, పరిమితికి మంచి పిల్లలకు ఎక్కించడం వల్ల ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల తల్లిదండ్రుల నుంచి వ్యాన్ ఫీజులు అంటూ వేలాది రూపాయలు వసూల్లు చేస్తున్నారని, కానీ విద్యార్థుల భద్రత, క్షేమం కోసం యాజమాన్యాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అధికారులు వెంటనే స్కూల్, కాలేజీ బస్సులపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని, ఫిట్నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు పవన్ కళ్యాణ్, రాజమహేంద్ర, గణేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చాంద్‌భాషాను పరామర్శించిన వైసీపీ నాయకులు



**పామూరు, జులై 9, ప్రభాతవార్త**
పామూరు మండల నాయకులు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ షేక్ చాంద్ భాషా ఇటీవల కంటి ఆపరేషన్ చేపించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి గురువారం రోజున మండల పార్టీ నాయకులతో కలిసి పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా చికిత్సకు సంబంధించిన విషయాల గురించి ఆరా తీశారు. తదుపరి త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, షేక్ గయాజ్, అంబటి కొండారెడ్డి, కో ఆప్షన్ నాయబ్ రసూల్, జొన్నలగడ్డ గోవిందయ్య, తుపాకుల అంజిరెడ్డి, శ్రీరామ్ శ్రీనివాసులు, షేక్ రసూల్,మితికేల బాలకృష్ణలు మాట్లాడి ధైర్యం చెప్పారు. తదుపరి కుమారులు ఎంపీటీసీ అబ్దుల్ మహ్మద్ హుస్సేన్‌లతో మాట్లాడారు.

## బ్రహ్మోత్సవంలో ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్న యారవ



**పామూరు, జులై 9, ప్రభాతవార్త**
దుత్తలూరు మండలం నర్రవాడ శ్రీశ్రీశ్రీ వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవంలో కనిగిరి ఎమ్మెల్యే,ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న కదిరి పార్థసారధి



**సీఎస్‌పురం, జులై 9, ప్రభాతవార్త**
సీఎస్‌పురం మండలంలోని దర్శి తిమ్మక్కపల్లి గ్రామంలో శ్రీ మన్నేపల్లి లక్ష్మీ నరసింహస్వామి వారిని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారధి గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పార్థసారధికి దేవస్థానం కమిటీ సభ్యులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మన్నెపల్లి పెద్దన్న, మాజీ ఎంపీటీసీలు మునగల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, ఉద్ది దేవయ్య,ఉద్ది రమణయ్య,ఉద్ది బాలరత్తయ్య, యర్రంశెట్టి కృష్ణయ్య, పోర్లరత్తయ్య, పోర్ల రవిబాబు, సిర నాగేశ్వరరావు, పోర్ల రమణయ్య తదితరులు ఉన్నారు.

## గొల్లపల్లి సబ్ పోస్టాఫీసులో ఖాతాదారుల నగదు గోల్‌మాల్

**పొదిలి, జులై 9, ప్రభాతవార్త**
మండలంలోని గొల్లపల్లి సబ్ పోస్టాఫీసులో 220 మంది ఖాతాదారుల నగదు గోల్‌మాల్ అయింది. బ్రాంచ్ పోస్టుమాస్టర్ 220 మంది ఖాతాదారులు నుండి రూ.6లక్షల రూపాయలు పైగా దోచుకున్నారు. సంఘటన విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు స్పందించి బీపీఎంను సస్పెండ్ చేశారు.

## నాగులుప్పలపాడులో మల్లెల దేవర కొలుపులు


**నాగులుప్పలపాడు, జులై 9, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు గ్రామంలో మల్లెలవారి దేవరకొలుపులు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. జరిగే కొలుపులకు తెలంగాణ ఆంధ్ర ప్రాంతంలో మల్లెల కుటుంబ సభ్యులు వారి బంధువులు హాజరై కులదేవత మొక్కులు తీర్చుకుని పాప వేషాలు సముద్ర స్నానాలతో ముగింపు కార్యక్రమం జరగనుంది.

## వెంకట్రామయ్యకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నివాళి



**సీఎస్‌పురం, జులై 9, ప్రభాతవార్త**
తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు బండారు వెంకట్రామయ్య మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. బండారు వెంకట్రామయ్య మృతి గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర గురువారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి మృతుని నివాసానికి వెళ్లి మృతుని భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ చేసిన శివరాం, ఆంజనేయులులకు సన్మానం



**ఒంగోలు, ప్రభాతవార్త**
ఒంగోలు మండలం ఉలిచి గ్రామంలో గురువారం గుండ్లకమ్మ సామాజిక సాహిత్య సేవా సమాఖ్య, ఎన్టీఆర్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవీ విరమణ చేసిన ఉలిచి గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు బరువురి శివరాం ప్రసాద్, బోయెడి ఆంజనేయులులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పొగాకు సమాఖ్య చైర్మన్ చెంచు శేషయ్య మాట్లాడుతూ వీరి ఇరువురు ఎక్కడ పని చేసిన నీతి నిజాయితీ పట్టుదలతో పని చేసి ఎంతో మంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులను చేశారని, ఉలిచి గ్రామానికి మంచి పేరు తీసుకు వచ్చారని గుండ్లకమ్మ సామాజిక సేవా సమాఖ్య వారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సన్మానం చేయటం చాలా మంచి కార్యక్రమం అనిఅన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్లకమ్మ సామాజిక సేవా సమాఖ్య అధ్యక్షుడు మండవ సుబ్బారావు,శ్రీ శారదా నికేతన్ ఫౌండర్ దివి కోటేశ్వరరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ నన్నపనేని చంద్రశేఖరావు, పిల్లుట్ల సుధాకర్‌రావు, చుంచు సింగయ్య, చుంచు రామకృష్ణ,ఎర్రంనేని నరసింహారావు, చుంచు నాగేశ్వరరావు, ఎర్రంనేని వెంకట శేషయ్యలు మాట్లాడారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ కార్యక్రమం నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సంస్థ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.

ong-8_ong-8.qxd 7/9/2026 11:36 PM Page 1



## వివాహ రిసెప్షన్ వేడుకలలో పాల్గొన్న చింతలపూడి

**కొరిసపాడు, జులై 9, ప్రభాతవార్త**



మండలంలోని బొడ్డు వాని పాలెం గ్రామ ఎస్సీ కాలనీ వాసి పులి అంజయ్య కుమార్తె వివాహ రిసెప్షన్ కి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కాలనీలో మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ ,విగ్రహాలకు పూలమాలలు వేసి చింతలపూడి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో ఆయనతో పాటు కొరిశపాడు మాజీ ఎంపీపీ అన్నెంఅంజిరెడ్డి,గ్రామ మాజీ ఉపసర్పంచ్ అన్నెం అంజిరెడ్డి, పెద్దిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, కొంద్రు కళ్యాణ్ లతో పాటు పలువురు వైసీపీ అభిమానులు పాల్గొన్నారు.

## విద్యార్ధులకు భూసార పరీక్షలలో అవగాహన

**అద్దంకి, జులై 9, ప్రభాతవార్త :**




అద్దంకి మండలం లోని జెడ్. పి. హెచ్. స్కూల్, ఎ.పి. యస్. డబ్ల్యూ. ఆర్. యస్. బాలికల పాఠశాల లో 8 తరగతి విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం గురించి శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో అద్దంకి మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణ భావి తరాలకు సారవంతమైన నేల అందించాలంటే విద్యార్థులకు నేల ఆరోగ్యం, దాని ప్రాముఖ్యత గురించి సరైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి, వి. వి. శేషమ్మ, ఒంగోలు వారు మట్టి నమూనా సేకరణ, ఆవశ్యకత, సేకరించే విధానం, ఉపయోగాలు, భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా పంటల సాగు, సమస్యాత్మక భూముల గుర్తింపు, వాటిని బాగు చేసే విధానం గురించి వివరించి మట్టి నమూనా సేకరించే డెమో గురించి వివరించి, చేసి చూపించినారు. ఈ కార్యక్రమం లో జెడ్. పి. హెచ్. స్కూల్ హెడ్ మాస్టర్ గంగాధర్, సైన్స్ టీచర్ ధనలక్ష్మి, పి. టి. రవి, డాక్టర్ అంబేద్కర్ గురుకులం వైస్ ప్రిన్సిపాల్ పి. కృష్ణవేణి, బాటనీ టీచర్ టి. నవ్యత,ఎ. ఇ. ఒ కోటేశ్వర రావు వి. ఎ. ఎ. లు ఆత్మా బి. టి. ఎమ్. శేషారావు మరియు స్టూడెంట్స్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం: మంత్రి గొట్టిపాటి

**అద్దంకి, జులై 9, ప్రభాతవార్త :**



పుట్టావారిపాలెం మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజలకు అందుబాటులో ఉండి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, వాటిపై సంబంధిత అధికారులకు స్వయంగా ఫోన్ చేసి త్వరితగతిన పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, అర్హత ఉన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు.

## ఘనంగా మణికేశ్వర ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

**అద్దంకి, జులై 9, ప్రభాతవార్త :**



అద్దంకి మండలం మణికేశ్వరంలోని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానము ధర్మకర్తల మండలి సభ్యులచే గురువారం అద్దంకి దేవాదాయశాఖ పరిశీలకులు ఎం వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ గా లగ్గిశెట్టి రమణమ్మను ఎన్నుకొన్నారు. ముందుగా ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా ఎల్. వెంకటరమణమ్మ, ఈదా సుబ్బారెడ్డి, బి.నాగలక్ష్మి, ఎన్.పూర్ణిమ, దాసరి కృపమ్మ, గుడిపాటి శివమాధవి, పి.వెంకటరావు, మేకల వెంకటరమణమ్మ, పోతూరి మహేష్,లచే ధర్మకర్తల మండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఇఒ వాసుబాబుతోపాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## బదిరుల పాఠశాలలో అన్నదానం

**అద్దంకి, జులై 9, ప్రభాతవార్త :**



రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో, స్థానిక చైతన్య బధిరుల పాఠశాల విధ్యార్థులకు రొటేరియన్ చిన్ని వెంకట కామేశ్వ రావు, వారి కుమారుడు సాయి వంశీ కృష్ణ వివాహం అయిన సందర్భంగా,అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ పువ్వాడ రామకోటేశ్వరరావు, సెక్రటరీ కరి రామయ్య,ట్రెజరర్ గూడా లక్ష్మీరెడ్డి, రోటరీ సభ్యులు చప్పిడి వీరయ్య, ఊటుకూరు రామ కోటేశ్వరరావు, అంజాద్ భాషా, ప్రిన్సిపాల్ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం దాత కామేశ్వరరావు దంపతులను రోటరీ సభ్యులు సత్కరించారు.

ఈనెల 11న రోటరీ క్లబ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం :

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ నూతన కార్యవర్గ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం ఈనెల 11న శనివారం ఉదయం 10గంటలకు స్థానిక శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణమండపం జరుగుతుందని ఒక ప్రకటనలో రోటరీ అధ్యక్షులు పువ్వాడ రామకోటేశ్వరరావు తెలిపారు.

## డ్రాయింగ్,పెయింటింగ్‌లో ఉచిత శిక్షణ

**- 80మందికి అవార్డులు, ప్రైజులు పంపిణీ**

**అద్దంకి, జులై 9, ప్రభాతవార్త**



ఎపి బాల సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాష్ట్ర స్థాయిలో డ్రాయింగ్, పెయింటింగ్ నందు 80 మంది బాలికలకు 2వ తేదీనుండి 8వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఇచ్చినట్లు డైరెక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. శిక్షణ తరగతుల నిర్వహించిన ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమంలో 80మందికి, అవార్డులు, ప్రైజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ సురేష్‌కుమార్, పి.రామారావు, తదితరులు పాల్గొని శిక్షణ పొందిన సన్మానించి, అవార్డులు అందజేశారు.

## కొటికలపూడిలో ఘనంగా వైఎస్ ఆర్ జన్మదిన వేడుకలు

**అద్దంకి, జులై 9, ప్రభాతవార్త :**



మండలంలోని కొటికలపూడి గ్రామంలో బుధవారం రాత్రి వైఎస్ఆర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ హాజరయ్యారు. చిన్నారులు, మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలవేసిన కేక్ కటచేసి,కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## పశుగ్రాస వారోత్సవాలను ప్రారంభించిన దర్శి ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పురుషోత్తమ రాజు

**దర్శి, జులై 9, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుండి 14వ తేదీ వరకు పశు గ్రాస వారోత్సవాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా దర్శి మండలంలోని బొట్లపాలెం గ్రామంలో పశు గ్రాస వారోత్సవాల ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దర్శి ప్రాంతీయ వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.పురుషోత్తం రాజు హాజరై రైతులకు పాల ఉత్పత్తి, పెరుగుదలలో పచ్చి గడ్డి యొక్క ఆవశ్యకతను రైతులకు వివరించారు. అలాగే ప్రభుత్వం 70శాతం సబ్సిడీతో పంపిణీ చేసినటువంటి సీవోఎఫ్ 24 వెరైటీని సందర్శించారు. ఈ కార్యక్రమంలో బొట్లపాలెం పశువైద్యాధికారి డాక్టర్ బసవయ్య, ఫీడ్ అసిస్టెంట్ ప్రతాప్, ఏహెచ్‌ఏలు రామాంజి, గోస్, రైతులు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ పక్రియను పరిశీలించిన ఎన్నికల అధికారి శాంతిలక్ష్మీ

**దర్శి, జులై 9, ప్రభాతవార్త**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమంలో భాగంగా గురువారం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి దర్శి అర్బన్ పోలింగ్ కేంద్రం నెంబరు 112, 113లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, డిజిటలైజేషన్ తక్కువ ప్రోగ్రెస్ ఉన్న బూత్ లెవల్ అధికారులతో మాట్లాడుతూ డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఓటర్‌నకు సంబంధించి విజిబుల్‌గా ఫొటో ఉంటే వారి నుండి ఫొటో కలెక్ట్ చేయనవసరం లేదని, ఎన్యూమరేషన్ ఫారంలో పూరించాల్సిన కాలంను ఫిల్ చేసి ఓటరు, బూత్ లెవల్ అధికారుల సంతకంతో ఎన్యూమరేషన్ ఫారం మొదటి పేజీ మాత్రమే అప్లోడ్ చేయాలని, రెండవ పేజీ అప్లోడ్ చేయనవసరం లేదని బీఎల్‌వోలకు సూచించారు.

## దర్శి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుకు పదోన్నతి

**దర్శి, జులై 9, ప్రభాతవార్త**



దర్శి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కే.శ్రీనివాసరావుకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. నెల్లూరు జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించడం జరిగిందని తెలిపారు. గత 21 నెలల నుండి ప్రకాశం జిల్లాలోని దర్శిలో పదవీ బాధ్యతలు నిర్వహించడం జరిగిందని, తను పని చేసిన కాలంలో సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సై కోటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

**ముండ్లమూరు, జులై 9, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలానికి నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన కోటేశ్వరరావుకు ముండ్లమూరు గ్రామ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలోని శాంతి భద్రతలకు ప్రజలు నాయకులు, ప్రతి ఒక్కరూ సహకరించాలని మండలంలో ఎవరైనా పేకాట ఆడితే అట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎస్సైని సన్మానించిన వారిలో టీడీపీ నాయకులు బేతపూడి రామారావు, బేతపూడి రాధాకృష్ణ, గుంటుపల్లి కిరణ్, బోడపాటి చంద్రమౌళి, కుమ్మెత పేరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అపర భగీరధుడు డాక్టర్ వైఎస్సార్ - ఎంపీపీ

**ముండ్లమూరు, జులై 9, ప్రభాతవార్త**



పేదల పాలిట పెన్నిధి రైతు భాంధువుడు అపర భగీరథుడు మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మండల ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి అన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా మండలంలోని వేముల గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం వేముల గ్రామం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ సుంకర సునీత. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఒకేసారి రైతు రుణమాఫీ చేసిన ఘనత డాక్టర్ వైఎస్సార్ దేనని ఇప్పుడు పేద ప్రజలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజలకే అండగా మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముండ్లమూరు మండల కన్వీనర్ చింతా శ్రీనివాస్‌రెడ్డి, వేముల గ్రామం వైసీపీ యూత్ వేముల గ్రామం వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం స్వాధీనం

**దర్శి, జులై 9, ప్రభాతవార్త**



దర్శి మండలం చందలూరు గ్రామంలో స్కూల్ పక్కన బెల్టుషాపు నడుపుతున్న మద్యం తాగుతున్నారనే సమాచారం మేరకు దర్శి ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో దర్శి ఎక్సైజ్ స్టేషన్ ఎస్సై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. స్కూల్ పక్కన కొంత దూరంలో ఉన్న పీర్ల చావిడి సమీపంలో ఒక వ్యక్తి మద్యం అమ్ముతున్నాడని సమాచారం సేకరించి దాడులు చేయగా నాగేంద్రబాబు అనే వ్యక్తి వద్ద 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా తూర్పు వీరాయపాలెంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న సుభాషిణి అనే మహిళ వద్ద 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది ఎస్‌కే యూసఫ్ షరిఫ్, కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసులు, పి.నాగరాజు, ఎన్.శ్రీనివాసరావు, సీహెచ్ సాయిబాబా, ఎస్‌కే ఖాశీం పీరా, కే.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాఅరెస్టు

**దర్శి, జులై 9, ప్రభాతవార్త**



జిల్లాలో దర్శి, దొనకొండ, తాళ్లూరు మండలాల్లోని దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను దర్శిలోని సీఐ కార్యాలయంలో సీఐ రామారావు విలేకర్ల సమావేశం నిర్వహించి వెల్లడించారు. వారి వద్ద నుండి రూ.45 ఇత్తడి గంటలు, రూ.45,000 నగదు, ఒక మోటారు సైకిల్, 12 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లుతెలిపారు. ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మల్లిఖార్జునరావు, రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గుమ్మళంపాడులో రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళి

**సంతనూతలపాడు, జులై 9, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం గుమ్మళంపాడు గ్రామంలో బుధవారం రాత్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 77 వ జయంతి వేడుకల్లో భాగంగా గ్రామవైసీపీ ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. యువత ఆనందోత్సవంతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షేక్ పాత్చా సాహెబ్, వైసీపీ నాయకులు మొలకలపల్లి సుబ్బారావు, బొడ్డపాటి శ్రీనివాసరావు, ఆంజనేయులు, మంగపాటి శ్రీనివాసరావు, బొడ్డపాటి వంశీకృష్ణ, పి.రవి, పి.సంగీతరావు, తలారి వెంకటరావు, పి.కోటేశ్వరరావు, ఎస్.రాజశేఖర్, పి.రఘుబాబు పాల్గొన్నారు.

## పేర్నమిట్టలో ఘనంగా రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి వేడుకలు

**సంతనూతలపాడు, జులై 9, ప్రభాతవార్త**



మండలంలోని పేర్నమిట్ట క్రిస్టియన్‌పాలెం, రెడ్లబజార్ నందు బుధవారం దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పేర్నమిట్టలోని క్రిస్టియన్‌పాలెంలో వైకాపా మండల ప్రచార కమిటీ అధ్యక్షులు తేళ్ళ అనిల్ కుమార్, సీనియర్ నాయకులు గుండే బెంజిమెన్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 77వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదే విధంగా రెడ్ల బాజర్ నంనదు గ్రామ వైసీపీ ఆద్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాలులర్పించారు. ఈ సందర్భంగా ఆయా వాడలలో కేక్ కట్ చేశారు. తదుపరి వైసీపీ నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా గ్రామ వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు కత్తినేని చెంచురామిరెడ్డి, కత్తినేని శ్రీనివాసరెడ్డి, మచ్చా వెంకటేశ్వరరెడ్డి, బలిజేపల్లి కృష్ణారెడ్డి, కత్తినేని సుబ్బారెడ్డి, సానికొమ్ము సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షులు గుంజా ఏడుకొండలు, మండల జనరల్ సెక్రటరీ వాడాల ఆదినారాయణ, బుట్టి పేరేష్‌బాబు, బుట్టి శరత్, తేళ్ళ రాజ్ కుమార్, కైలా సంజయ్, పెనుబాకు అంజయ్య, మేడబలిమి శ్రీనివాసరావు, దాసరి ఏడుకొండలు, బండి బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**ఉలవపాడు, జూలై 9, ప్రభాతవార్త**

ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. గురువారం కరేడు పంచాయతీలోని ఆకుతోట సంఘం వద్ద వేరుశెనగ పొలాలలో ఆత్మ వారి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ ఏవో విజయకుమార్ రైతులకు ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పచ్చిరొట్ట ఎరువులు వినియోగించడం వల్ల దిగుబడులు పెరిగి నాణ్యమైన పంట వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి టి ఎం షర్ఫుద్దీన్, వి ఏ ఏ కిషోర్, ఏపీ సీ ఎన్ ఎఫ్ సిబ్బంది రమేష్, అరుణమ్మ, రైతులు పాల్గొన్నారు.

## సమగ్ర సవరణలో వేగం పెరగాలి.. తాసిల్దార్ రవి నాయక్

**బల్లికురవ జులై 9( ప్రభాతవార్త)**



మండలంలోని అన్ని బిఎల్‌వోల పరిధిలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ మరింత వేగవంతంగా కొనసాగాలని తాసిల్దార్ రవి నాయక్ బిఎల్ఓలకు సూచించారు. గురువారం మండలంలోని కొనిదేన, అంబడిపూడి, గుంటుపల్లి, కొమ్మినేని వారిపాలెం గ్రామాల పరిధిలో జరుగుతున్న సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనికి చేశారు. మండలంలో ఇప్పటివరకు 75 సవరణ పూర్తయిందని, అత్యధికంగా ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో 90 శాతం పూర్తయింది అన్నారు. కొనిదేన గ్రామపంచాయతీ పరిధిలో సవరణ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతున్నందున ఆ గ్రామ పంచాయితీ పై ప్రత్యేక దృష్టి సారించారు.2002 ఓటర్ల జాబితాను, 2025 జాబితాతో నిర్దేశిత గడువులోగా మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. బి ఎల్ వో లకు అంగన్వాడీ కార్యకర్తల సహకారం కూడా అందుతున్న నేపథ్యంలో సవరణ ప్రక్రియ మరింత వేగవంతం కావాలన్నారు. నిర్దేశిత సమయంలోపు పూర్తిస్థాయిలో వివరాలు నమోదు చేయాలనే లక్ష్యంతో సిబ్బంది పనిచేయాలన్నారు. ఆయన వెంట వీఆర్వోలు అశోక్, రవి, పంచాయితీ కార్యదర్శి సుబ్రమణ్యం, శేషుబాబు తదితరులు ఉన్నారు.

## అద్దంకికి మరో రెండు విద్యుత్ ఉప కేంద్రాలు

**- మంత్రి గొట్టిపాటి చొరవతో ముక్తేశ్వరం, వెంపరాల గ్రామాలకు మంజూరు**

**బల్లికురవ జులై 9(ప్రభాతవార్త)**



అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా,. లో వోల్టేజ్ సమస్యను తొలగించడానికి, విద్యుత్ సరఫరాను మరింత మెరుగుపరచడానికి రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గృహ అవసరాలకు, అన్నదాతలకు, పరిశ్రమలకు సురక్షితమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా మంత్రి గొట్టిపాటి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతున్నారు. ఇందులో భాగంగా సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బల్లికురవ మండలం ముక్తేశ్వరం గ్రామానికి, అద్దంకి మండలం వెంపరాల గ్రామానికి ఒక్కో 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలు మంజూరైనట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో ఈ రెండు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

## సామాజిక భవనాలకు 1.02 నిధుల మంజూరు

**బల్లికురవ జులై 9(ప్రభాతవార్త)**

మండలంలో అసంపూర్తిగా మిగిలిపోయిన సామాజిక భవనాల నిర్మాణం కోసం 1.2 కోట్ల నిధులు మంజూరు అయినట్లు రాష్ట్ర ఇంధన మంత్రి గొట్టిపాటి తెలియజేశారు. గురువారం వివరాలను వెల్లడించారు.మండలంలోని వైదన, ముక్తేశ్వరం, రామాంజనేయపురం గ్రామాల్లో అసంపూర్ణంగా నిలిచిపోయిన, సామాజిక భవనాల నిర్మాణం పూర్తి కానుంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. మంజూరైన నిధులతో ఆయా గ్రామాల్లో నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు సామాజిక భవనాలు వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు పోతుందని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు.

## నూతన వధూవరులకు మంత్రి గొట్టిపాటి ఆశీస్సులు

**బల్లికురవ జులై 9(ప్రభాతవార్త)**



మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన పెద్ది శబరి మల్లికార్జునరావు, కుసుమామృతల వివాహం ఇటీవల జరిగింది. గురువారం రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వారి నివాస గృహానికి చేరుకొని నూతన వధూవరులను ఆశీర్వదించి, వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట క్లస్టర్ ఇంచార్జ్ మల్లీనీడి గోవిందరావు పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

## మన డబ్బు మన లెక్కలు కార్యక్రమంపై అవగాహన

**ఉలవపాడు, జూలై 9, ప్రభాతవార్త**




మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మన డబ్బు మన లెక్కలు కార్యక్రమం లో భాగంగా ర్యాలీ చేస్తూ అవగాహన కల్పించారు .ఉలవపాడులోని మహిళా సమాఖ్య కార్యాలయం నుండి ప్రధాన వీదిలోని అంబేద్కర్ విగ్రహం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పొదుపు చేయడం, తీసుకున్న అప్పులు తిరిగి సకాలంలో చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కృష్ణయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు విమల,కార్యదర్శి పద్మ, సిసిలు, వివో ఏలు,మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం: మంత్రి గొట్టిపాటి

**సంతమాగులూరు, జూలై 9, ప్రభాతవార్త**



ప్రజా సమస్యల పరిష్కారానికే కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని విధ్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని పుట్టావారిపాలెం క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం ప్రజలకు అందుబాటులో ఉండి వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి వాటిపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క వినతిని బాధ్యతగా పరిశీలించి అర్హత ఉన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హామీ ఇచ్చారు.ఆయన వెంట మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు వున్నారు.

## సంతమాగులూరు ఎస్సైగా నాగమల్లేశ్వరరావు

**సంతమాగులూరు, జూలై 9, ప్రభాతవార్త**



మండల నూతన ఎస్సైగా నాగమల్లేశ్వరరావు గురు వారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ప్రకాశం జిల్లా టంగుటూరు ఎస్సైగా పనిచేస్తు బదిలీపై సంతమాగులూరు వచ్చారు.ఇక్కడ పనిచేసిన పట్టాభి రామయ్యకు సిఐగా పదోన్నతి రావడం తో వెళ్ళరు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో దృష్టిసాదిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషిచేస్తామని తెలిపారు.

## ఆర్.ఎం.సి ప్లాంట్‌ను ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

**జె. పంగులూరు జూలై 9 ప్రభాతవార్త**



మండలంలోని కశ్యాపురం గ్రామంలో ఆస్ట్రేలియన్ అప్లైడ్ ఇంజనీరింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌ను పరిశీలించి, పరిశ్రమ యాజమాన్యానికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పి.సింగారావు, ఎంపీడీవో కె స్వరూప రాణి, మాజీ జెడ్పిటిసి సభ్యులు కెవి సుబ్బారావు, ఓబుల్ రెడ్డి గుర్రం శేఖరు, చింతల సహదేవుడు, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్, కుక్కపల్లి కొండలు, కాజా, గరిమెడి జగన్మోహన్, రావు రమేష్ బాబు, మురుకొండ సుబ్బారావు, షేక్ వలి, పిచ్చిరెడ్డి, గుదిబండ్ల ఆదిరెడ్డి, బత్తుల వెంకట్రావు, తదితర అధికారులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## 66మంది విద్యార్ధులకు చికిత్సలు

**సంతనూతలపాడు(మద్దిపాడు), జులై 9, ప్రభాతవార్త**


మద్దిపాడు ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మద్దిపాడులోని ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లోని 66 మంది విద్యార్ధులకు వైద్యులు చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. ఎస్సీ హాస్టల్లో 51 మందికి, బీసీ హాస్టల్లో 15 మందికి వైద్యులు శ్రవణ్ కుమార్, అన్వేష్ కుమార్ చికిత్సలు అందించారు. విద్యార్ధులకు వ్యక్తిగత పరిశుభ్రత పై ఎంపీహెచ్‌ఈవో చిరంజీవి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు రాఘవ, సత్యనారాయణ, ఏఎన్ఎం రాజేశ్వరి, వైద్య , ఆశా వర్కర్లు రత్నకుమారి, బాధ కోటయ్య, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

10-7Pg5_10-7Pg5.qxd 09/Jul/26 11:22 PM Page 1



# భారత ఆర్థికవ్యవస్థపై విదేశీ ఇన్వెస్టర్లకు ఎంతో నమ్మకం

## భారత్ ఎన్ఐఐఎఫ్‌లో ఆసీస్ పెన్షన్‌ఫండ్ రూ.3వేల కోట్ల పెట్టుబడులు: మెల్‌బోర్న్ సదస్సులో ప్రధానిమోడీ



**మెల్‌బోర్న్,జులై 9:** భారత్‌లో విదేశీ పెట్టుబడుల ప్రవాహం మరోసారి ఊపందుకుంది. ఆస్ట్రేలియాలోని అతిపెద్ద పెన్షన్ ఫండ్ ఆస్ట్రేలియన్ సూపర్ భారతదేశంలో రూ.3,311 కోట్లు అదనంగా పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ పెట్టుబడిని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌ఎన్ఐఐఎఫ్‌లో పెట్టనుంది. ఈ నిర్ణయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ స్వాగతిస్తూ, భారత ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ పెట్టుబడిదారుల విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పెట్టుబడి భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాల రంగం, సంస్కరణలపై అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఉంచుతున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని ప్రధాని మోడీ అన్నారు. ఇండియా-ఆస్ట్రేలియా సిఇఒ ఫోరమ్‌లో మోడీ ఈవ్యాఖ్యలుచేసారు. మెల్‌బోర్న్‌లో జరిగిన ఇండియా-ఆస్ట్రేలియా సిఇఒ ఫోరమ్ సదస్సులో ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని అల్బనీస్‌తోకలిసి ప్రధాని పాల్గొని భారత్‌లోని పెట్టుబడుల అవకాశాలను వివరించారు. భారత్‌ఆస్ట్రేలియా మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే కీలక అడుగుగా పెన్షన్‌ఫండ్ పెట్టుబడిఅని ప్రధాని మోడీ అభివర్ణించారు. ఎన్ఐఐఎఫ్‌లో ఆస్ట్రేలియన్ సూపర్ ప్రకటించిన కొత్త 500 మిలియన్ల పెట్టుబడితో భారతదేశంలో తమ పెట్టుబడులను మరింత విస్తరించనుంది. ఈ తాజా పెట్టుబడితో భారత ఆస్తి రంగంలో ఆస్ట్రేలియన్ సూపర్ మొత్తం పెట్టుబడి 3.3 బిలియన్లడాలర్లకు చేరనుంది. ప్రస్తుతం ఈ సంస్థ భారత్‌లో మౌలిక సదుపాయాలు, ఈక్విటీలు, ప్రైవేట్ మార్కెట్లలో ఇప్పటికే సుమారు 2.8 బిలియన్ల పెట్టుబడి పెట్టింది. ఆస్ట్రేలియన్ సిఇఒ పాల్ ష్రోడర్ మాట్లాడుతూ, ప్రధాని మోడీకి వ్యాపారం, పెట్టుబడులపై లోతైన అవగాహన ఉందని అన్నారు. ప్రధాని మోడీ పెట్టుబడిదారులకు స్థిరమైన విధానాలు, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలపై స్పష్టమైన దృష్టిని కలిగి ఉన్నారు.

వ్యాపార సంస్థలతో ఆయన వ్యవహరించే తీరు మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంది. భారత్-ఆస్ట్రేలియా ప్రజల మధ్య ఉన్న బలమైన సంబంధాలు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలకు దారి తీస్తాయని ష్రోడర్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియన్ సూపర్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ షాన్ మాన్యుయెల్ మాట్లాడుతూ, భారత్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని చెప్పారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతం లభిస్తుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు మరింత పెరిగే అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి. రోడ్లు, రైల్వేలు, ఇంధనం, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ప్రాజెక్టులకు నిధులు అందుబాటులోకి రావడం ద్వారా భారత్-ఆస్ట్రేలియా ఆర్థిక భాగస్వామ్యం మరింత బలపడతాయని ఇరుదేశాలప్రధానులు వెల్లడించారు.

**రక్షణ, సముద్ర భద్రతపై ప్రత్యేక దృష్టి**

శుద్ధిచేసిన యురేనియంను భారత్‌కు సరఫరాచేసే ఒప్పందంతోపాటు ఇంధనభద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రెండుదేశాలు అవగాహనకు వచ్చాయి. ఇరు దేశాలు సంయుక్త రక్షణ, భద్రతా సహకార ప్రకటనను ఆమోదించాయి.దీని ద్వారా రక్షణ పరిశ్రమల్లో భాగస్వామ్యం, ఉమ్మడి ఆవిష్కరణలు, సమాచార మార్పిడి, విపత్తుల సమయంలో మానవతా సహాయం, సహాయక చర్యల్లో సహకారం మరింత బలోపేతం కానుంది. అలాగే సముద్ర భద్రత సహకార రోడ్‌మ్యాప్‌పై అంగీకారం కుదిరింది. భారత తీర రక్షక దళం, ఆస్ట్రేలియా మారిటైమ్ బోర్డర్ కమాండ్ మధ్య అవగాహన ఒప్పందం కూడా కుదిరింది. ఇంధన భద్రతపై ఇరు దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరా జరిగేలా పౌర అణు ఒప్పందం కింద పరిపాలనా ఏర్పాటుపై అంగీకారం కుదిరింది. దీని ద్వారా భారత్ ఇంధన వనరులు మరింత విస్తరించడంతో పాటు శక్తి భద్రత బలోపేతం కానుంది.


**మెల్‌బోర్న్ సూపర్‌హిట్**

మెల్‌బోర్న్‌లో ఇండియా ఆసీస్ సిఇఒల ఫోరమ్ సదస్సుతోపాటు ప్రవాసభారతీయుల సమావేశంలో పాల్గొన్న మోడీ మాట్లాడుతూ మెల్‌బోర్న్ సభ సూపర్‌హిట్ అని బ్లాక్‌బస్టర్ అని వ్యాఖ్యానించారు. భారతీయులు ఏదేశంలో ఉన్నా ఆ దేశ ప్రగతికి దోహదపడుతూ భారత ప్రతిష్టను ఇనుమడింపచేస్తారన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో భారత్ సత్తా ప్రపంచానికి చాటిచెప్పామని,

ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా భారత్ ఉపేక్షించబోదని సందేశం పంపించగలిగామన్నారు. అలాగే మేకిన్ ఇండియా ఇపుడు ప్రపంచ వ్యాప్తం కావడం భారత్‌కు గర్వకారణంగా నిలిచిందని మోడీ పేర్కొన్నారు.

### ఇంధన భద్రతపై ఆస్ట్రేలియా భారత్‌ల ఒప్పందం

**మెల్‌బోర్న్,జులై 9:** భారత్, ఆస్ట్రేలియా దేశాల మధ్య ఇంధన భద్రతకు సంబంధించి ప్రధానఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వల్ల ఆస్ట్రేలియా నుంచి శాంతియుత అవసరాల కోసం భారత్‌కు యురేనియం ఎగుమతులకు మార్గం సుగమమైంది. ఇంధన రంగంలో రెండు దేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అడుగుగా దీనిని భావిస్తున్నారు. ఆస్ట్రేలియాలో జరిగిన వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ సంయుక్తంగా ఈ విషయాన్ని ప్రకటించారు. అణుశక్తి రంగంలో కీలక ఒప్పందం కుదిరిందని, దీనివల్ల ఆస్ట్రేలియా నుంచి భారత్‌కు యురేనియం సరఫరాకు మార్గం ఏర్పడుతుందని మోడీ తెలిపారు. ఇది దేశ స్వచ్ఛ ఇంధన లక్ష్యాలకు కొత్త ఊతం ఇస్తుందని చెప్పారు. రెండు దేశాలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఇంధన వాణిజ్యం, సరఫరా వ్యవస్థ బలోపేతం, స్వచ్ఛ ఇంధన వినియోగం పెంపుపై కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు వెల్లడించాయి. 2015లో కుదిరిన అణు సహకార ఒప్పందం కింద యురేనియం ఎగుమతులకు అవసరమైన పరిపాలనా ప్రక్రియలను కూడా పూర్తి చేసినట్లు పేర్కొన్నాయి. ఆస్ట్రేలియా నుంచి వచ్చే యురేనియం పూర్తిగా శాంతియుత అవసరాలకే వినియోగిస్తామని స్పష్టం చేశాయి. దీనిపై ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ భద్రతా నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన సరఫరా, ధరలపై ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశాయి. అయినా ఇంధన సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు కొనసాగిస్తామని వెల్లడించాయి. ద్రవీకృత సహజ వాయువు సరఫరాలో ఆస్ట్రేలియా, ద్రవ ఇంధనాలు, పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాలో భారత్ కీలక భాగస్వాములని రెండు దేశాలు గుర్తించాయి. పునరుత్పాదక ఇంధనం, తక్కువ కాలుష్య ఇంధనాలు, పెట్టుబడులు, ప్రాంతీయ సహకారాన్ని మరింత పెంచాలని నిర్ణయించాయి. బొగ్గు, డీజిల్, సహజ వాయువు వంటి ఇంధనాల సరఫరా స్థిరంగా కొనసాగేలా కలిసి పనిచేస్తామని స్పష్టంచేశాయి. భారత్ ప్రారంభించిన గ్లోబల్ బయోఫ్యూయెల్స్ అలయన్స్ కార్యక్రమాన్ని కూడా ఆస్ట్రేలియా స్వాగతించింది.



# ఆ ఉత్పత్తులకు సుంకాలుండవ్!

## మోడీ పర్యటనకు ముందే న్యూజిలాండ్ కీలక ప్రకటన

**వెల్లింగ్టన్, జులై 9:** భారత ప్రధాని నరేంద్ర మోడీ న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లడానికి ముందే ఆ దేశ ప్రధాని క్రిస్టఫర్ లుక్సాన్ కీలక ప్రకటన చేశారు. భారత్‌కు న్యూజిలాండ్ ఎగుమతి చేస్తున్న వస్తువుల్లో 57 శాతం ఉత్పత్తులపై ఇకపై ఎలాంటి సుంకాలు ఉండబోవని చెప్పారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన తొలిరోజు నుంచే ఇది అమలులోకి వస్తుందన్నారు. ఈ చారిత్రక ఒప్పందం ద్వారా భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు విస్తృత ప్రవేశం లభిస్తుందని, ఇది న్యూజిలాండ్ వ్యాపారులకు ఊతమిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టుచేశారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న ప్రధాని మోడీ.. ఈ నెల 10,11 తేదీల్లో న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. దాదాపు గత 40 యేళ్లలో భారత ప్రధాని అక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. పర్యటనలో భాగంగా అక్లాండ్‌లో ఏర్పాటు చేయనున్న సమావేశంలో వాణిజ్య ఒప్పందాలు, అభివృద్ధి, తదితర అంశాలపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. ప్రభుత్వ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. వాణిజ్యం, రక్షణ, పరస్పర సహకారం తదితర అంశాలపై ప్రధాని మోడీ దృష్టిపెట్టనున్నారు. అంతేకాకుండా అక్కడి వ్యాపారవేత్తలు, క్రీడాకారులతోనూ మోడీ సమావేశం కానున్నారు.

# నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్‌లో హనీమూన్ బోగీ

## టిటిఇ సస్పెన్షన్‌కు దారితీసిన అత్యుత్సాహం



**ముంబయి,జులై 9:** ఎసి రైలు బోగీని హనీమూన్ సూట్‌లా అలంకరించి కొత్త జంటకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన దృశ్యాల విడియోలు హల్‌చల్ చేసినవైనం సంబంధిత టిటిఇ సస్పెన్షన్‌కు దారితీసింది. బెలూన్లు, పూలమాలలు, గులాబీ రేకులు, ఐ లవ్ యూ బోర్డులతో అలంకరించిన రైలు క్యాబిన్‌ను చూసిన నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేయడంతో పాటు రైల్వే భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. ఈ నెల 6న బల్లార్షా-ముంబై నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. జల్నాకు చెందిన ఓ నూతన వధూవరుల కోసం రైల్లోని ఎసి కూపేను ముందుగానే బుక్ చేశారు. అదే సమయంలో 'రహత్ రూమ్ డెకరేషన్' అనే ఈవెంట్ డెకరేషన్ సంస్థకు చెందిన సిబ్బంది రైలులోకి వెళ్లి క్యాబిన్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. కొత్త దంపతులు ఔరంగాబాద్ నుంచి కారులో జల్నా రైల్వే స్టేషన్‌కు చేరుకుని అక్కడి నుంచి రైలులో ప్రయాణం ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా డెకరేషన్ సేవలను బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. రైలు క్యాబిన్‌ను హనీమూన్ సూట్‌ను తలపించేలా తీర్చిదిద్దడంతో ఆ దృశ్యాలు క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వీడియో వైరల్ కావడంతో రైల్వే అధికారులపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అనుమతి లేకుండా బయటి వ్యక్తులు రైలులోకి ఎలా ప్రవేశించారు? భద్రతా నిబంధనలు ఎలా ఉల్లంఘించారనే ప్రశ్నలు తలెత్తాయి. విషయం రైల్వే మంత్రిత్వశాఖ దృష్టికి చేరడంతో అధికారులు వెంటనే విచారణ ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో బయటి వ్యక్తులను అనుమతి లేకుండా రైలులోకి అనుమతించడం, ప్రయాణికుల కంపార్ట్‌మెంట్‌లో భారీగా అలంకరణలు చేయడం రైల్వే నిబంధనలకు విరుద్ధమని అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించారనే ఆరోపణలతో సంబంధిత టిటిఇ గిరీష్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ శాఖాపరమైన విచారణకు ఆదేశించారు.



# రాయ్‌గఢ్‌లో కుండపోత కొట్టుకుపోయిన గ్యాస్ సిలిండర్లు

**రాయ్‌గడ్,జులై 9:** మహారాష్ట్రలోని రాయగఢ్ జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. వరదల కారణంగా పన్వేల్ తాలూకాలోని హెచ్‌పిసిఎల్ పాతాళగంగా ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్ నీటమునిగింది. దీంతో నింపినవి, ఖాళీవి కలిపి సుమారు 3,000 సిలిండర్లు వరద ప్రవాహంలో కొట్టుకుపోయి పాతాళగంగా నదిలోకి చేరాయి. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ కిషన్ జవాలే ప్రజలను అప్రమత్తం చేశారు. నదిలో లేదా ఒడ్డున కొట్టుకొచ్చిన సిలిండర్లు కనిపించినా వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకొద్దని సూచించారు. ఇంటికి తీసుకెళ్లొద్దని హెచ్చరించారు. వాటిలోగ్యాస్ ఉందో లేదో, అవి సురక్షితస్థితిలో ఉన్నాయో లేదో తెలియదని వెల్లడించారు. వాటినితెరవడం లేదా వినియోగించడం ప్రమాదకరమని పేర్కొన్నారు. వరదల్లో కొట్టుకుపోయిన సిలిండర్లనుగుర్తించి తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నదిలో లేదా పరిసరప్రాంతాల్లో ఎల్పీజీ సిలిండర్లు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## ఢిల్లీలో భారీ వర్షం

**న్యూఢిల్లీ,జులై 9:** ఉత్తర భారతదేశంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలతో జన జీవనం స్తంభించిపోతున్నది. గురువారం తెల్లవారు జామున ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షాలకు రోడ్లు చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఢిల్లీలోని పలు ప్రాంతాలకు ఇప్పటికే ఐఎండీ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఉరుములు, మెరుపులతోకూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంకారణంగా న్యూఢిల్లీ రైల్వే స్టేషన్, మునీర్కా, ఇతర ప్రాంతాలతో సహా నగరంలోని కొన్ని ప్రాంతాలలో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్కు అంతరాయంఏర్పడింది. వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశంలో కురుస్తున్న వర్షాలపై సమీక్షించారు. మంగళవారం కేరళలోని వయనాడ్‌లో శిథిలాలు కూలిపోయి పలువురు చనిపోవడం, జమ్మూలోని దోడాలో ఆకస్మిక వరదలు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగిన నేపథ్యంలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి భారీ వర్షాల వల్ల తలెత్తిన పరిస్థితులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.


# జననీరాజనం మధ్య ఖమైనీ అంత్యక్రియలు



**టెహ్రాన్,జులై 9:** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు సూర్యాస్తమయంలోపు పూర్తిచేసారు. అంత్యక్రియలకు లక్షలాది మంది తరలివచ్చారు. ఈ ఉదయమే అంత్యక్రియలు పూర్తి కావాల్సి ఉండగా సాయంత్రానికి వాయిదా పడ్డాయి. ఖమేనీ పార్థివదేహం ఖమేనీ స్వస్థలమైన ఈశాన్య ఇరాన్‌లోని మష్హద్ నగరానికి చేరుకుంది ఇరాక్‌లోని పవిత్ర నగరాలు నజఫ్, కర్బలా దగ్గర నిర్వహించిన అంతిమయాత్రల్లో లక్షలాది మంది పాల్గొనడంతో అంత్యక్రియల కార్యక్రమం ఆలస్యమైంది. తొలుత గురువారం ఉదయమే అంత్యక్రియలు పూర్తి కావాల్సి ఉండగా భారీ జనసందోహం కారణంగా అంత్యక్రియలను సాయంత్రానికి వాయిదా వేశారు. ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఐఆర్ఎన్ఏ విడుదల చేసిన దృశ్యాల్లో మహాన్ ఎయిర్ విమానం ద్వారా ఖమేనీ భౌతికకాయం మష్హద్ విమానాశ్రయానికి చేరుకున్నట్లు కనిపించింది. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రకారం స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు (అనగా భారత కాలమానం ప్రకారం సాయంత్రం 4:30 గంటలకు) అంత్యక్రియలు పూర్తిచేసారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఫిబ్రవరి 28న ఖమేనీ మరణించారు. మూడు నెలల తర్వాత అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. భీకరమైన యుద్ధం కారణంగా వాయిదా పడ్డాయి. ప్రస్తుతం అంత్యక్రియల్లో భాగంగా ముందుగా ఇరాక్‌లోని నజఫ్, కర్బలా నగరాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని విమానంలో మష్హద్‌కు తరలించారు.

ఈ సాయంత్రంతో అన్ని కార్యక్రమాలు పూర్తి కానున్నాయి. టెహ్రాన్‌తో పాటు పలు నగరాల్లో జరిగిన అంతిమయాత్రలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని ఖమేనీకి నివాళులర్పించారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కాపాడిన నాయకుడిగా.. అమెరికా-ఇజ్రాయెల్ విధానాలకు వ్యతిరేకంగా నిలిచిన నేతగా ఆయనను కొనియాడారు. టెహ్రాన్‌కు చెందిన 60 యేళ్ల హుస్సేన్ అక్బరీ మాట్లాడుతూ ప్రపంచానికి మేము అణచివేతకు తలవంచబోమని, మా నాయకుడి రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటామని నిరూపించడమే మా లక్ష్యం అని అన్నారు.

## అమెరికా బాంబులేసిన ఖమేనీ కాంపౌండ్ దృశ్యాలు.. షేర్ చేసిన ఇరాన్



**టెహ్రాన్, జులై 9:** అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రారంభమైన రోజునే అప్పటి సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మృతి చెందారు. టెహ్రాన్‌లోని కాంపౌండ్‌లో ఆయనతోపాటు ఇతర కీలక నేతల లక్ష్యంగా ఆ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఖమేనీని గురువారం సమాధి చేయనున్న నేపథ్యంలో దాడుల్లో దెబ్బతిన్న ఆ భవనం దృశ్యాలను ఇరాన్ ప్రభుత్వ మీడియా షేర్ చేసింది. 35 సెకన్ల నిడివి గల ఆ విడియోలో.. అత్యంత దారుణంగా భవనం దెబ్బతిన్న దృశ్యాలు కన్పించాయి. ఖమేనీ అంతిమయాత్ర వారం రోజులు సాగింది. ఇరాన్, ఇరాక్‌లలోని వివిధ నగరాల మీదుగా ఈ అంతిమయాత్ర సాగింది. ఈ మార్గాల్లో భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు తమ నేతకు అంతిమ వీడ్కోలు పలికారు. ఖమేనీ పార్థివదేహాన్ని ఇరాన్‌లోని ఆయన సొంత పట్టణమైన మషహద్‌లో గురువారు ఖననం చేశారు. ఈ క్రమంలో ఈ పట్టణానికి చేరుకోవడానికి ఉపయోగించే రెండు వంతెనలు అమెరికా దాడుల్లో ధ్వంసమయ్యాయి. మరోవైపు దాడుల నేపథ్యంలో టెహ్రాన్- మషహద్ మధ్య రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. అంత్యక్రియల కార్యక్రమానికి ఆటంకం కలిగించేందుకే యుఎస్ ఈ దాడులు చేసిందని ఐఆర్‌జిసి ఆరోపించింది. ఇవి ఇలాగే కొనసాగితే.. తమ నుంచి వచ్చే భీకరంగా ఉంటుందని హెచ్చరించింది.

# భారత్‌కు తిరిగి వస్తున్న అపురూప ఖళాఖండాలు



**మెల్‌బోర్న్,జులై 9:** ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ప్రధానిమోడీకి ఆదేశ ప్రధాని ఆంటోని అల్బనీస్ అద్భుత రిటర్న్ గిఫ్టులు ఇచ్చారు. భారత్‌కు చెందిన అపురూపమైన చారిత్రక విగ్రహాలు, పూజా సామాగ్రిని వెనక్కి ఇచ్చేసింది ఆస్ట్రేలియా. అవి త్వరలోనే తిరిగి స్వదేశానికి చేరుకోనున్నాయి. తమిళనాడులోని అతి పురాతన ఆలయాలకు చెందిన ఈ అరుదైన సాంస్కృతిక సంపదను భారత్‌కు తిరిగి అప్పగించడానికి ఆస్ట్రేలియా అంగీకరించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను కూడా పూర్తి చేసింది. ఇందులో భద్రకాళి అమ్మవారి రూపంతో కూడిన లోహపు త్రిశూలం, పవిత్ర రాతి నంది విగ్రహం, షణ్ముఖ కార్తికేయుడి రాతి విగ్రహం ఉన్నాయి. దీంతో దేశ పురాతన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించే దిశగా, చట్టవిరుద్ధ రవాణాకు అడ్డుకట్ట వేసే విషయంలో ఓ ముందడుగు పడినట్టయింది. భారతీయ శిల్పకళా వైభవానికి, అపార సాంస్కృతిక చరిత్రకు నిదర్శనమైన ఈ కళాఖండాలు చోళులు, విజయనగర రాజుల కాలం నాటివి. తిరిగా రాబోతున్న ఈ కళాఖండాలలో తమిళనాడులోని తిరువారూర్ జిల్లా, కొల్లుమాంగుడిలో కొలువై ఉన్న శ్రీ కాశీవిశ్వనాథస్వామి ఆలయానికి చెందిన రెండు ముఖ్యమైన లోహ, రాతి శిల్పాలు ఉన్నాయి. అందులో మొదటిది త్రిశూలం. దీని పైభాగంలో ఉగ్రరూపంలో ఉన్న భద్రకాళి అమ్మవారి ప్రతిమ అత్యంత కళాత్మకంగా చెక్కారు కళాకారులు. శైవ శాక్తేయ సంప్రదాయాల ప్రకారం ఈ త్రిశూలం దుష్టశిక్షణ, దైవిక శక్తి, రక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. ఇది దాదాపు 13వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్నారు. అదే కాశీవిశ్వనాథస్వామి ఆలయానికి చెందిన మరో అరుదైన రాతి శిల్పం నంది విగ్రహం. పరమశివుడి వాహనమైన ఈ నందిని తమిళ శైవ శిల్ప సంప్రదాయంలో అత్యంత సహజసిద్ధంగా తీర్చిదిద్దారు. మెడలో గంటలు, అందమైన పూలదండలతో ప్రశాంత వదనంతో పడుకుని ఉన్న భంగిమలో ఉన్న ఈ నంది శిల్పం చోళుల నాటి శిల్పకళా శైలిని కలిగి ఉంది. శైవ క్షేత్రాల్లో మహాశివుడి గర్భగుడికి అభిముఖంగా కనిపించే నంది విగ్రహం నిస్వార్థ భక్తి, బలం, ధర్మానికి ప్రతీక. వీటితో పాటు తంజావూరు జిల్లా మానంబాడిలో కొలువైన ప్రసిద్ధ నాగనాథస్వామి దేవాలయానికి చెందిన ఆరు తలల కార్తికేయుడి రాతి విగ్రహం కూడా త్వరలోనే భారత్‌కు రానుంది. 11వ శతాబ్దంలో మొదటి రాజేంద్ర చోళుడి కాలంలో నిర్మితమైన ఈ ఆలయంలో కార్తికేయుడి ఈ ఆరు ముఖాల రూపం అపారమైన దివ్య జ్ఞానం, శౌర్యాం, రక్షణను సూచిస్తుంది. 12 చేతుల్లో విభిన్న ఆయుధాలను ధరించి, పక్కనే వాహనమైన నెమలితో కూడి ఉన్న ఈ ఐతిహాసిక శిల్పం చోళుల కాలపు శిల్పకళా ప్రాభవానికి అద్దం పడుతోంది.

# సంక్షిప్త వార్తలు

## అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలి



**వాషింగ్టన్, జులై 9:** హెచ్-1బి వీసా దుర్వినియోగాలకు పాల్పడే వారిపై అమెరికా చేపట్టిన చర్యలపై అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ స్పందించారు. అమెరికా ఉద్యోగాలు అమెరికన్లకే దక్కాలని పునరుద్ఘాటించారు. వీసా మోసాలకు పాల్పడే వారిపై అమెరికా కార్మిక శాఖ ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించిందని, విచారణ నిమిత్తం కొంతమందికి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిపారు. విస్కాన్సిన్‌లో జరిగిన ఓకార్యక్రమంలో వాన్స్ మాట్లాడుతూ.. 'అత్యున్నత ప్రతిభ కలిగిన శాస్త్రవేత్తలు, వైద్యులు, సాంకేతిక నిపుణులు అమెరికాలో పనిచేసేందుకు వీలుగా హెచ్-1బి వీసాను రూపొందించాం. కానీ, కొన్ని పెద్ద కంపెనీలు, వ్యక్తులు ఈ వీసా విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. తక్కువ వేతనాలతో విదేశీ ఉద్యోగులను నియమించుకుని అమెరికా కార్మికు ఉపాధిని దెబ్బతీస్తున్నారు.వీసా దుర్వినియోగం చేసేవారిని ఇకపై ఉపేక్షించబోం. అలాంటి వారికి అమెరికాలోకి ప్రవేశం ఉండదు అని స్పష్టం చేశారు.

## స్పౌజ్ బెనిఫిట్స్‌కు స్వలింగ సంపర్కులు అనర్హులు

**ముంబై:** స్వలింగ సంపర్కుల జంట పెట్టుకున్న అభ్యర్థనను ఆదాయపన్ను శాఖ కొట్టిపారేసింది. వివాహ చట్టం ప్రకారం కానుకలపై ఇచ్చే ఆదాయపన్ను మినహాయింపును తమకు కూడా కల్పించాలని కోరుతూ ఓ స్వలింగ సంపర్కుల జంట బాంబే హైకోర్టును ఆశ్రయించింది. ఆదాయపన్ను శాఖలోని సెక్షన్ 56(2)(ఎక్స్) కింద కలిగే బెనిఫిట్స్ తమకు కూడా ఇవ్వాలని కోరుతూ సేమ్‌సెక్స్ జంట కోరింది. పాయో అశిహో, వివేక్‌దివాన్ అనే జంట ఈపిటీషన్ వేసింది. తమకు పన్ను మినహాయింపు ఇవ్వకపోవడం అనైతికమని స్వలింగ సంపర్కుల జంట వాదించింది. స్వలింగ సంపర్కుల జంట పెట్టుకున్న అభ్యర్థనను ఆదాయపన్ను శాఖ వ్యతిరేకించింది. పెళ్లి కానుకలపై జీవితభాగస్వాములు మినహాయింపు కోరడం చట్టం ప్రకారం వర్తిస్తుందని, కానీ పాయో, వివేక్‌లు దంపతులు కారు అని, వాళ్లు కేవలం స్వలింగ సంపర్క భాగస్వాములు మాత్రమే అని, వారికి ఆదాయపన్ను శాఖ చట్టాలు వర్తించవన్నారు.

## కరూర్ బాధితులకు ఉద్యోగాలు




**చెన్నై,జులై 9:** తమిళనాడు సిఎం విజయ్ శుక్రవారం కరూర్‌లో పర్యటించను న్నారు. 2025, సెప్టెంబర్ 27వ తేదీన కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో సుమారు 41 మంది మృతిచెందిన విషయంతెలిసిందే. టీవీకే ప్రచార సభకు హాజరైనజనం నటుడు విజయ్‌ను చూసేందుకు ఎగబడ్డారు. అయితే కరూర్ తొక్కిసలాటకు చెందిన సుమారు 32 మంది బాధిత కుటుంబాలకు రేపు సీఎం విజయ్ ప్రభుత్వ ఉద్యోగ అపాయింట్ మెంట్ ఆర్డర్లను అందజేయను న్నారు. ఈపర్యటన సందర్భంగా ప్రభుత్వ సంక్షేమపథకాల లబ్ధిదారులకుకూడా ఆయన సాయం చేయనున్నారు.

## 300కుపైగా ఫైవ్‌స్టార్ హోటళ్లకు టోకరా

**న్యూఢిల్లీ,జులై 9:** దేశవ్యాప్తంగా గత మూడు దశాబ్దాలుగా 300కుపైగాలగ్జరీ హోటళ్లను బురిడీ కొట్టించిన తమిళనాడుకు చెందిన 69 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ గుర్తింపులతో ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస చేసి, బిల్లులు చెల్లించకుండా పరారయ్యేవాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని బింగ్సన్ జాన్‌గా గుర్తించారు. విదేశీ టూరిస్ట్ గైడ్, ఇంగ్లీష్ టీచర్, యోగా ట్రైనర్ వంటి వేర్వేరు గుర్తింపులతో ఫైవ్‌స్టార్ హోటళ్లలో గదులు బుక్ చేసుకుని, పలురోజులు అక్కడే ఉంటూ హోటల్ సౌకర్యాలను పూర్తిగా వినియోగించుకునేవాడు. అనంతరం బిల్లు చెల్లించకుండా అక్కడి నుంచి వెళ్లిపోయేవాడు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ హయత్ హోటల్‌ను లక్ష్యంగా చేసుకున్న జాన్, అక్కడ రెండు రోజుల పాటు బస చేసి రూ.63,755 విలువైన బిల్లు చెల్లించకుండా వెళ్లిపోయాడు. సుమారు రూ.1.48 లక్షల విలువైన ల్యాప్‌టాప్‌ను కూడా తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.హోటల్ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో యాంటీ క్రైమ్ అండ్ సైబర్ యూనిట్, టెలీబాంధా పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. మొబైల్ ఫోన్ కాల్ డేటా, పత్రాలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి ఒడిశాలోని భువనేశ్వర్‌లో అతడి ఆచూకీని గుర్తించారు. రాయ్‌పూర్ పోలీసుల ప్రత్యేక బృందం 72 గంటల్లోనే అతడిని అదుపులోకి తీసుకుని, "ఆఫీస్ పని కోసం" తీసుకెళ్లానని చెప్పిన దొంగిలించిన ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుంది.

10-7Pg6exHMNWJQE_10-7Pg6exHMNWJQE.qxd 09/Jul/26 11:41 PM Page 1






భారత్ టెక్స్-2026లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసిన ప్రత్యేక పెవిలియన్

## 14 నుంచి న్యూఢిల్లీలో భారత్ టెక్స్-2026

### ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు

**విజయవాడ, జూలై 9, ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ చేనేత, జౌళి, వస్త్ర పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. జూలై 14నుంచి 17 వరకు న్యూఢిల్లీలోని భారత మండపంలో జరిగే భారత్ టెక్స్-2026లో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పెవిలియన్‌ను ఏర్పాటు చేసి రాష్ట్రంలోని చేనేత, జౌళి, అపారెల్, గార్మెంట్ రంగాల సామర్థ్యాన్ని, పెట్టుబడి అవకాశాలను, ఎగుమతి అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పనుంది. భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ హాల్ నంబర్-9, స్టాల్ నంబర్-95లో ప్రత్యేక పెవిలియన్‌ను ఏర్పాటు చేసింది. గత రెండు ఎడిషన్లలో విజయవంతంగా పాల్గొన్న అనుభవంతో ఈసారి మరింత విస్తృత స్థాయిలో రాష్ట్ర టెక్స్‌టైల్ రంగాన్ని ఆవిష్కరించనుంది. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని చాంపియన్, ఆస్పిరేషనల్ జిల్లాలకు చెందిన 40 మంది పారిశ్రామికవేత్తలు, ఎగుమతిదారులు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారు. వీరికి అంతర్జాతీయ కొనుగోలుదారులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యే అవకాశం లభించడంతో పాటు కొత్త వ్యాపార భాగస్వామ్యాలు, ఎగుమతి అవకాశాలు, ప్రపంచ మార్కెట్లపై అవగాహన పెంపొందే అవకాశం కలగనుంది. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆలోచనల మేరకు చేనేత ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు తీసుకురావడం, నేతన్నలకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం, పారిశ్రామికవేత్తలకు కొత్త వ్యాపార అవకాశాలు సృష్టించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

# నాణ్యమైన వైద్యవిద్యకు పటిష్ట చర్యలు

### 2026-27 రెండో త్రైమాసికంలో బడ్జెట్ వినియోగంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష



**విజయవాడ.జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అతి కీలకమైన ప్రొఫెసర్ల పోస్టుల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉండడంతో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపును పరిశీలించాల్సిన అవసరం ఏర్పడిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జాతీయ వైద్య సంఘం (ఎన్ఎంసీ) ప్రమాణాల మేరకు ఒక ప్రొఫెసర్ పోస్టుకు మూడు పీజీ సీట్లను కేటాయించడం జరుగుతోంది. ప్రైవేటు వైద్య కళాశాలల్లో ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు 70 సంవత్సరాలుగా ఉండడంతో ప్రొఫెసర్ల లభ్యత పెరిగి పీజీ సీట్లు ఎక్కువగా పొందడం జరుగుతోంది. రాష్ట్రంలోని 17ప్రభుత్వ వైద్య కళాశాలల్లో దాదాపు 800 ప్రొఫెసర్ల పోస్టులకుగాను 200 ఖాళీగా ఉంటుండడంతో దీని ప్రభావం వైద్య విద్య ప్రమాణాలపై పడడంతోపాటు పీజీ సీట్లను కోల్పోయే పరిస్థితి ఎదురవుతోంది. మరీ ముఖ్యంగా 16 సూపర్ స్పెషాల్టీ విభాగాల్లో 159 ప్రొఫెసర్ల పోస్టులకుగాను 106 (66శాతం) ఖాళీలు ఉండడంపై మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. నిబంధనల ప్రకారం పదోన్నతుల ద్వారా ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంటుంది. వివిధ విభాగాల్లో పదోన్నతికి అర్హులైన వారు లేకపోవడంతో ఖాళీలు పేరుకుపోతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరిం చేందుకు ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపు అంశాన్ని ప్రభుత్వం పరిశీలించేందుకు సమగ్ర ప్రతిపాదనను రూపొందించాలని డాక్టర్ విష్ణువర్ధన్‌ను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో 2026- 27 ఆర్థిక సంవత్సరంలో తొలి త్రైమాసికంలో బడ్జెట్, కేంద్ర సాయం వినియోగ తీరుపై ఉన్నతాధికారులతో సమగ్రంగా మూడు గంటలకుపైగా మంత్రి సమీక్షించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు అతి కీలకమైన నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సవర్థులైన వైద్యుల అవసరం ఉన్నందున రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన వైద్య విద్య అందించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశం చారు.

గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అదనంగా 230 ఎంబీబీఎస్, 250 పీజీ సీట్లలో ప్రవేశాలు కల్పించినట్లు విశ్వవిద్యాలయం అధికారులు మంత్రికి తెలిపారు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం 75శాతం హాజరు ఉన్న వైద్య విద్యార్థులు మాత్రమే వార్షిక పరీక్షలకు అర్హులని, ఈ విషయంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ప్రొఫెసర్లు ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడొద్దని మంత్రి స్పష్టంచేశారు. విద్యార్థుల హాజరు నమోదుకు ప్రస్తుతం అమలవుతున్న వ్యవస్థపై మంత్రి అసంతృప్తి వ్యక్తంచేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరం మొత్తం వార్షిక బడ్జెట్ కేటాయింపు రూ.18,216 కోట్లు కాగా మొదటి త్రైమాసికం (ఏప్రిల్- జూన్)లో రూ. 4,130 కోట్ల వ్యయం (22.72 శాతం) జరిగినట్లు సమీక్షా సమావేశంలో ఉన్నతాధికారులు మంత్రికి వివరించారు. ప్రతిపాదిత మొత్తం కేంద్ర సాయం రూ.2,308 కోట్లు కాగా జూన్ వరకు రూ.357 కోట్ల(15 శాతానికిపైగా )ను వినియోగించినట్లు అదికారులు తెలిపారు. మొత్తం వ్యయం సరళి కొంతమేరకు బాగానే ఉన్నా కేంద్ర సాయాన్ని తక్కువ మోతాదులో వాడుకోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకుగల కారణాలను ఆయన అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ స్మరణ్ రాజ్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువరన్, ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, ఎన్టీఆర్ ఆరోగ్య, విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు సీనియర్ అధికారులకు ఐఎఎస్ హోదా

**విజయవాడ,జులై9, ప్రభాతవార్తప్రతినిధి:** నాన్‌స్టేట్ సివిల్ సర్వీసెస్ కోటాలో ఐదుగురు సీనియర్ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఇందుకు సంబంధించి డీవోపీటీ అండర్ సెక్రటరీ కవిత ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేశారు. మున్సిపల్ ఆడ్మినిస్ట్రేషన్‌కు చెందిన పి.గోపీనాథ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన జి.బాలకృష్ణ, రాష్ట్ర పన్నుల శాఖకు చెందిన ఎం.జయకృష్ణ, పరిశ్రమల శాఖకు చెందిన ఎ.ఎ.ఎల్.పద్మావతి, జైళ్ల శాఖకు చెందిన ఎం.వరప్రసాద్ ఐఏఎస్‌కు ఎంపిక అయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి డీవోపీటీ పంపించింది.2023-24, 2024-25కు సంబంధించి నాన్‌స్టేట్ సివిల్ సర్వీసెస్ కోటాలో ఆరు ఐఏఎస్ పోస్టులు ఖాళీ ఉండగా ప్రభుత్వం ఐదు పోస్టులను భర్తీ చేసింది. ఆరు పోస్టులకు 69మంది సీనియర్ అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో సర్వీస్ ట్రాక్ బాగున్న 29 మంది అధికారులను ఎంపిక చేసిన ప్రభుత్వం, పేర్లను యుపీఎస్సీకి పంపించింది. డిసెంబరు 29,30 తేదీల్లో వారికి ఇంటర్వ్యూలను నిర్వహించింది.స్టేట్ సివిల్‌సర్వీసెస్ కోటాలో సీనియర్ రెవెన్యూ అధికారి గేదెల శ్రీను కుమార్ ఐఏఎస్‌కు ఎంపిక అయ్యారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక నోటిఫికేషన్ డీవోపీటీ జారీ చేసింది. ఆమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కూడా ఉత్తర్వు జారీ చేశారు.

## భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కొల్లు



భూమి హక్కుదారులకు పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జులై 9, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యల్ని పరిష్కరించి, ప్రజలకు వారి ఆస్తిపై పక్కాగా హక్కు కల్పించే లక్ష్యంతో పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం రూరల్ మండలం గోకవరం గ్రామంలో 'మీ భూమి మీ హక్కు'కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు గతో కలిసి పాల్గొని రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. అనం తరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కష్టపడుతున్నా రన్నారు. గతంలో సర్వే రాళ్లపై, పట్టాదారు పాస్ పుస్తకాలపై కూడా జగన్ రెడ్డి తన బొమ్మలేసుకున్నారన్నారు. గత ఐదేళ్ల రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్థం చేశారు. కూటమి వచ్చాక వ్యవస్థ మొత్తాన్ని ప్రక్షాళన చేసి. నష్టపోయిన రైతాంగాన్ని, ప్రజల్ని కాపాడేలా చర్యలు తీసుకున్నామన్నారు.

బందరు నార్త్ మండలంలోని ఐదు గ్రామాల్లో సుమారు 1966 మందికి, సౌత్ మండలంలో నెలకుర్రులో 851 మంది మొత్తంగా 2817 మందికి చెందిన భూములు రీ సర్వే చేసి పట్టాదార్ పాస్ పుస్తకాలు అందిం చామన్నారు. ప్రణాళికా బద్ధంగా మచిలీపట్నం నియోజక వర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## 29 గ్రామాల ప్రతినిధులతో ప్రత్యేక కమిటీ

### అమరావతి రైతు జెఎసి కీలక నిర్ణయం

**విజయవాడ,జులై9, ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం, సీఆర్డీఏ అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చేం దుకు అమరావతి రైతు జేఏసీ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతి పరిధిలోని మొత్తం 29 గ్రామాల ప్రతినిధులతో ఒక ప్రత్యేక అభివృద్ధికమిటీని త్వరలోనే ఏర్పాటు చేయాలని జేఏసీ నేతలు తీర్మానించారు.ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం విడివిడిగా సీఆర్డీఏ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, దీనివల్ల అసలైన రైతుల ఉమ్మడి సమస్యలు పక్కదారి పడుతున్నాయని జేఏసీ అభిప్రాయపడింది. అందుకే అందరి తరఫున మాట్లాడేలా ఒక అధికారిక కమిటీని తేవాలని నిర్ణయించింది.

## తెలంగాణ మంత్రి సీతక్కకు సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పుట్టిన రోజు శుభాకాంక్షలు

**విజయవాడ,జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ మంత్రి సీతక్క పుట్టినరోజు సందర్భంగా ఏపీ సీఎం చంద్ర బాబు ఎక్స్ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు. ప్రజాసేవలో మీరు మరిన్ని విజయాలు సాధిస్తూ, ఆయురారోగ్యాలతో ఉండాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నాను అని తన సందేశంలో పేర్కొన్నారు. ఎక్స్ వేదికపైనే మంత్రి నారా లోకేశ్ కూడా సీతక్కకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెను అణగారిన వర్గాల గొంతుకగా అభివర్ణిస్తూ, ఆమె జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడుతూ లోకేశ్ ట్వీట్ చేశారు.

# జీరుపాలెంలో భూపోరాటం

### 26యేళ్ల క్రితం మోసపూరితంగా పొందిన పట్టాలను రద్దు చేయాలని డిమాండ్, రంగంలోకి దిగిన తహసీల్దార్, ఎస్ఐ

### న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించిన గ్రామస్థులు





**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), జులై 9 ప్రభాతవార్త :** నాయకులమని చెప్పుకుంటూ 26 ఏళ్ల క్రితం ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టాలు చేయించుకున్న వారిపై శ్రీకాకుళం జిల్లాలో రణస్థలం మండలంలో జీరుపాలేం, జగన్నాధపురం గ్రామస్థులు తిరుగుబాటు చేశారు. గ్రామస్తులను మోసం చేసి పొందిన అక్రమ పట్టాలను వెంటనే రద్దు చేసి, జీరుపాలేం పంచాయతీలో ఇళ్ల లేని నిరుపేదలున్నారని వారికి ఇళ్ల స్థలాలుగా మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వివాదాస్పద భూముల వద్ద సుమారు 400 మంది గ్రామస్థులు గురువారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. అసలు ఏం జరిగిందంటే గత 2000 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో, అప్పటి ఎచ్చెర్ల ఎమ్మెల్యే కావలి ప్రతిభాభారతి హయాంలో జీరుపాలేం పంచాయతీకి చెందిన 720 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను మంజూరు చేశారు. అయితే ఆ సమయంలో జీరుపాలేంలో మిగిలిన మరో 20 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామంలో పెద్దలుగా చలామణి అవుతున్న ఐదుగురు వ్యక్తులు తమ పేర్లపై దొంగచాటుగా పట్టాలు చేయించుకున్నారు. నాడు నమ్మించి.. నేడు వంచించి అప్పట్లో దీనిపై గ్రామస్థులు సదరు పెద్దలను నిలదీయగా పట్టాలు మా పేరున ఉన్నప్పటికీ, ఈ భూమి గ్రామస్థులందరికీ చెందుతుంది అని నమ్మబలికారు. అమాయక గ్రామస్థులు వారి మాటలను నమ్మారు. కానీ, ఇటీవల ఆ 20 ఎకరాల భూమిని సదరు పట్టాదారులు సొంత లాభం కోసం చదును చేయడంతో అసలు రంగు బయటపడింది. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు వారి పనులను అడ్డుకున్నారు.

**ఉద్రిక్తంగా మారిన ఆందోళన - అధికారుల ఎంట్రీ:** తమకు జరిగిన అన్యాయంపై గురువారం గ్రామస్థులంతా ఏకమై సదరు వివాదాస్పద భూముల వద్ద భారీ ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో రణస్థలం తహసీల్దార్ ఎస్. కిరణ్‌కుమార్, ఎస్ఐ చిరంజీవి తమ సిబ్బందితో కలిసివెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామ పెద్దలునాడు దొంగచాటుగా పొందిన పట్టాలను వెంటనే రద్దు చేయాలని, గ్రామంలో ఇళ్లస్థలాలులేని అర్హులైన నిరుపేదలకు ఆ భూమిని ఇళ్లస్థలాలుకు కేటాయించాలని గ్రామస్థులంతా అధికారులను ముక్తకంఠంతో కోరారు.

**హామీతో సద్దుమణిగిన వివాదం:**గ్రామస్థుల వినతిని, వారి ఆవేదనను ఆలకించిన తహసీల్దార్, ఎస్ఐ స్పందిస్తూ ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, చట్టప్రకారం తగిన న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అధికారుల నుంచి సానుకూల స్పందన రావడంతో గ్రామస్థులు తమ ఆందోళనను విరమించారు.

## కాపులూ.. కాంగ్రెస్‌తో కలవండి ముఖ్యమంత్రిని చేస్తాం

### కేంద్ర మాజీమంత్రి చింతా మోహన్




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై9, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు కాపులు ఒక్క రోజు కూడా ముఖ్యమంత్రి కాలేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. సుమారు 20శాతం జనాభా కలిగి, ఓటర్లలో అత్యధిక శాతం ఉన్న కాపు సామాజిక వర్గం రాజకీయంగా తీవ్ర నిరక్ష్యాన్లికి,అణచివేతకు గురైందన్నారు. జగన్, చంద్రబాబు ఇరువురూ కాపులను ముఖ్యమంత్రిగా అంగీకరించరని,వారు లేదా వారి వారసులను మాత్రమే ముఖ్యమంత్రిగా ప్రమోట్ చేసుకుంటారని తెలిపారు.కాపు సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే, ముఖ్యమంత్రి అవుతారని చింతా మోహన్ పేర్కొన్నారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా కావాలని కోరుతున్నారని,వారు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే, తప్పకుండా అధికారంలోకి రాగానే రాజ్యాంగ సవరణ చేసి, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇస్తామన్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో జయలలితకు ఒక న్యాయం?జగన్‌కు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. జగన్‌కు మోడీ మద్దతు ఉందన్నారు. అందుకే కేసులు విచారణ ఆలస్యం అవుతోందన్నారు.

## జాతీయ రహదారిపై విషాదం

## కారు ఢీకొని మహిళ మృతి, భర్తకు తీవ్రగాయాలు

**పూతలపట్టు, జులై 9 ప్రభాతవార్త:** చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారిపై పి కొత్తకోట బస్టాండ్ సమీపంలో గురువారం విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోటుగనుమ గ్రామానికి చెందిన కృష్ణయ్య, లలితమ్మ దంపతులు తిరుపతి నుంచి వచ్చి పి కొత్తకోట వద్ద బస్సు ఉదయం 9:45 నిమిషాలకు దిగి జాతీయ రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లలితమ్మ తీవ్ర గాయాలపాలై ఘటన స్థలంలోనే మృతి చెందారు. కృష్ణయ్యకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీ సులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తిమ్మయ్య ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి సంబంధించిన వివ రాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## గురువు సన్నిధిలో అక్షరాభ్యాసం, చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట: ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగిన సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న ఎంఎల్ఏ సుధీర్ రెడ్డి

**శ్రీకాళహస్తి,జులై 9 ప్రభాతవార్త:** పుణ్యక్షేత్రం అయిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురువు దక్షిణామూర్తి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయటం వారి భవిష్యత్తుకు బంగారు బాట అని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. దేవాదాయశాఖ ఆదేశాలతో ఆలయ కార్యనిర్వహాణాధికారి బికె వెంకటేశులు పట్టణంలోని చిన్నారులకు 'సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను' గురుదక్షిణా మూర్తి ఆలయం వద్ద ఏర్పాటు చేసారు.ఈ కార్యక్రమాలకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌ంరెడ్డి ముఖ్యఅతిధిగా వచ్చారు.పట్టణం నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా తల్లిదండ్రులు తమ బిడ్డలను అక్షరాలు దిద్దించుటకు హాజరయ్యారు. సామూహిక అక్షరాభ్యాసం సందర్భగా ఆలయ ప్రధానార్చకులుడాక్టర్‌స్వామినాధన్ గురుకుల్ పూజలు నిర్వహించారు.చదువుల గురువు దక్షిణామూర్తి సన్నిధిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం తన పూర్వజన్మ సుకృతమన్నారు. విద్యారంభాన్ని దైవ సన్ని ధానంలో నిర్వహించటం మన భారతీయ సంస్కృతిలో విశిష్టమైన సంప్రదాయం అన్నారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు ఇది మార్గద ర్శకం అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులచే ఆయన అక్షరాలు దిద్దించారు. తరువాత వారి తల్లిదండ్రులతో మమేకమయ్యారు.

**ప్రభుత్వ బడుల్లో చేర్పించండి:** ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో 16కాళ్ళమండపం వద్ద ఎంఎల్ఏ మాట్లాడుతూ నేడు ప్రభుత్వం నిరుపేదల విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్పొరేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ బడుల్లోనే ఈ ఏడాది సత్ఫలితాలు వచ్చాయన్నారు. ఈ ఏడాది ప్రైవేటు నుంచి సుమారు లక్షమందికి పైగా ప్రభుత్వ బడుల్లో చేరటం ప్రతి తల్లిదండ్రి గుర్తించాలని పిలుపు నిచ్చారు. అర్హత కల్గిన ఉపాధ్యాయుల్ని నియమించాము. యూనిఫారం, పుస్తకాలు, బస్సు సదుపాయాలు కల్పించామన్నారు.కాబట్టి ప్రతి తల్లిదండ్రి తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చి ప్రభుత్వ కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తూ స్వామి అమ్మవార్ల ప్రసా దాలను అందించారు. వేదపండితులచే ప్రత్యేకా శీర్వచనాలు అందించారు.ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు కోలా వైశాలి, కె.నాగరాజు, జి.గోపినాథ్, డిలక్ష్మమ్మ, శైలజలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంలో రైతుల భాగస్వామ్యమే లక్ష్యం

### 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్



**విజయవాడ,జులై 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని రైతులు న్యాచురల్ ఫార్మింగ్ విధానంలో పెద్ద ఎత్తున సాగుకు సిద్ధమయ్యేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్యాచరణ రూపొందించాయని,2035 నాటికి మన రాష్ట్రంలో 60 లక్షలకు పైగా రైతుల ప్రకృతి వ్యవసాయంలో భాగస్వామ్యం లక్ష్యంగా పనిచేస్తున్నామని 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ సేద్యం సాగు పెంపుపై వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్,ఆర్గానిక్ ఫార్మింగ్ సర్టిఫైయింగ్ అథారిటి ఛైర్మన్ శ్రావణ్ దత్ లతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలోని అంశాలను ఆయన ఏపీ సచివాలయంలోని తన ఛాంబర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు.ఈ సందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ ప్రకృతి సేద్యంపై రైతుల ఆసక్తిని పెంచి వారికి లాభార్జన కలిగించటంతో పాటు పర్యావరణ హితానికి మన వంతు సహకారం అందించడం, అలాగే భూమి తల్లిని రసాయన ఎరువుల నుండి కాపాడటమే లక్ష్యంగా 2016లో అడుగులు వేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 18 లక్షల మంది రైతులు, 20 లక్షల ఎకరాల్లో, 8168 గ్రామాల్లో నేచురల్ ఫార్మింగ్ చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. 2035 నాటికి 60 లక్షల మంది రైతులు, 20 లక్షల కుటుంబాలు ప్రకృతి సేద్యంలో భాగస్వామ్యం అయ్యేలా కృషి చేస్తున్నామన్నారు.

ఇప్పటి వరకు రూ.1560 కోట్లు ప్రకృతి సేద్యం పెంపుపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించాయన్నారు.వీటిలో 1250 కోట్లు కేంద్ర ప్రభుత్వం, రూ.310 కోట్లు వివిధ సేవా దృక్పదం ఉన్న దాతలు సమకూర్చారని వివరించారు.ఇక రాబోయే 5 సంవత్సరాల్లో వ్యయం రూ.3800 కోట్లు గా అంచనా వేయడం జరిగిందన్నారు.40 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం వైపు మళ్లేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి సేద్యం సాగును పెంచడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి రక్షణను ఇవ్వాలన్న దృక్పదంతో 202627 ఆర్థిక సంవత్సరానికి రూ.321 కోట్లను కేటాయించాలన్న ప్రతిపాదన చేయడం జరిగిందన్నారు.ఇప్పటికే రాష్ట్రానికి రూ.100 కోట్లు కేంద్రం విడుదల చేసిందన్నారు. క్యాబినెట్ ఆమోదం అనంతరం బ్యాలెన్స్ నిధులు రాష్ట్రానికి అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిధుల విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖను సైతం కేంద్రానికి పంపడం జరిగిందన్నారు.ఇప్పటికే అందిన రూ.100 కోట్ల నిధులతో 9170 గ్రామ పంచాయితీల్లో కార్యాచరణ సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఆర్గానిక్ ఫార్మింగ్ సర్టిఫైడ్ ఛైర్మన్ దత్ నేషనల్ ఫార్మింగ్ సర్టిఫికెట్ తీసుకోవడంలో రైతులు మరింత చైతన్యం కావాలని పిలుపునిచ్చారని ఈ సందర్భంగా లంకా దినకర్ తెలిపారు.కావున ప్రకృతి సేద్యాన్ని చేస్తున్న రైతులు అందరూ సర్టిఫికేషన్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకాశం డెయిరీని మళ్లీ పునఃపారంభించాలని వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్‌ను కోరడం జరిగిందన్నారు.2019-24 మధ్య గత ప్రభుత్వం అమూల్‌కు కట్టబెట్టాలని చూడటంతో మేము సమర్థవంతంగా అడ్డుకోవడం జరిగిందని ఛైర్మన్ లంకా దినకర్ ఈసందర్భంగా గుర్తుచేశారు.

## బిసి గృహ విద్యుత్ వినియోగదారులకు శుభవార్త

**విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పిఎం సూర్యఘర్ పథకం కింద బిసి గృహ విద్యుత్ వినియోగదారులకు ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర సబ్సిడీకి అదనంగా రూ.20 వేల ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. నెలకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ వినియోగం కలిగిన 27.2 లక్షలమంది వెనుకబడిన వర్గాల వినియోగదారులకు వారికి ప్రయోజనం చేకూర్చనుంది. ఇందుకుగానూ రూ.5,445.7 కోట్లు వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

### విద్యుత్ సంస్థల్లో 62 సంవత్సరాల సర్వీస్ అమలుపై

# అధ్యయనానికి ఆరుగురు సభ్యుల కమిటీ

### 15రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఎపిపిసిసి సమావేశంలో నిర్ణయం

**విజయవాడ, జులై 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ జారీ చేసిన ఉత్తర్వుల అమలును ఎపి విద్యుత్ సంస్థల్లో పరిశీలించేందుకు ఆరుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ (ఎపిపిసిసి) నిర్ణయించింది. కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎపిపిసిసి ఛైర్మన్ కె. విజయానంద్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమావేశంలో ఎపి ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, డిస్కంల సిఎండిలు శివశంకర్ లోతేటి, పృథ్వీతేజ్ ఇమ్మడి, ఎపి జెన్‌కో ఇన్‌చార్జ్ ఎండి, సిపిడిసిఎల్ సిఎండి పి. పుల్లారెడ్డితో పాటు సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. 62 సంవత్సరాల సర్వీస్ అమలు వల్ల విద్యుత్ సంస్థలపై, తద్వారా వినియగదారులపై పడే ఆర్థిక భారం, విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొనే పరిస్థితులు, ప్రధానంగా క్షేత్రస్థాయిలో లైన్‌మెన్‌లు ఎదుర్కొనే పరిస్థితులు, పరిపాలనా పరమైన అంశాలు తదితర విషయాలపై సమగ్రంగా అధ్యయనం చేసి 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కమిటీకి సూచించారు.

కమిటీ నివేదిక ఆధారంగా ఈ అంశంపై తదుపరి నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ కమిటీలో ఎపి ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, ఎపి జెన్‌కో ఎండి, సిపిడిసిఎల్ సిఎండి పి.పుల్లారెడ్డి, డిస్కంల సిఎండిలు శివశంకర్ లోతేటి, పృథ్వీతేజ్ ఇమ్మడి, లీగల్ అడ్వైజర్ శివారావు సభ్యులుగా వ్యవహరిస్తారు.

10-7Pg7exHMNWJQE_10-7Pg7exHMNWJQE.qxd 09/Jul/26 11:38 PM Page 1



# జనసేన సైనికులు బాధ్యతాయుతంగా పనిచేయాలి: డి.సిఎం పవన్



**విజయవాడ,జూలై 9,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన సైనికులు బాధ్యతాయుతంగా ప్రజా సమస్యలపై పనిచేయాలని ఏపీ డిప్యూటీ సీఎం, జెనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ అన్నారు.క్షేత్ర స్థాయి నుంచి పార్టీ నిర్మాణాత్మకంగా పనిచేయాలన్నారు.పార్టీ నిర్మాణాన్ని బలోయంగా నిలిపేందుకు అన్ని దశల్లో మనం తీసుకున్న కార్యాచరణ పకడ్బందీగా అమలు చేయాలన్నారు.సర్ ప్రక్రియకు మద్దతును ఇస్తూనే మన ఓటర్లు విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రత్యర్థులు కుట్రలు తిప్పి కొట్టాలన్నారు. కచ్చితంగా ఓటరును కాపాడుకోవాలన్నారు.పార్టీ నిర్మాణంతో పాటు,కూటమి పక్షంతో ఐక్యంగా వ్యవహరించాలన్నారు.నగరంలోని ఒక ప్రముఖ హోటల్ సభా ప్రాంగణంలో జనసేన పార్టీ కీలక సమావేశం జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధ్యక్షతన ఏర్పాటైంది.ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సమావేశం ప్రారంభంలో . పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మనలను లక్ష్యంగా చేసుకుని సాగే దుష్ప్రచారాలను బలీయమైన రీతిలో తిప్పికొట్టాలన్నారు. రావణ్ అంశంపై చట్టం వాస్తవాలను బట్టబయలు చేస్తుందన్నారు.యూట్యూబ్ ఛానల్ పేరుతో జర్నలిస్టులుగా చెప్పుకుని కొందరు, ఎనలిస్టులుగా మరికొందరు, కులమతాల సభల పేరిట ఇంకొందరు ఇటీవలి కాలంలో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు. వారిపై కేసులు నమోదు చేస్తే ఆధిపత్యాసమికం, వాక్ స్వాతంత్ర్య హక్కు అనే వాదనల్ని తెరపైకి తెస్తున్నారు. ఇలాంటి వారిలో ఎక్కువమంది ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారు. ఇలాంటి చర్యలకు చట్టపరంగానే అడ్డుకోవటంతో పాటు వారి వాదనల్ని తిప్పికొట్టాలన్నారు, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వడంతో పాటు, పార్టీ శ్రేణులు ప్రజల్లో మరింత చురుగ్గా ఉండేలా కార్యాచరణ పవన్ నిర్దేశించారు. ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జనసేనాని పార్టీ వర్గాలను ఆదేశించారు. ఇందులో భాగంగా గ్రామస్థాయిలో నాలుగు ప్రాంతాల్లో నిర్వహించనున్న జనగళం కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా సమస్యలు స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమాలకు పార్టీకి చెందిన ఒక మంత్రి, నలుగురు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరయ్యేలా కార్యచరణ ఉండాలన్నారు.జనగళంతో పాటు మరికొన్ని ప్రజా కార్యక్రమాల బాధ్యతలను పార్టీ నేతలకు సూచించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యక్రమాలపై పర్యవేక్షణ పెంచాలని దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాలలో సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించి.. ఓట్లు మిస్ కాకుండా చూసేలా పవన్ సూచనలు చేశారు. ప్రజా సంక్షేమ పథకాలను విస్తృతంగా జనంలోకి తీసుకుని వెళ్లాలన్నారు. గత రెండేళ్లలో పల్లె పండుగ వంటి కార్యక్రమాల ద్వారా రూ.16,695 కోట్ల ఉపాధి నిధులు వినియోగించామని. 7 వేల కి.మీ. సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500పశువుల నీటితొట్లెలు నిర్మించామన్నారు. స్వచ్ఛ గ్రామం, ఆరోగ్య గ్రామం లక్ష్య సాధన దిశగా పారిశుద్ధ్య సేవలతో పరిశుభ్ర వాతావరణం అందించాం. పల్లె పండుగ విజయాలను స్ఫూర్తిగా కొనసాగిస్తూ రైతు పంట సకాలంలో మార్కెట్‌కు చేరుస్తున్నాం. లక్ష ఎక రాల్లో ఉద్యానవన పంటల సాగుకు సంకల్పిం చాం. 2025లో ఐదు జాతీయ పంచాయతీ అవార్డులు సాధించి దేశంలో రెండో స్థానంలో నిలిచామన్నారు.

# గొల్లవానిగుంటలో రాష్ట్ర అంధుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**తిరుపతి క్రీడ, జూలై 9 ప్రభాతవార్త:** తిరుపతిలోని గొల్లవాని గుంటలో బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర బ్లైండ్ క్రికెట్ టోర్నమెంట్‌కు టీటీడీ బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్‌తో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ రవి నాయుడు కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ బ్లైండ్ క్రికెట్ క్రీడాకారులు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ జాతీయ పతాకాన్ని అంతర్జాతీయ వేదికలపై రెపరెపలాడిస్తున్న గొప్ప క్రీడాకారులని కొనియాడారు. గతంలో బ్లైండ్ క్రికెట్‌కు తగిన గుర్తింపు లేకపోయినా, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి, బ్లైండ్ క్రికెట్ సంఘం ప్రతినిధులు రవీంద్రబాబు, శరత్ బాబు తదితరులను అభినందిస్తూ, సాధారణ క్రికెటర్లకు ఇచ్చే గౌరవంతోనే బ్లైండ్ క్రికెటర్లను కూడా గౌరవించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ టోర్నమెంట్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 8 పురుషుల జట్లు నుండి 118 మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. 12వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జరుగుతున్న ఈ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించబడాలని ఆకాంక్షిస్తూ, ఇలాంటి రాష్ట్ర స్థాయి పోటీలు దివ్యాంగ క్రీడాకారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకువస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యురాలు శ్రీమతి పనబాక లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్లైండ్ క్రికెటర్ల ప్రతినిధులు, స్వర్గీయ ఎన్టీ రామారావు హయాంలో దివ్యాంగులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో టికెట్ లేకుండా దర్శన సౌకర్యం ఉండేదని, అదే విధానాన్ని తిరిగి అమలు చేయాలని పనబాక లక్ష్మిని కోరగా, ఆమె దీనిపై సానుకూలంగా స్పందిస్తూ తిరిగి అమలులో తెచ్చేందుకు ప్రయత్నిస్తానని తెలియజేశారు.

రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యంగా తిరుపతిని రాష్ట్రంలోనే ప్రముఖ క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు రవి నాయుడు ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఏఎస్పి ఆర్ల శ్రీనివాస్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోటా వాసు, ఆంధ్రప్రదేశ్ బ్లైండ్ క్రికెటర్ అసోసియేషన్ సభ్యులు, తిరుపతి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి శశిధర్, కోచులు, బ్లైండ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

## మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి




**విజయవాడ, జూలై 9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల విద్య, వైద్యం ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖల మంత్రి డా.డోలా. శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం అమరావతి సచివాలయంలో విబిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు. ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమర్థవంతంగా పనిచేసే సంరక్షణ ఆర్థిక వ్యవస్థను రూపొందించడం అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ వర్క్ షాప్ కి ముఖ్య అతిథిగా మంత్రి డా. స్వామి హాజరయ్యారు. ఈ వర్క్ షాప్‌లో... పేదరిక నిర్మూలన, ఆకలి లేని స్థితి, మంచి ఆరోగ్యం మరియు శ్రేయస్సు, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, తగిన పని మరియు ఆర్థిక వృద్ధి, అసమానతను తగ్గించడం, సుస్థిర నగరాలు మరియు సమాజాలు, శాంతి, న్యాయం మరియు బలమైన సంస్థలు, లక్ష్యాల సాధన కోసం భాగస్వామ్యం అనే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ప్రజల విద్య, వైద్యం ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. పి 4 తో రాష్ట్రంలో నిరుద్యోగం, పేదరికం నిర్మూలనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారు. వీజీ బీ రామ్ జీ నుంచి యువతకు నైపుణ్య శిక్షణ వంటి వాటితో అందరికీ ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ కార్యాలయాల ద్వారా కౌసల్యం కార్యక్రమంతో గ్రామాల్లోని నిరుద్యోగ యువతను గుర్తించి నైపుణ్య శిక్షణ ఇచ్చిన అనంతరం వారికి వర్క్ ఫ్రొం హోం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. రాష్ట్రం అన్ని రంగాల్లో వృద్ధి సాధించాలి. వృద్ధులకు సైబర్ క్రైమ్స్ మోసాల పట్ల అవగాహన కల్పించాలి. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ వర్క్ షాప్ లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు,ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ. సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురంలో హైటెన్షన్

## టిడిపి, వైసిపి నేతల చర్యలతో ఉద్రిక్తత

## మాజీ ఎంపీ గోరంట్ల, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి అరెస్ట్

**అనంతపురం క్రైమ్ జూలై 9 ప్రభాతవార్త:** నువ్వా.. నేనా.. అంటూ టిడిపి, వైసిపి నేతల ఆరోపణలు, ప్రత్యారోపణలతో అనంతపురం జిల్లా రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. ఎప్పుడు, ఏమి జరుగుతుందోనని నగరమంతా ఉత్కంఠతో అట్టుడికింది. మడకశిర తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, రాప్తాడు వైయస్సార్సీపి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిల మధ్య బిగ్ వార్ జరుగుతోంది. ఇందులో భాగంగానే వైసీపీ నేత పై టీడీపీ నేత ఎమ్మెస్ రాజు అక్రమాస్తుల నిరూపణ కోసం గురువారం డెడ్ లైన్ విధించగా ఉదయం నుండి ఉద్రిక్తతకు దారి తీసింది. పూర్తి వివరాల మేరకు సుమారు పక్షం రోజులుగా ఒకరిపై ఒకరు చేసుకున్న ఘాటైన విమర్శలు, ప్రతి విమర్శలతో, పదునైన వ్యాఖ్యానాలు, మాటలు తూటాల్లా పేలాయి. మీడియా సమావేశాలే వేదికగా చేసుకున్న ఇరు పార్టీల నేతల మధ్య సాగిన ఆరోపణలు చివరకు వ్యక్తిగత దూషణల దాకా దారితీసింది. ఈ నేపథ్యంలో తొలుత కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు తన అనుచరులతో సర్ మీటింగ్ కోసం ప్రత్యేక బస్సుల్లో అనంతపురం నగరానికి వస్తున్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య తో వైసిపి నాయకులు కార్యకర్తలు తమ బస్సులను అడ్డగించి తమపై దాడికి ప్రయత్నించారంటూ ఎమ్మెల్యే సురేంద్రబాబు, ఆ పార్టీ శ్రేణులతో కలిసి జిల్లా ఎస్పీ జగదీష్ కు ఫిర్యాదు చేశారు. ఇందుకు కౌంటర్ గా మరిసటి రోజే ప్రకాష్ రెడ్డి పత్రికా సమావేశం నిర్వహించారు. తాను తన వాహనంలో ప్రయాణిస్తుండగా బుక్కరాయ సముద్రం సమీపంలో సురేంద్రబాబు తన ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కు సంబంధించిన టిప్పర్ తో తనను హత్య చేసేందుకు పెద్దగా కుట్ర పన్నారని, తన వాహన డ్రైవర్ చాకచక్యంతో కుట్ర నుండి తప్పించుకున్నామని ఘాటుగా ఆరోపించారు. ఎమ్మెస్ రాజు ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే అక్రమాస్తులు కూడగట్టారని, అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు చేసారు. ఈ కుట్ర ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రొద్బలంతోనే ఇదంతా జరిగిందని విమర్శించారు. ఎందుకు స్పందించిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్ర బాబు, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ లు రీ కౌంటర్ ఇచ్చారు. జిల్లాలో ఈ వ్యవహారంతో శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడకుండా జిల్లా ఎస్పీ జగదీష్ ప్రత్యేక ఫోకస్ పెట్టారు. నగరంలోని శ్రీ నగర్ కాలనీలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఇంటి వద్ద, అలాగే ఆ సమీపంలోనే వున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నివాసం వద్ద పోలీసు అధికారులు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మరో వైపు పోలీసులు ప్రకాష్ రెడ్డి నివాసంలో తనిఖీలు చేపట్టారు. మారణ ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ముందుగానే ఏర్పాటు చేసుకున్న రాళ్ల కుప్పలను అక్కడి నుండి తొలగించారు. చట్టాన్ని చేతిలోకి తీసుకొని దాడులకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్కడే ఉన్న ప్రకాష్ రెడ్డి తండ్రి, కొందరు వైసిపి శ్రేణులు మహిళా నాయకురాళ్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు అక్కడికి చేరడంతో పరిస్థితిని అదుపు చేయడం కోసం పోలీసులు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డిని, అతన్ని కలిసేందుకు వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ను అరెస్టు చేశారు. పోలీసు సిబ్బంది ఇద్దరినీ బలవంతంగా పోలీసు జీపులు ఎక్కించి పోలీస్ స్టేషన్ కు తరలించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తుననినాదాలు చేస్తూ పోలీసులను అడ్డుకోవడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఉద్రిక్త పరిస్థితుల నడుమ అతి కష్టంపై పోలీసులు వాహనంలో ఎక్కించుకొని స్టేషన్ కు తరలించారు. దీంతో ఉదయం నుండి కొన్ని గంటలపాటు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. దీంతో పోలీసులు ఒక్కసారిగా ఊపిరిపీల్చుకున్నారు.

# విజయవాడలో రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

**విజయవాడ, జులై 9, ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను గురువారం ఉదయం విజయవాడ యంపి కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్‌లు ప్రారంభించారు. విజయవాడలోని పడమట కోనేరు బసవయ్య చౌదరి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 9వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ క్రీడలలో పాల్గొనటం వల్ల దేహదారుడ్యంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు, యువత ప్రతిరోజూ గంటసేపైనా తమకిష్టమైన ఆటలు ఆడాలని సూచించారు. క్రీడలలో పాల్గొనటం వల్ల పేరుప్రఖ్యాతులు వస్తాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ప్రభుత్వం ఉద్యోగవసతి కల్పిస్తుం దన్నారు. క్రీడలలో రాణించి దేశానికి పేరుతీసు కు రావాలని ఆకాం క్షించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్రం లోని వివిధ జిల్లాల క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడుతున్న యంపి కేశినేని చిన్ని ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, శ్రీరాం రాజగోపాల్ తదితరులు

# విమాన సర్వీసులు పెంచాలి

## ఎడ్వయిజరీ కమిటీ ప్రతిపాదన




విమానాశ్రయ ఎడ్వయిజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న యంపి బాలశౌరి

## దుబాయ్, శ్రీలంకకు సర్వీసులు ఏర్పాటు చేయాలి

**గన్నవరం(కృష్ణా), జులై 9, ప్రభాతవార్త :** గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుండి దేశీయ, అంతర్జాతీయ విమానసర్వీసులు మరిన్ని ఏర్పాటు చేయాలని విమానాశ్రయ అడ్వయిజరీ కమిటీలో ప్రతిపాదించారు. గన్నవరం విమానాశ్రయ అడ్వయిజరీ కమిటీ సమావేశం గురువారం విమానాశ్రయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో చైర్మన్, బందరు యంపి వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో కోచైర్మన్ విజయవాడ యంపి కేశినేని చిన్ని, వైస్‌చైర్మన్ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌లు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ నూతన టెర్మినల్ భవనం దసరానాటికి పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఇక్కడి నుండి సింగపూర్, షార్జాకు ఉన్న సర్వీసులకు అదనంగా శ్రీలంకకు నేరుగా విమానసర్వీసులు ఏర్పాటు చేయాలని కమిటీలో ప్రతిపాదించినట్లు తెలిపారు. దుబాయ్‌కి ఎమిరేట్స్ విమానసర్వీసు ప్రారంభం అయితే అమెరికా, యూరప్, ఆఫ్రికా దేశాలకు కనెక్టివిటీ ఉంటుందన్నారు. ఈవిషయాన్ని ఇప్పటికే కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్ళినట్లు బాలశౌరి వివరించారు. వారణాసి, ముంబాయి, కోల్‌కత్తా, కొచ్చిన్, గోవా, తదితర నగరాలకు ఇక్కడి నుండి విమాన సర్వీసులు ప్రారంభించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. గన్నవరం విమానాశ్రయం నుండి విజయవాడ పశ్చిమ బైపాస్‌కు ఏడు కిలోమీటర్ల మేర నాలుగలేన్ల రహదారి నిర్మాణానికి డిపిఆర్ సిద్ధమవుతుందని యంపి తెలిపారు. కోచైర్మన్ కేశినేని చిన్ని మాట్లాడుతూ విమానాశ్రయం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై కమిటీలో చర్చించినట్లు తెలిపారు. ఇక్కడి నుండి కొచ్చిన్, అహ్మదాబాద్‌తోపాటు దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు విమానసర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. వైస్‌చైర్మన్ యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ విమానాశ్రయ విస్తరణకు భూములు ఇచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించాలి ౖ ఉందన్నారు. నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించినప్పటికీ ఇంకా కొందరు రైతులు న్యాయం కోసం ఎదురుచూస్తున్నా రన్నారు. ఎమిరేట్స్ వంటి అంతర్జాతీయ విమానయాన సంస్థలు సర్వీసులు ప్రారంభిస్తే విదేశాల్లో ఉన్న తెలుగువారికి ఉపయుక్తంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేసారు. ఈకార్యక్రమంలో జిల్లాఎస్పీ విద్యాసాగర్ నాయుడు, గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పనుల్లో ఏపికి రెండో ర్యాంకు

**విజయవాడ,జులై9,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పనుల్లో ఏపీకి రెండో ర్యాంకు లభించింది. రోడ్ల నాణ్యత విషయంలో ఏపీ మంచి ప్రమాణాలు పాటిస్తోందని కితాబు లభించింది. నిరంతర సమీక్ష, క్షేత్రస్థాయిలో నాణ్యత పరిశీలన వల్ల ఏపీకీ ర్యాంకు దక్కింది. కొన్ని రోడ్ల నాణ్య తను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. వైఎస్సార్సీపీ హయాంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ 19వ ర్యాంకులో ఉంది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పనుల్లో ఏపీకి రెండో ర్యాంకు రావడం పట్ల "ఎక్స్" వేదికగా హర్షం వ్యక్తం చేశారు.అధికారులను అభినందించారు.

# 14 అసంపూర్తి వంతెనల వినియోగానికి నిధులు మంజూరు

**విజయవాడ,జూలై 9,ప్రభాతవార్తప్రతినిధి:** సుదీర్ఘకాలంగా అసంపూర్తిగా నిలిచిపోయిన 14 వంతెనలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీటి నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడానికి రూ.90.20 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు నిధుల విడుదలకు పరిపాలన ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



# సమస్యలు పరిష్కారం కోసం 14న కలెక్టరేట్ ఎదుట ధర్నా

**చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ళ కాలం గడచిపోయినా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలు ఏ ఒక్కటి నెరవేరలేదని ఫ్యాప్టో నాయకులు ధ్వజమెత్తారు. ఈ పరిస్థితుల్లో ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని నిర్ణయించి ఈ నెల 14వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా, నిరసన, పికెటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో నేతలు పేర్కొన్నారు. చిత్తూరులోని జిల్లా ఎన్జీఓ భవనంలో గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఎఫ్యాప్టో నాయకులు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో ఛైర్మన్ మణిగండన్, సెక్రటరీ జనరల్ ముక్తర్ అహ్మద్, నరోత్తమ్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, జగదీష్, చెంగల్రాయమందడి, చిట్టిబాబు, చలపతి, ముక్తా రహమత్, ఎస్పీ భాషా, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

# 72 అడుగుల మట్టి మహా గణపతిని ఏర్పాటుకు భూమిపూజ

**విజయవాడ, జులై 9, ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో 72 అడుగుల భారీ మట్టి మహా గణపతిని ఏర్పాటు చేసేందుకు భూమిపూజ నిర్వహించారు. డూండి గణేశ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఏడాది విజయవాడలో ప్రతిష్ఠించనున్న పర్యావరణహిత పంచముఖ మట్టి మహా గణపతి విగ్రహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విగ్రహ నమూనాను ఆవిష్కరించారు. భక్తి, సంప్రదాయాలతో పాటు ప్రకృతి పరిరక్షణ కూడా కలిసి నడవాల్సిన అవసరం ఉందని ఎంపీ తెలిపారు.ప్రతి సంవత్సరంలాగే డూండి గణేశ సేవా సమితి ఆధ్వర్యంలో పర్యావరణ హిత మట్టి మహా గణపతి విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



# స్టాల్స్ సందర్శించిన ఎం.రాజేశ్వరి

**నెల్లూరు, జూలై 9, ప్రభాతవార్త-కలెక్టరేట్ :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో భారత ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఎం రాజేశ్వరి, వారి బృందం ఎన్ఆర్ఎల్ఎం కార్యక్ర మాలపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శనలో భాగంగా స్వయం సహాయక సంఘ సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలించి ప్రశంచారు. ప్రదర్శించిన ఉత్పత్తులు ఉదయగిరి ఉడెన్ కట్లరీ, చెక్కనగిషీలు, వాటి ప్యాకింగ్ అద్భుతంగా, ఉన్నాయని ప్రశంచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి. నాగరాజకుమారి, వివిధ రకాల మహిళా వ్యాపారవేత్తలు, డిఆర్‌డిఎ సిబ్బంది పాల్గొన్నారు.



# చిరువ్యాపారులకు విపిఆర్ ఆర్థిక చేయూత

## ఉచితంగా తోపుడు బండ్ల పంపిణీ

**కోవూరు (నెల్లూరు),జులై 9, ప్రభాతవార్త :** స్వశక్తితో జీవనం సాగించే ఒంటరి మహిళలు, వృద్ధ చిరువ్యాపారుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వీపీఆర్ ఫౌండేషన్ ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వశక్తితో తమ కాళ్లపై తాము నిలబడి చిరువ్యాపారాలు చేసుకుంటున్న ఒంటరి మహిళలు, వృద్ధులు ఉపాధి కోసం అద్దెకు తోపుడు బండ్లు తీసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు.

# 9 మండలాలకు 6వేల క్వింటాళ్ల వేరుసెనగ విత్తనాలు

## మిగిలిన మండలాల్లో కన్పించని సబ్సిడీ విత్తనాల జాడ

**చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త:** రైతులకు ఖరీఫ్ పంటలు సాగు చేసుకోవడానికి సీజన్ ప్రారంభానికి ముందు పంపిణీ చేయాల్సిన సబ్సిడీ వేరుసెనగ విత్తనాల జాడ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర రోజులు గడుస్తున్నప్పటికీ కన్పించకపోవడంతో జిల్లా రైతాంగం సబ్సిడీ వేరుసెనగ విత్తనాల కోసం అల్లాడుతున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో సైతం సాధారణ వర్షపాతం నమోదు అయి వుంటే జులై 15 నాటికి రైతులు వేరుసెనగ విత్తనాలను తమ పొలాల్లో విత్తి పూర్తి చేయాల్సి వుంది. అయితే ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఆశించిన వర్షపాతం నమోదు కాకపోవడంతో జులై నెలాఖరు నాటి వరకు వేరుసెనగ విత్తనాలను పొలాల్లో విత్తవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు భరోసా ఇస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలోని వేరుసెనగ సాగు చేసే రైతులకు పంపిణీ చేయడానికి వ్యవసాయశాఖ 27,225 క్వింటాళ్ళ సబ్సిడీ విత్తనాలను కేటాయించింది. అయితే గత నెలన్నర రోజుల నుండి జిల్లాలోని కేవలం 9 మండలాలకు మాత్రమే 6 వేల క్వింటాళ్ళ సబ్సిడీ వేరుసెనగ విత్తనాలు మాత్రమే వచ్చాయి. మిగిలిన మండలాల్లోని రైతులు సబ్సిడీ వేరుసెనగ విత్తనాల కోసం కష్టకష్టాలు పడుతున్నారు. అయితే ప్రభుత్వం కుప్పం, పలమనేరు మండలాల పరిధిలోని కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లి, బైరెడ్డిపల్లి, వి.కోట, పలమనేరు మండలాలతో పాటు జీడినెల్లూరు నియోజకవర్గ పరిధిలోని ఎస్ఆర్ పురం, వెదురుకుప్పం మండలాలకు మాత్రమే 6 వేల వేరుసెనగ సబ్సిడీ విత్తనాలను సరఫరా చేసింది. మిగిలిన మండలాల్లో ఇప్పటి వరకు సబ్సిడీ వేరుసెనగ విత్తనాల జాడ కన్పించడం లేదు.

# అన్న క్యాంటిన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**విజయవాడ, జులై 9, ప్రభాతవార్త :** అన్న క్యాంటిన్‌ను ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా ఆకస్మిక తనిఖీ చేసారు. విజయవాడ కృష్ణలంకలో ఉన్న క్యాంటిన్‌ను గురువారం మధ్యాహ్నం కలెక్టర్ తనిఖీ చేసి క్యాంటిన్‌లో అందిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత, భోజనం వడ్డించే విధానం, లబ్దిదారులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆహార నాణ్యత, రుచి పై లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్న క్యాంటిన్‌లలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలన్నారు. ఆహారం రుచికరంగా ఉండటంతోపాటు, నాణ్యత విషయంలో రాజీపడే ప్రశ్నేలేదన్నారు. రాష్ట్రప్రభుత్వం సామాన్య ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ఈక్యాంటిన్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

10-07pg10_10-07pg10.qxd 09/Jul/26 11:58 PM Page 1



# జెయింట్ల జోరు.. క్వార్టర్ ఫైనల్ హోరు

ప్రపంచాన్ని ఊపేస్తున్న సాకర్ వరల్డ్ కప్ కీలక దశకు చేరుకుంది. లీగ్ దశలో పోటీపడ్డ 48 జట్లలో కేవలం 8 జట్లే మిగిలాయి. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, రన్నరప్ ఫ్రాన్స్‌తో పాటు యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్, బెల్జియం, మొరాకో, నార్వే, ఇంగ్లాండ్ జట్లు క్వార్టర్ ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాయి. ఫ్రాన్స్, మొరాకో మ్యాచ్‌తో కీలక దశ ఆరంభం కానుంది. 11న అర్ధరాత్రి స్పెయిన్‌తో బెల్జియం, 12 తెల్లవారుజామున నార్వేతో ఇంగ్లాండ్, 12 ఉదయం అర్జెంటీనాతో స్విట్జర్లాండ్ తలపడనున్నాయి




* కప్ వేటలో దిగ్గజాల ఢీ
* క్వార్టర్ ఫైనల్ కిక్‌ఆఫ్
* విజేతకే సెమీస్ టికెట్
* విజయం వైపు స్టార్స్ రన్
* మెస్సీ, ఎంబాపె, హాలాండ్ ఫైట్

(వార్త క్రీడా విభాగం)

సాకర్ ప్రపంచకప్ లీగ్ దశలో 48 జట్లు పోటీపడితే అందులో నుంచి 32 జట్లు రౌండ్ ఆఫ్ 32కు చేరాయి. అక్కడి నుంచి 16 జట్లు ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నాయి. ఇప్పుడు క్వార్టర్‌ఫైనల్లో 8జట్లు అమీతుమీకి సిద్ధమ వుతున్నాయి.సాకర్ ప్రపంచకప్‌పై భారీ అంచనాలు పెట్టుకున్న పెద్ద జట్లలో చాలావరకు నిష్క్రమించాయి.జర్మనీ, పోర్చుగల్,నెదర్లాండ్స్, క్రొయేషియా జట్లు ప్రిక్వార్టర్స్‌లోనే ఆటను ముగించాయి.

డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన అర్జెంటీనా తమ స్థాయికి తగ్గట్లే వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఆ జట్టు స్టార్ ఆటగాడు లియోనల్ మెస్సీ 5 మ్యాచ్‌ల్లో 8 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో దూసుకుపోతున్నాడు. 2022 ఫిఫా రన్నరప్ ఫ్రాన్స్ కూడా తమ స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శిస్తూ వస్తోంది. ముఖ్యంగా ఆ జట్టు యువ సంచలనం కైలియన్ ఎంబాపె 5మ్యాచ్‌ల్లో ఏడు గోల్స్‌తో మెస్సీకి సవాల్ విసురుతున్నాడు. నార్వే ఆటగాడు ఎర్లింగ్ హాలండ్, స్పెయిన్ ఆటగాడు లామినే యమాల్ తమ జట్ల విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. మరోవైపు స్పెయిన్, ఇంగ్లండ్‌తో పాటు బెల్జియం తమ స్థాయి ఆటతీరుతో క్వార్టర్స్‌లో అడుగుపెట్టాయి. ఇక ఎవరూ ఊహించని రీతిలో మొరాకో, నార్వే, స్విట్జర్లాండ్ కూడా ప్రిక్వార్టర్స్‌లో అదరగొట్టి క్వార్టర్స్‌లో ప్రవేశించాయి.

### ఫ్రాన్స్ వర్సెస్ మొరాకో

ఫ్రాన్స్- మొరాకో పోరుతో క్వార్టర్స్ సమరం ఆరంభం కానుంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఫ్రాన్స్‌ను ఆపడం మొరాకోకు సవాలే. ఆడిన అయిదు మ్యాచ్‌ల్లోనూ ఫ్రాన్స్ విజయం సాధించింది. నాకౌట్ తొలి మ్యాచ్‌లో స్వీడన్‌ను చిత్తు చేసిన ఆ జట్టు.. జర్మనీని ఇంటిముఖం పట్టించిన పరాగ్వేపై ప్రిక్వార్టర్స్‌లో కాస్త కష్టపడి నెగ్గింది. ఇక మొరాకోను తక్కువగా అంచనా వేయడానికి వీలులేదు. గొప్ప ఫామ్‌లో ఉంది.తొలి నాకౌట్ మ్యాచ్‌లో బలమైన నెదర్లాండ్స్‌ను మట్టికరిపించిన మొరాకో.. తర్వాత కెనడాపై ఘనంగా గెలిచింది. ఏడు గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో మెస్సీతో పోటీ పడుతున్న ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు కిలియన్ ఎంబాపె క్వార్టర్స్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.

### స్పెయిన్ వర్సెస్ బెల్జియం

బలమైన ఆటగాళ్లతో కూడిన ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. స్పెయిన్ ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు కట్టుదిట్టమైన రక్షణతో ఆకట్టుకోగా, బెల్జియం అమెరికాపై 4-1తో విజయం సాధించి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. స్పెయిన్ సమష్టి ఆటపై ఆధారపడుతుండగా, బెల్జియం జట్టు అటాకింగ్ గేమ్ మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.

### నార్వే వర్సెస్ ఇంగ్లాండ్

ఎర్లింగ్ హాలండ్ నేతృత్వంలోని నార్వే, ఇంగ్లాండ్‌ను ఢీకొననుంది. స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలండ్ అద్భుత ఫామ్‌తో నార్వే తొలిసారిగా ప్రపంచకప్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోగా.. జూడ్ బెల్లింగ్‌హామ్, హ్యారీ కేన్ నేతృత్వంలోని ఇంగ్లాండ్ అనుభవాన్ని నమ్ముకుని బరిలోకి దిగుతోంది. బ్రెజిల్‌పై నార్వే సాధించిన విజయం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచగా, మెక్సికోపై ఇంగ్లండ్ విజయంతో నాకౌట్ దశలో తన బలాన్ని చాటుకుంది. హాలాండ్-కేన్ మధ్య గోల్స్ పోటీ మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించే కీలక అంశంగా మారింది.

### అర్జెంటీనా వర్సెస్ స్విట్జర్లాండ్

లియోనెల్ మెస్సీ మ్యాజిక్‌తో అదరగొడుతున్న అర్జెంటీనా... స్విట్జర్లాండ్‌తో తలపడనుంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించే దశనుంచి మూడో గోల్స్‌తో అదరగొట్టి ఈజిప్ట్‌పై 3-2 తేడాతో గెలుపుతో క్వార్టర్స్‌కు వచ్చింది. కొలంబియాను పెనాల్టీ షూటౌట్‌లో ఓడించి స్విట్జర్లాండ్ తొలిసారి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. స్విట్జర్లాండ్ కట్టుదిట్టమైన రక్షణతో ప్రత్యర్థికి గట్టి సవాల్ విసరాలని చూస్తోంది. ఈ మ్యాచ్ ఆసక్తి రేపుతోంది.

## వింబుల్డన్ ఫైనల్లో ముచోవా, నోస్కోవా



**లండన్, జులై 9:** వింబుల్డన్ మహిళల సింగిల్స్ ఫైనల్ ఆల్ చెక్ రిపబ్లిక్ పోరుగా మారింది. చెక్ రిపబ్లిక్ టెన్నిస్ స్టార్స్ కరోలినా ముచోవా, లిండా నోస్కోవా ఫైనల్లో ప్రవేశించారు. మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో ఏడోసీడ్ కోకో గాఫ్‌పై కరోలినా ముచోవా మూడు సెట్ల పోరులో చెమటోడ్చి నెగ్గగా, రెండో సెమీఫైనల్లో లిండా నోస్కోవా అలవోకగా మార్టా కోస్ట్యూక్‌పై గెలుపొందింది.

మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో ఏడో సీడ్, అమెరికా టీనేజ్ సంచలనం కోకో గాఫ్‌ను మూడు సెట్ల పోరులో ముచోవా ఓడించింది. తొలి సెట్‌ను ముచోవా రెండుసార్లు గాఫ్ సర్వీసును కొల్లగొట్టి 6-2తో అలవోకగా నెగ్గి శుభారంభం చేసింది. అయితే తొలిసారి వింబుల్డన్ సెమీఫైనల్ ఆడిన కోకోగాఫ్ ఆ వెంటనే పుంజుకుంది. బలమైన సర్వీసులతో విరుచుకుపడుతూ ఏస్‌లు సంధించింది. ముచోవా సర్వీసును మూడుసార్లు బ్రేక్ చేసి రెండో సెట్‌ను 6-1తో ముగించి సమవుజ్జీగా నిలిచింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో ఇరువురు కొదమ సింహాల్లా తలపడ్డారు.ఎవరి సర్వీసులు వారు నిలబెట్టుకోవడంతో సెట్ ట్రైబ్రేకర్ వరకు కొనసాగింది. రెండు సార్లు గేమ్ పాయింట్లను కాచుకుని ముచోవా చివరకు 12-10తో గెలుపొంది ఫైనల్ చేరింది. రెండో గ్రాండ్ స్లామ్ ఫైనల్ చేరడం ముచోవాకు ఇది రెండోసారి. కాగా ఇప్పటివరకు గ్రాండ్ స్లామ్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ దాటని లిండా నోస్కోవా.. ఈ సారి ఏకంగా ఫైనల్ చేరింది. రెండో సెమీఫైనల్లో 12వ సీడ్ కోస్ట్యూక్‌పై వరుస సెట్లలో 6-4, 6-4తో అలవోకగా గెలుపొందింది.



## వైభవ్ మూడోసారీ

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ నిరాశపరిచాడు.మరోసారి తక్కువ రన్స్‌కే పరిమితమయ్యాడు. రెండో టీ20లాగే జోఫ్రా ఆర్చర్ షార్ట్ పిచ్ బంతికి వైభవ్ దొరికిపోయాడు. తొలి ఓవర్‌లో ఆర్చర్‌ను ఆచితూచి ఆడిన వైభవ్.. రెండో ఓవర్ వేసిన జోష్ టంగ్ బౌలింగ్‌లో వరుసగా ఫోర్, సిక్స్ బాది రిథమ్ అందుకున్నాడు. కానీ తర్వాత ఓవర్‌లో ఆర్చర్ వేసిన షార్ట్‌లెంగ్త్ బంతికి భారీ షాట్ ఆడబోయి వైభవ్ ఔటయ్యాడు. బంతి బ్యాట్ టాప్‌ఎడ్జ్ తీసుకుని గాల్లోకి లేవగా సామ్ కుర్రాన్ క్యాచ్ అందుకున్నాడు. దీంతో 10 బంతుల్లో ఒక ఫోర్, సిక్స్‌తో కేవలం 15 పరుగులు చేసి వైభవ్ ఔటయ్యాడు. వైభవ్ సూర్యవంశీ గత రెండు మ్యాచ్‌లలో 14, 13 పరుగులు నమోదు చేశాడు. మొత్తంగా తన అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో మొదటి మూడు మ్యాచ్‌లలో 42 పరుగులు చేశాడు.

## శ్రేయాస్ కెప్టెన్ ఇన్నింగ్స్



**బ్రిస్టల్, జులై 9:** అయిదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బ్రిస్టల్‌లో జరిగిన నాలుగో టీ20మ్యాచ్‌లోనూ టీమిండియా టాప్ ఆర్డర్ తడబడింది. ఓపెనర్లు అభిషేక్(16), వైభవ్(15), ఫస్ట్‌డౌన్ ఇషాన్ కిషన్(4) విఫలమైనా శ్రేయాస్ అయ్యర్(49 బంతుల్లో 80 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 రన్స్ చేయగలిగింది.టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 48 రన్స్‌కే 3 కీలక వికెట్లు కోల్పోయి మరోసారి తడబడింది. ఈ దశలో కెప్టెన్ శ్రేయాస్ సమయోచితంగా ఆడుతూ శివమ్ దూబె(22)తో కలిసి వంద మార్కు దాటించాడు. నాలుగో వికెట్‌కు 53 రన్స్ జోడించి ఆదుకున్నాడు.ఆ తర్వాత కూడా ఒక వైపు తిలక్ వర్మ(11), వాషింగ్టన్ సుందర్(5), అక్షర్ పటేల్(1) రూపంలో వికెట్లు పడుతున్నా... శ్రేయాస్ అయ్యర్ ధాటిగా ఆడుతూ 33 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. చివరివరకు అజేయంగా నిలుస్తూ భారత్ స్కోరును 150 మార్కు దాటించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో ఆర్చర్, జోష్ టాంగ్ చెరో రెండు వికెట్లు.. విల్ జాక్స్, అదిల్ రషీద్ చెరో వికెట్ పడగొట్టారు.

## విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, జులై 9:** రెండు సెషన్లలో నష్టాలు చవిచూసిన స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిసాయి. గ్లోబల్ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, రూపాయి స్థిరత్వం, తొలి త్రైమాసిక ఫలితాల సీజన్‌పై సానుకూల అంచనాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 238.22పాయింట్లు పెరిగి 76,741.82వద్దముగిస్తే ఎన్ఎస్ఈ నిఫ్టీ 80.75 పాయింట్లు లేదా 0.34 శాతం లాభపడి 23,962.80వద్ద స్థిరపడింది.దీంతో నిఫ్టీ 23,950 మార్క్‌ను అధిగమించింది. గత రెండు ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 2.25 శాతం, సెన్సెక్స్ 2.28 శాతం చొప్పున క్షీణించాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.41 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.69 శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్‌లో కొనుగోళ్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది.

బీఎస్ఈలో 2,896షేర్లు లాభాల్లో ముగియగా, 1,342 షేర్లు మాత్రమే నష్టపోయాయి. 190 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. పీఎస్‌యూ బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్‌కు డిమాండ్ సెక్టార్ల వారీగా చూస్తే ప్రభుత్వ రంగ బ్యాంకులు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు మంచి లాభాలు నమోదు చేశాయి.ఐటీ,ఆటో రంగ షేర్లు మాత్రం ఒత్తిడిలో కొనసాగాయి. నిఫ్టీ లాభాలకు ప్రధానంగా సన్ ఫార్మాస్యూటికల్స్ 2.78, భారతి ఎయిర్‌టెల్ 2.49, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్0.83 శాతం చొప్పున మద్దతునిచ్చాయి. రూపాయి,కమోడిటీలువిదేశీ మారక ద్రవ్య మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.41 వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్లో సెప్టెంబర్ డెలివరీ బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 44 సెంట్లు లేదా 0.56 శాతం పెరిగి 78.46 డాలర్లకు చేరుకుంది.

భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.75 శాతం వద్ద కొనసాగగా, ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ 0.51శాతం పెరిగి 10గ్రాములకు రూ.1,44,449వద్ద ట్రేడయ్యాయి. టిసిఎస్ షేరు స్వల్పంగా 0.07శాతం లాభపడింది. రెడ్డీస్ ల్యాబొరేటరీస్ షేరు 5.77శాతం క్షీణించింది.ప్రీమియర్ ఎనర్జీస్. ఫీనిక్స్ మిల్స్ షేరు 3.34శాతం లాభపడ్డాయి. ఇతర కంపెనీలుఎన్టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ నుంచి రూ.558.29 కోట్ల సౌర పీవీ మాడ్యూల్స్ సరఫరా ఆర్డర్ లభించడంతో ఇన్‌సొలేషన్ ఎనర్జీ షేరు 11.80 శాతం ఎగిసింది. ఈ అండ్ సీ గ్లోబల్ 2.47 శాతం పెరిగింది. డెలివరీ షేరు 2.67 శాతం లాభపడింది. యునో మిండా షేరు 2.22 శాతం పెరిగింది. సోలెక్స్ ఎనర్జీ 2.21 శాతం, రాజేష్ పవర్ సర్వీసెస్ 3.76 శాతం పెరిగింది. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ 1.40 శాతం లాభపడింది. ఇక ఐపిఒల పరంగాచూస్తే కుసుమ్‌గర్ ఐపీఓకు మంచి స్పందన లభించింది.1.14 కోట్ల షేర్ల ఆఫర్‌కు 14.57 కోట్ల షేర్లకు బిడ్లు రావడంతో ఈ ఇష్యూ 12.71 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జూలై 10న ముగియనుంది. ధరల శ్రేణి ఒక్కో షేరుకు రూ.398 నుంచి రూ.419గా నిర్ణయించారు.లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా ఐపీఓకు మాత్రం మందగించిన స్పందన లభించింది.


2.55 కోట్ల షేర్ల ఆఫర్‌కు వ్యతిరేకంగా కేవలం 38.67 లక్షల షేర్లకు మాత్రమే బిడ్లు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 0.15 రెట్లు మాత్రమే సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ జూలై 13న ముగియనుండగా, ధరల శ్రేణి ఒక్కో షేరుకు రూ.203 నుంచి రూ.214గా నిర్ణయించారు.

## 98శాతం వెనక్కివచ్చిన రూ.2వేల కరెన్సీనోట్లు: ఆర్బీఐ

**ముంబయి, జులై 9:** దేశంలో చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో దాదాపు 98.47 శాతం వెనక్కి వచ్చినట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) వెల్లడించింది. దాదాపు మూడేళ్ల క్రితం ఈ నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఆర్బీఐ, తాజాగా ప్రస్తుతపరిస్థితిపై గణాంకాలను విడుదల చేసింది.కరెన్సీ నిర్వహణలో భాగంగా 2023 మే 19న రూ.2000 నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో మార్కెట్‌లో మొత్తం రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు ఉన్నాయి. తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి చెలామణిలో ఉన్న నోట్ల విలువ కేవలం రూ.5,451 కోట్లకు తగ్గిందని ఆర్బీఐ తెలిపింది. రూ.2000 నోట్లను మార్చుకునేందుకు దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ ఇష్యూ కార్యాలయాల్లో ఇప్పటికీ సౌకర్యం అందుబాటులో ఉంది. నోట్లను ఉపసంహరించుకున్నప్పటికీ, అవి చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయని (లీగల్ టెండర్) ఆర్బీఐ మరోసారి స్పష్టం చేసింది.






## టిసిఎస్ నికరలాభం రూ.13,349 కోట్లు

**ముంబయి, జులై 9:** దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ(టీసీఎస్) తొలి త్రైమాసికంలో నికర లాభం 4.6 శాతం పెరిగి రూ.13,349 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదేకాలంలో కంపెనీ రూ.12,760 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. కంపెనీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. తొలి త్రైమాసికంలో ఆదాయం 13.9 శాతం వృద్ధితో రూ.72,275 కోట్లకు చేరుకోగా, గత ఏడాది ఇదే కాలంలో అది రూ.63,437 కోట్లుగా ఉంది. వరుస త్రైమాసిక ప్రాతిపదికన ఆదాయం 2.2 శాతం పెరిగింది.స్థిరకరెన్సీ ప్రాతిపదికన ఆదాయం 0.4శాతం వృద్ధిని నమోదు చేసింది. టీసీఎస్ ఆదాయం అంచనాలను మించి నమోదవగా, నికర లాభం మాత్రం స్వల్పంగా అంచనాలకు దిగువన నిలిచింది. అంచనాల ప్రకారం కంపెనీ ఆదాయం రూ.71,862 కోట్లు, నికర లాభం రూ.13,394 కోట్లుగా ఉంటుందని భావించారు.ప్రపంచ ఆర్థికఅనిశ్చితులు,ఏఐ ప్రభావం కారణంగా ఈ త్రైమాసికం సవాళ్లతో కూడుకున్నప్పటికీ కంపెనీ పనితీరు అంచనాలకు అనుగుణంగానే ఉందని పేర్కొంటున్నారు. ఎస్‌కెఎఫ్ సంస్థతో 80 కోట్ల డాలర్ల మెగా ఒప్పందం, సర్వీస్‌నౌ తో బహుళ మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. తొలి త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆర్డర్ బుక్ 9.5 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

## రూ.12వేల కోట్ల టార్గెట్‌తో ఎస్‌బిఐ ఫండ్స్ ఐపీఓ

**ముంబయి, జులై 9:**ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ అనుబంధంగా ఉన్న ఎస్‌బిఐ ఫండ్స్ ఐపిఒకు వస్తోంది. జూలై 14 నుంచి సబ్‌స్క్రిప్షన్లు ప్రారంభం కానున్నాయి.రూ.11,693 కోట్ల విలువైన ఈ ఐపీఓకు కంపెనీ ఒక్కో షేరుకు రూ.545 నుంచి 574 వరకు ధరల శ్రేణిని నిర్ణయించింది. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ విధానంలో జరగనుండగా, ముఖ విలువ రూ.1 గల గరిష్ఠంగా 20.37 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు.

2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది.ప్రైస్‌బ్యాండ్ గరిష్ఠ స్థాయి ప్రకారం కంపెనీ మార్కెట్ విలువ రూ.1.17 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉంది.ఎస్‌బీఐ వాటాదారులకు ప్రత్యేక కోటాఈ ఐపీఓలో అర్హత కలిగిన ఎస్‌బీఐ వాటాదారుల కోసం మొత్తం ఇష్యూలో సుమారు 1.306 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రత్యేకంగా కేటాయించారు. గరిష్ఠ ధర ప్రకారం ఈ రిజర్వేషన్ విలువ దాదాపు రూ.750కోట్లుగా ఉంటుంది.అయితే రిటైల్ ఇన్వెస్టర్లకు కొన్ని ఐపీఓల్లో ఇచ్చే విధంగా ఎస్‌బీఐ వాటాదారులకు ఎలాంటి ధర రాయితీ ఉండదు.వారు నిర్ణయించిన ప్రైస్ బ్యాండ్ పరిధిలోనే బిడ్ చేయాల్సి ఉంటుంది. అర్హత కలిగిన ఎస్‌బీఐ ఉద్యోగుల కోసం రూ.170 కోట్ల విలువైన షేర్లను రిజర్వ్ చేయగా,వారికి ఒక్కోషేరుపైరూ.54చొప్పున డిస్కౌంట్ అందించనున్నారు.ఎస్‌బీఐఫండ్స్ మేనేజ్‌మెంట్ ఉద్యోగుల కోసం 2,70,271 ఈక్విటీ షేర్లు,అర్హత కలిగిన ఎస్‌బీఐ ఉద్యోగుల కోసం సుమారు 29.9 లక్షల ఈక్విటీ షేర్లను ప్రత్యేకంగా కేటాయించారు.




## అధునాతన ఫీచర్లతో నిస్సాన్ టెక్టాన్



**ముంబయి, జులై 9:** మిడ్‌సైజ్ ఎస్‌యూవీ విభాగంలో పోటీని మరింత పెంచుతూ నిస్సాన్ భారత్‌లో టెక్టన్ కొత్త మోడల్ విడుదల చేసింది. 2023లో కిక్స్ నిలిపివేసిన తర్వాత నిస్సాన్ నుంచి వస్తున్న తొలి మిడ్‌సైజ్ ఎస్‌యూవీ ఇదే. మార్కెట్‌లో ఇప్పటికే ఉన్న ఎస్‌యువి మోడళ్లకు ఇది పోటీ ఇవ్వనుంది. టెక్టన్‌లో రెండు టర్బో పెట్రోల్ ఇంజిన్ ఆప్షన్లు ఉన్నాయి. 1.0 లీటర్ ఇంజిన్ 100 బీహెచ్‌పీ శక్తి, 166 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనికి 6 స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ ఇచ్చారు. లీటర్‌కు 19.4 కిలోమీటర్ల మైలేజ్ వస్తుందని కంపెనీ చెబుతోంది. 1.3లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ 163 బీహెచ్‌పీ శక్తి, 280 ఎన్‌ఎం టార్క్‌ను అందిస్తుంది.ఈ వేరియంట్‌లో 6స్పీడ్ మాన్యువల్, డీసీటీ ఆటోమేటిక్ గేర్‌బాక్స్ ఉన్నాయి. దీని మైలేజ్ లీటర్‌కు 18.5 కిలోమీటర్లుగా ప్రకటించింది. డిజైన్ పరంగా టెక్టన్‌కు బలమైన లుక్ ఇచ్చారు. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, కనెక్టెడ్ డీఆర్ఎల్స్, 18 అంగుళాల అలాయ్ వీల్స్, కనెక్టెడ్ ఎల్ఈడీ టెయిల్‌ల్యాంప్‌లు ఆకట్టుకుంటాయి. లోపల 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్, 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను అందించారు.

## ఎంఎఫ్‌లోకి ఆనంద్‌రాఠీ వెల్త్

**ముంబై, జులై 9:** వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ ఆనంద్ రాఠీ వెల్త్ లిమిటెడ్ తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభంలో గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది. అధిక ఆదాయం కారణంగా కంపెనీ లాభాలు దాదాపు 60శాతం పెరిగాయి.ఇదే సమయంలో, మ్యూచువల్ ఫండ్ వ్యాపారంలోకి ప్రవేశించేందుకు సెబీకి దరఖాస్తు చేయాలని నిర్ణయించింది. కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం మార్చి త్రైమాసికంలోని రూ.102 కోట్ల నుంచి జూన్ త్రైమాసికంలో రూ.163 కోట్లకు చేరి 59.7 శాతం పెరిగింది.

అదే కాలంలో మొత్తం ఆదాయం రూ.344 కోట్ల నుంచి రూ.422 కోట్లకు పెరిగి 22.6 శాతం వృద్ధిని ఆనంద్ రాఠీ వెల్త్ లిమిటెడ్ నమోదు చేసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps